


RNI NO:TELTEL/ 2023/89546

# సూర్య రేఖ

తెలుగు దినపత్రిక



## విలేకరులు కావలెను

సమాజంలో మీ కోసం.. మీరు ప్రశ్నించాలని అనుకుంటున్నారా.. అన్యాయాలను అక్రమాలను వెలుగులోకి తీసుకురావాలి అనుకుంటున్నారా.. ఇంతే కాకుండా సామాజిక నైపు ణ్యం.. సాంస్కృతిక అవగాహన..మీ ద్వారా కల్పించాలనుకుంటున్నారా.. అయితే అక్షర పంజా విసరడానికి మీ ముందుకు వచ్చింది సూర్య రేఖ తెలుగు దినపత్రికకు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. ఆసక్తి కలవారు క్రింది నంబరును సంప్రదించగలరు.

సీనియర్లకు ప్రాధాన్యం

సంప్రదించవలసిన నెం : 9397303326



రంగారెడ్డి | సంపుటి : 2 | సంచిక : 429 | పేజీలు : 12 | ఎడిటర్ : ఎం ప్రేమ్‌రాజ్ | ఆదివారం 19 ఏప్రిల్ 2026 | వెల : 4/-




## మరో బిల్లు తీసుకొస్తే
# అడ్డుకుంటాం

- 2023 మహిళా బిల్లును సోమవారం పార్లమెంట్‌లో పెట్టాలి
- సీఎం రేవంత్ రెడ్డి డిమాండ్
- కేంద్ర ప్రభుత్వంపై తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం
- మహిళా బిల్లు పేరుతో డీలిమిటేషన్ బిల్లు తీసుకువచ్చిందని వెల్లడి
- మహిళా బిల్లు వీగిపోవడంతో ప్రతిపక్షాలపై అసత్యప్రచారం చేస్తున్నారన్న సీఎం
- రాజకీయం చేయాల్సిన అవసరం లేదు

హైదరాబాద్

మహిళా బిల్లు పేరుతో డీలిమిటేషన్ బిల్లు తీసుకువచ్చిందని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఢిల్లీలో ముఖ్యమంత్రి మీడియా సమావేశంలో మాట్లాడారు. మహిళా బిల్లు వీగిపోవడం బీజేపీ విధానాల ఓటమిగా భావించాలని, మహిళా బిల్లు వీగిపోవడంతో ప్రతిపక్షాలపై అసత్యప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలకు కాంగ్రెస్ పార్టీ చాలా చేసిందని, మహిళా బిల్లుపై ప్రధాని మోదీకి నిజాయితీ లేదని సీఎం తెలిపారు. నిజాయితీగా మహిళా రిజర్వేషన్ల బిల్లు తీసుకువస్తే పార్లమెంట్‌లో అందరూ మద్దతు తెలిపేవారని అన్నారు. మహిళా బిల్లు పేరుతో డీలిమిటేషన్ బిల్లు తీసుకువచ్చి దక్షిణాదికి అన్యాయం చేసేవారని తెలిపారు. ప్రధాని మోదీ ఉత్తర, దక్షిణ భారతదేశం మధ్య అంతరాలు పెట్టే విధానాన్ని విరమించుకోవాలని హితవు పలికారు. మహిళా రిజర్వేషన్ల బిల్లుపై తమకు చిత్తశుద్ధి ఉందని, కేంద్రానికి ఆర్థిక వనరులు దక్షిణాది నుంచి అందుతున్నాయని పేర్కొన్నారు. యూపీ ఎన్నికలలోపు మహిళా రిజర్వేషన్ల బిల్లు అమలు చేయాలని, 2023 మహిళా రిజర్వేషన్ల బిల్లును యథావిధిగా అమలు చేయాలని, మహిళా రిజర్వేషన్లలోనూ ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్

- మిగతా3లో



## వేసవి తాపానికి గుడ్‌బై!

- ఈ నెల 26 వరకు వర్షాలు కురిసే అవకాశం
- గంటకు 30 నుంచి 40 కి.మీ వేగంతో ఈదురుగాలులు
- వర్షాలతో గరిష్ఠ ఉష్ణోగ్రతల్లో స్వల్ప మార్పు ఉండే అవకాశం ఉందన్న వాతావరణశాఖ

## 2శాతం డీఏ పెంపు, గ్రామాలకు రూ.83వేల కోట్లు, కొత్త రైల్వే ప్రాజెక్టులకు ఆమోదం



- కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు
- కేంద్ర ఉద్యోగులు, పెన్షనర్లకు 2%డీఏ పెంపు
- జనవరి 2026 నుంచి అమలు
- గ్రామీణ రహదారులకు రూ.83,977 కోట్లతో పీఎంజీఎస్‌వై పొడిగింపు
- ఏపీలో రాజమండ్రి, విశాఖ మధ్య కొత్త రైల్వే లైన్లు



## విపక్షాలు భారీ మూల్యం
# చెల్లించుకుంటాయ్

- జీవితాంతం ఆ విషయంలో చింతిస్తాయ్
- విపక్షాలు జీవితాంతం పశ్చాత్తాపపడతాయని ప్రధాని మోదీ వ్యాఖ్యలు
- మహిళల హక్కులను అడ్డుకున్నారని కిరణ్ రిజిజు ఆరోపణలు
- మహిళల ఆశలను తుంగలో తొక్కినట్లయింది

## దక్షిణాది రాష్ట్రాలను బలహీనపర్చే ప్రయత్నం



- భారత్ అనే భావనను పరిరక్షించడానికే బిల్లును ఓడించాం
- డీలిమిటేషన్‌పై రాహుల్ గాంధీ
- పార్లమెంట్‌లో ప్రతిపక్షాలు కలిసి బిల్లును అడ్డుకున్నామన్న రాహుల్
- దక్షిణాది, ఈశాన్య రాష్ట్రాల బలం తగ్గించడమే కేంద్ర లక్ష్యమని విమర్శ
- తమిళనాడు సంస్కృతి, భాషపై బీజేపీ-ఆర్ఎస్ఎస్ దాడి చేస్తున్నాయన్న ఆరోపణ

## ప్రజాస్వామ్యానికి అతిపెద్ద విజయం



- ప్రభుత్వానికి చీకటిరోజు
- మహిళా రిజర్వేషన్ల బిల్లుపై ప్రియాంక గాంధీ
- మహిళా రిజర్వేషన్ల బిల్లుపై ప్రియాంక గాంధీ కీలక వ్యాఖ్యలు
- రాజకీయ ప్రయోజనాల కోసమే బిల్లును తీసుకొచ్చినట్లు వ్యాఖ్య
- కేంద్రంపై విమర్శలు

## రాష్ట్రంలో రోజువారీ కూలీల్లో
# ఎస్సీలే అధికం

- తక్కువ వేతనాలు వచ్చే వృత్తులపైనే జీవనం
- 13 శాతం మందికి నో టాయిలెట్స్
- రోజువారీ కూలీల్లో అత్యధిక సంఖ్యలో ఎస్సీలోనే ఉన్నారని సర్వేలో వెల్లడి
- స్వయంగా సాగు చేసుకునే రైతులు 11 శాతం మాత్రమే
- బీసీల్లో జనాభాకు తగ్గట్టుగా దినసరి కూలీలు



హైదరాబాద్

రాష్ట్రంలోని ఎస్సీల్లో రోజువారీ కూలీలే అత్యధిక సంఖ్యలో ఉన్నారని సమగ్ర కుటుంబ సర్వే నివేదిక వెల్లడించింది. షెడ్యూల్డ్ కులాల వారిలో 25 శాతం మంది దినసరి కూలీలుగా, 29 శాతం మంది ఉపాధి హామీ పథకాల కింద కూలీలుగా, 27 శాతం మంది వ్యవసాయ కూలీలుగా పని చేస్తున్నారు. కేవలం 11 శాతం మంది మాత్రమే స్వయంగా సాగు చేసుకునే రైతులు ఉన్నారు. మొత్తం జనాభాలో 17.4 శాతంగా ఉన్నప్పటికీ వివిధ రంగాల్లో దీనికి తగినంత ప్రాతినిధ్యం లేదు. 7 శాతం మంది మాత్రమే వ్యాపారాలు లేదా అనుబంధ రంగాల్లో వారి పని వారు చేసుకుంటున్నారు. ఇక షెడ్యూల్డ్ తెగల విషయానికి వస్తే 13 శాతం మంది రోజువారీ కూలీలుగా, 12 శాతం మంది ఉపాధి హామీ

- మిగతా3లో

## మహిళలకు మరోసారి
# అన్యాయం



- కాంగ్రెస్ పార్టీపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆగ్రహం
- మహిళలకు మరోసారి అన్యాయం చేసిందని వెల్లడి
- రాజకీయాల్లోకి రావాలనుకునే మహిళల ఉత్సాహంపై నీళ్లు చల్లారని విమర్శ
- కాంగ్రెస్ పార్టీ, బీఆర్ఎస్ ను కలిపింది ఎంఐఎం పార్టీయే

హైదరాబాద్

కాంగ్రెస్ పార్టీ మహిళలకు మరోసారి అన్యాయం చేసిందన్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి నియోజకవర్గాల పునర్విభజన జరగాలని గతంలో చేసిన చట్టంలోనే ఉందని తెలిపారు. దక్షిణాది రాష్ట్రాలకు న్యాయం జరిగేలా మంచి ఫార్ములాను ప్రధాని నరేంద్ర మోదీ తీసుకువచ్చారని కొనియాడారు. బిల్లును అడ్డుకుని కాంగ్రెస్ పార్టీ చారిత్రక తప్పిదం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వరసగా ఎన్నికల్లో

- మిగతా3లో



## హార్ముజ్ వద్ద ఉద్రిక్తత..
## రెండు నౌకలపై కాల్పులు

జలసంధి దాటిన భారత నౌకలు

## పార్లమెంటు ఉభయసభల నిరవధిక వాయిదా

- మహిళా రిజర్వేషన్లపై రాజ్యసభలో ప్రైవేటు బిల్లు
- ముగిసిన పార్లమెంటు బడ్జెట్ సెషన్
- 3 రోజుల ప్రత్యేక సెషన్‌లో ఆమోదానికి నోచుకోని బిల్లులు
- స్పీకర్ ఓం బిర్లాను కలిసిన ప్రధాని, కేంద్ర మంత్రులు, ఎంపీలు



# విపక్షాలు భారీ మూల్యం చెల్లించుకుంటాయ్

పార్లమెంటులో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు తీసుకొచ్చిన కీలక రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం పొందకపోవడంపై ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. విపక్షాల వైఖరి దేశ మహిళలకు అన్యాయం చేసిందని, ఈ విషయంలో వారు జీవితాంతం చింతించాల్సి వస్తుందని మండిపడ్డారు. కేంద్ర కేబినెట్ సమావేశంలో ఈ అంశంపై మోదీ స్పష్టంగా స్పందించినట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. శనివారం జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశానికి అధ్యక్షత వహించిన మోదీ, మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకోవడం ద్వారా విపక్షాలు తమ అసలు స్వరూపాన్ని బయటపెట్టాయని అన్నారు. దేశంలోని ప్రతి గ్రామానికి ఈ విషయాన్ని తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. మహిళల ఆశలను తుంగలో తొక్కినట్లయిందని, ఈ నిర్ణయం రాజకీయంగా కూడా విపక్షాలకు భారీ మూల్యం చెల్లింపజేస్తుందని హెచ్చరించారు.

**బిల్లును అడ్డుకోవడం ఘోర పాపం: రిజిజు**

ఇదే విషయంపై పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు కూడా తీవ్రంగా స్పందించారు. మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకోవడం ఘోర పాపమని ఆయన విమర్శించారు. మహిళలకు హక్కులు కల్పించే చట్టాన్ని అడ్డుకోవడం దుర్మార్గమని, దానిపై సంబరాలు చేసుకోవడం మరింత దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. బిల్లును అడ్డుకున్న విపక్ష నేతలు మహిళా వ్యతిరేకులుగా నిలిచిపోయారని అన్నారు.



**రాహుల్ సమాధానం చెప్పాలని డిమాండ్**

లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఈ బిల్లును ఎలా అప్రజాస్వామికమని చెబుతున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలని రిజిజు డిమాండ్ చేశారు. కేంద్రానికి మహిళా రిజర్వేషన్ అమలు చేయాలనే స్పష్టమైన సంకల్పం ఉన్నప్పటికీ, విపక్షాలు అడ్డంకులు సృష్టించాయని ఆరోపించారు. డీలిమిటేషన్ అంశాన్ని సాకుగా చూపిస్తూ బిల్లును అడ్డుకోవడం సరైన విధానం కాదని అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు సంబంధించిన ఓటింగ్ లోక్‌సభలో తీవ్ర ఉద్రిక్తతల మధ్య జరిగింది. మొత్తం 528 మంది సభ్యులు ఓటింగ్‌లో పాల్గొన్నారు. అందులో 298 మంది బిల్లుకు అనుకూలంగా ఓటు వేయగా, 230 మంది వ్యతిరేకంగా ఓటు వేశారు. అయితే రాజ్యాంగ సవరణ బిల్లుకు అవసరమైన రెండు మూడవ వంతు మెజారిటీ (352 ఓట్లు) రాకపోవడంతో బిల్లు తిరస్కరణకు గురైంది. బిల్లు ద్వారా లోక్‌సభ, రాష్ట్ర శాసనసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించాలనే లక్ష్యంతో పాటు, డీలిమిటేషన్ ప్రక్రియ అనంతరం స్థానాల సంఖ్యను పెంచే ప్రతిపాదన కూడా ఉంది. 2029 ఎన్నికల నాటికి ఈ రిజర్వేషన్ అమల్లోకి తీసుకురావాలని కేంద్రం భావించింది. అయితే విపక్షాలు ఈ విధానంపై అనేక అభ్యంతరాలు వ్యక్తం చేశాయి. ప్రధానంగా, డీలిమిటేషన్ తర్వాత దక్షిణ రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గే అవకాశం ఉందని విపక్షాలు ఆందోళన వ్యక్తం చేశాయి. అలాగే, కేంద్రం రాజకీయ లాభం కోసం ఈ బిల్లును ఉపయోగించుకుంటోందని కూడా ఆరోపించాయి. మహిళా రిజర్వేషన్‌కు తమ మద్దతు ఉన్నప్పటికీ, అమలు విధానం పట్ల అభ్యంతరాలు ఉన్నాయని విపక్షాలు స్పష్టం చేశాయి. ఇక కేంద్రం మాత్రం ఈ ఆరోపణలను ఖండించిం ది. మహిళల సాధికారత కోసం తీసుకొచ్చిన చట్టాన్ని అడ్డుకోవడం ద్వారా విపక్షాలు తమ నిజ స్వరూపాన్ని చూపించాయని పేర్కొంది. మహిళల ఆగ్రహాన్ని వారు తప్పక ఎదుర్కోవాల్సి వస్తుందని కిరణ్ రిజిజు హెచ్చరించారు. ఈ పరిణామం దేశ రాజకీయాల్లో పెద్ద చర్చకు దారితీసింది. మహిళా రిజర్వేషన్ అంశం మరోసారి జాతీయ రాజకీయాల్లో ప్రధాన అజెండాగా మారింది. ముందున్న రోజుల్లో ఈ అంశంపై కేంద్రం, విపక్షాల మధ్య మరింత రాజకీయ పోరు కొనసాగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# దక్షిణాది రాష్ట్రాలను బలహీనపర్చే ప్రయత్నం

తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికల వేడి పెరుగుతున్న వేళ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర ఆరోపణలు చేశారు. మహిళా రిజర్వేషన్ బిల్లు పేరుతో పార్లమెంట్‌లో తీసుకొచ్చిన తాజా రాజ్యాంగ సవరణ వెనుక అసలు ఉద్దేశం నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) అని ఆయన విమర్శించారు. దేశం అనే భావనను, రాష్ట్రాల సమాఖ్య వ్యవస్థను రక్షించడానికే ప్రతిపక్షాలు ఏకమై ఆ బిల్లును ఓడించాయని స్పష్టం చేశారు. తిరువల్లూరు జిల్లా పొన్నేరిలో జరిగిన ఎన్నికల ప్రచార సభలో పాల్గొన్న రాహుల్ గాంధీ, కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన బిల్లుపై విస్తృతంగా మాట్లాడారు. 2023లోనే మహిళా రిజర్వేషన్ బిల్లుకు ఆమోదం లభించినప్పటికీ, మళ్లీ అదే పేరుతో బిల్లు తీసుకురావడం వెనుక దాగి ఉన్నది డీలిమిటేషన్ అని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రక్రియ ద్వారా రాష్ట్రాల వారీగా లోక్‌సభ స్థానాల సంఖ్యలో మార్పులు చేసి దక్షిణాది రాష్ట్రాలను బలహీనపర్చే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు.

**దేశ సమాఖ్య వ్యవస్థకు విరుద్ధం**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా దేశ ప్రజలకు అసలు నిజం చెప్పలేదని రాహుల్ గాంధీ అన్నారు. మహిళల ప్రాతినిధ్యం పెంచడమే లక్ష్యమని చెప్పినా, ఆ బిల్లులో "దురుద్దేశపూరిత ఆలోచన" దాగి ఉందని విమర్శించారు. దేశ ఎన్నికల మ్యాప్‌ను మార్చి కొన్ని రాష్ట్రాల ప్రభావాన్ని తగ్గించాలనే ప్రయత్నమని పేర్కొన్నారు. అసోం, జమ్మూకశ్మీర్ రాష్ట్రాల్లో ఇప్పటికే ఎన్నికల నియోజకవర్గాల



పునర్విభజన చేసి రాజకీయ సమీకరణాలను మార్చారని, అదే నమూనాను దేశమంతటా అమలు చేయాలని కేంద్రం చూస్తోందని ఆయన ఆరోపించారు. ఇది దేశ సమాఖ్య వ్యవస్థకు విరుద్ధమని, రాష్ట్రాల స్వరాన్ని అణగదొక్కే చర్యగా ఆయన అభివర్ణించారు. భారతదేశం ఒక రాష్ట్రాల సమాఖ్య అని రాజ్యాంగంలో స్పష్టంగా ఉందని రాహుల్ గాంధీ గుర్తు చేశారు. ప్రతి రాష్ట్రానికి తనకంటూ ప్రత్యేక గుర్తింపు, సంస్కృతి, భాష, సంప్రదాయాలు ఉన్నాయని చెప్పారు. వాటిని రక్షించుకోవడం ప్రతి రాష్ట్ర హక్కు అని అన్నారు. ప్రతి రాష్ట్రం స్వేచ్ఛగా తమ అభిప్రాయాలను వ్యక్తం చేయగలగాలి అని ఆయన అభిప్రాయపడ్డారు. తమిళనాడుతో తనకు ఉన్న అనుబంధాన్ని కూడా ఈ సందర్భంగా రాహుల్ గాంధీ ప్రస్తావించారు. తమిళనాడు ప్రజలతో తనకు ప్రత్యేకమైన బంధం ఉందని, ఇక్కడికి వచ్చినప్పుడు సొంత ఇంటికి వచ్చిన భావన కలుగుతుందని చెప్పారు. జమ్మూకశ్మీర్‌కు వెళ్లినప్పుడు కలిగే అనుభూతి ఇక్కడ కూడా ఉంటుందని ఆయన అన్నారు. అయితే, గత కొన్ని సంవత్సరాలుగా బీజేపీ, ఆర్ఎస్ఎస్ కలిసి తమిళ భాష, సంస్కృతి, సంప్రదాయాలపై దాడి చేస్తున్నాయని రాహుల్ గాంధీ ఆరోపించారు. ఇది రాష్ట్ర గుర్తింపును దెబ్బతీసే ప్రయత్నమని అన్నారు. తమిళనాడును ఢిల్లీ నుంచి నియంత్రించాలని బీజేపీ ప్రయత్నిస్తోందని విమర్శించారు. పార్లమెంట్‌లో జరిగిన పరిణామాలపై మాట్లాడిన ఆయన, ప్రతిపక్షాలు ఒక పెద్ద రాయిలా నిలబడి ఆ బిల్లును అడ్డుకున్నాయని చెప్పారు. దేశ ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడడంలో ఇది కీలక ఘట్టమని అన్నారు. డీలిమిటేషన్‌ను రాజకీయ ఆయుధంగా ఉపయోగించాలనే ప్రయత్నాన్ని విఫలపరిచామని పేర్కొన్నారు. ఇక తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల విషయానికొస్తే, ఏప్రిల్ 23న ఒకే దశలో పోలింగ్ జరగనుంది. మే 4న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. ఈ ఎన్నికల్లో డీఎంకే నేతృత్వంలోని కూటమి, ఎన్‌డీఏ మధ్య ప్రధాన పోటీ ఉండనుంది. కాంగ్రెస్ పార్టీ డీఎంకే కూటమిలో భాగంగా 28 స్థానాల్లో పోటీ చేస్తోంది. రాహుల్ గాంధీ ఈ ఎన్నికలను కేవలం ప్రభుత్వ మార్పు కోసం కాకుండా, రాష్ట్ర హక్కులను రక్షించే పోరాటంగా అభివర్ణించారు. తమిళనాడు భవిష్యత్తును తమిళ ప్రజలే నిర్ణయించాలనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. బీజేపీ–ఆర్ఎస్ఎస్ శక్తులు రాష్ట్రంపై ఆధిపత్యం సాధించకుండా అడ్డుకోవడమే తమ లక్ష్యమని తెలిపారు.


## 2శాతం డీఏ పెంపు, గ్రామాలకు రూ.83వేల కోట్లు,

# కొత్త రైల్వే ప్రాజెక్టులకు ఆమోదం

కేంద్ర కేబినెట్ శనివారం పలు కీలక నిర్ణయాలను ఆమోదించింది. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు ఉపశమనం కలిగించే విధంగా కరవు భత్యం (డీఏ), డియర్‌నెస్ రిలీఫ్ (డీఆర్) ను 2 శాతం పెంచింది. ప్రస్తుతం ఉన్న 58 శాతం డీఏను 60 శాతానికి పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఈ పెంపు 2026 జనవరి 1 నుంచి అమల్లోకి రానుంది. ఈ నిర్ణయం వల్ల దేశవ్యాప్తంగా సుమారు 50 లక్షల కేంద్ర ఉద్యోగులు, 68 లక్షల పెన్షనర్లు లాభపడనున్నారు. ధరల పెరుగుదల నేపథ్యంలో ఉద్యోగులపై పడుతున్న భారం తగ్గించేందుకు 7వ కేంద్ర వేతన సంఘం సిఫార్సుల ప్రకారం ఈ పెంపు అమలు చేస్తున్నట్లు ప్రభుత్వం తెలిపింది. డీఏ పెంపు కారణంగా కేంద్ర ఖజానాపై సంవత్సరానికి రూ.6,791 కోట్ల అదనపు భారం పడనుంది.

**రహదారుల అభివృద్ధికి నిధులు**

ఇక గ్రామీణాభివృద్ధి దిశగా మరో కీలక నిర్ణయం తీసుకున్న కేబినెట్, ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన (పీఎంజీఎస్వై)ను 2028 వరకు పొడిగించింది. గ్రామీణ ప్రాంతాల్లో రహదారి కనెక్టివిటీని మెరుగుపర్చేందుకు వచ్చే మూడు సంవత్సరాల్లో రూ.83,977 కోట్లను ఖర్చు చేయనున్నారు. ముఖ్యంగా వ్యవసాయ మార్కెట్లు, పాఠశాలలు, ఆసుపత్రులకు గ్రామాల నుంచి రాకపోకలు సులభతరం చేసే రహదారుల అభివృద్ధిపై ఈ నిధులు వినియోగించనున్నారు. రైల్వే రంగంలో కూడా కేంద్రం భారీ ప్రాజెక్టులకు ఆమోదం తెలిపింది. ఆంధ్రప్రదేశ్‌లో రాజమండ్రి నుంచి విశాఖపట్నం వరకు మరో రెండు రైల్వే లైన్ల నిర్మాణానికి రూ.9,889 కోట్లతో గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మొత్తం 198 కిలోమీటర్ల మేర ఈ ప్రాజెక్టు అమలవుతుంది. నిడదవోలు–– దువ్వాడ మధ్య కొత్త లైన్లు నిర్మించడంతో చెన్నై–– హౌరా ప్రధాన మార్గంలో ట్రాఫిక్ రద్దీ గణనీయంగా తగ్గే అవకాశం ఉంది. ఈ ప్రాజెక్టు తూర్పుగోదావరి, కోనసీమ, కాకినాడ, అనకాపల్లి, విశాఖపట్నం జిల్లాలను కవర్ చేయనుంది. ప్రస్తుతం ఈ మార్గంలో రైల్వే సామర్థ్యం 130 శాతానికి చేరుకోవడంతో తరచూ ఆలస్యాలు, రద్దీ సమస్యలు ఎదురవుతున్నాయి. కొత్త లైన్ల నిర్మాణంతో ఈ సమస్యలకు పరిష్కారం లభించనుంది. ఇంకా గోదావరి నదిపై 4.3 కిలోమీటర్ల పొడవైన రైల్వే వంతెన, 2.67




కిలోమీటర్ల వయాడక్ట్, మూడు బైపాస్ మార్గాలు ఈ ప్రాజెక్టులో భాగంగా నిర్మించనున్నారు. ఈ లైన్లు పూర్తయితే సరకు రవాణా వేగవంతం కావడంతో పాటు ప్రయాణికులకు కూడా సౌకర్యం పెరుగుతుంది.

అదేవిధంగా గాజియాబాద్––సీతాపూర్ మధ్య మూడో, నాలుగో రైల్వే లైన్ల నిర్మాణానికి కూడా కేబినెట్ ఆమోదం తెలిపింది. దేశవ్యాప్తంగా రైల్వే మౌలిక సదుపాయాలను విస్తరించడమే లక్ష్యంగా ఈ నిర్ణయాలు తీసుకున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. తూర్పు తీర ప్రాంతంలో ఉన్న విశాఖపట్నం, గంగవరం, మచిలీపట్నం, కాకినాడ పోర్టులకు రైల్వే కనెక్టివిటీ మరింత మెరుగుపడనుంది. ఈ మార్గం దేశంలో అత్యంత రద్దీగా ఉండే సరకు రవాణా మార్గాల్లో ఒకటిగా ఉండటంతో, పరిశ్రమల అభివృద్ధికి ఇది కీలకంగా మారనుంది.

**ప్రత్యేక నిధి ఏర్పాటు**

ఇక అంతర్జాతీయ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని సముద్ర రవాణా భద్రతకు సంబంధించి కూడా కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. భారత్ మారిటైమ్ ఇన్సూరెన్స్ పూల్ అనే ప్రత్యేక నిధిని ఏర్పాటు చేయాలని కేబినెట్ ఆమోదించింది. దీనికి సుమారు రూ.13,000 కోట్ల సావరిన్ గ్యారంటీ ఇవ్వనున్నారు. పశ్చిమాసియా ప్రాంతంలో ఉద్రిక్తతలు, ముఖ్యంగా హర్మూజ్ జలసంధిలో జరుగుతున్న దాడుల కారణంగా సముద్ర రవాణాపై ప్రమాదాలు పెరిగాయి. ఈ నేపథ్యంలో భారత నౌకలు, అలాగే భారతదేశానికి వస్తున్న లేదా ఇక్కడి నుంచి వెళ్లే సరకు నౌకలకు బీమా రక్షణ కల్పించేందుకు ఈ నిధి ఉపయోగపడనుంది. ఈ ఇన్సూరెన్స్ పూల్ ద్వారా నౌకలు, సరుకు, యంత్రాంగం, యుద్ధ సంబంధిత ప్రమాదాలు సహా అన్ని రకాల రిస్క్‌లకు కవరేజీ అందించనున్నారు. అంతర్జాతీయ బీమా సంస్థలపై ఆధారాన్ని తగ్గిస్తూ, దేశీయంగా బీమా వ్యవస్థను బలోపేతం చేయడమే దీని ముఖ్య ఉద్దేశం. మొత్తంగా చూస్తే, ఉద్యోగులకు ఆర్థిక ఉపశమనం, గ్రామీణాభివృద్ధికి ప్రోత్సాహం, రైల్వే మౌలిక సదుపాయాల విస్తరణ, సముద్ర రవాణా భద్రత వంటి కీలక రంగాల్లో కేంద్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయాలు దేశ ఆర్థిక వ్యవస్థకు దోహదం చేసేలా ఉన్నాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## పార్లమెంటు ఉభయసభల నిరవధిక వాయిదా

పార్లమెంటు ఉభయసభలు నిరవధికంగా వాయిదా పడ్డాయి. శనివారం ఉదయం 11 గంటలకు లోక్‌సభ ప్రారంభంకాగానే సభ్యులు జాతీయ గేయాన్ని ఆలపించారు. అనంతరం ఎటువంటి ఇతర చర్చలు, బిల్లుల ప్రక్రియలు లేకుండానే సభను స్పీకర్ ఓం బిర్లా నిరవధిక వాయిదా వేశారు. సభ ప్రారంభం కాగానే బడ్జెట్ సమావేశాలకు సంబంధించిన ముగింపు వ్యాఖ్యలను స్పీకర్ చదివారు. సభ వాయిదా పడే సమయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తదితరులు సభలో ఉన్నారు. జనవరి 28న ప్రారంభమైన పార్లమెంటు బడ్జెట్ సెషన్ ముగిసిన సందర్భంగా స్పీకర్ ఓం బిర్లాను గౌరవపూర్వకంగా కలిసిన వారిలో ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు అమిత్‌షా, కిరణ్ రిజిజు, కాంగ్రెస్ ఎంపీలు కుమారి సెల్జా, కేసీ వేణుగోపాల్ తదితరులు ఉన్నారు.

**రాజ్యసభ సైతం**

ఇక శనివారం ఉదయం రాజ్యసభ ప్రారంభమైన కొద్దిసేపటికే ఛైర్మన్ సీపీ రాధాకృష్ణన్ సభను నిరవధికంగా వాయిదా వేశారు. బడ్జెట్ సమావేశాలు, ప్రత్యేక సమావేశాలు ముగియడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈసారి పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో రాజ్యసభ సుమారు 157 గంటల 40 నిమిషాల పాటు పనిచేసిందని, 109.87 శాతం ఉత్పాదకతను సాధించిందని ఛైర్మన్ వెల్లడించారు. బడ్జెట్ సెషన్‌లో 117 ప్రశ్నలు, 446 జీరో అవర్ అభ్యర్థనలు, 207 స్పెషల్ మెన్షన్లకు అవకాశాన్ని ఇచ్చామన్నారు. ప్రస్తుతం రాజ్యసభలో 245 మంది సభ్యులు ఉన్నారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై నాలుగు రోజుల చర్చలో 79 మంది ఎంపీలు, బడ్జెట్‌పై నాలుగు రోజుల చర్చలో 97 మంది ఎంపీలు పాల్గొన్నారని రాజ్యసభ ఛైర్మన్ తెలిపారు. ఈ సెషన్‌లోనే ఏప్రిల్ 17న రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్‌గా హరివంశ్ నారాయణ్ సింగ్ వరుసగా మూడోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారన్నారు. రాజ్యసభ చరిత్రలో ఒక నామినేటెడ్ సభ్యుడు ఈ పదవిని చేపట్టడం ఇదే తొలిసారి.

**వీగిపోయిన రాజ్యాంగ సవరణ బిల్లు**

మొత్తం మీద మూడు రోజుల పాటు పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు జరిగాయి. చట్టసభల్లో మహిళా రిజర్వేషన్ల కోసం తెచ్చిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లు గురువారం రోజు లోక్‌సభలో వీగిపోయింది. మూడింట రెండు వంతుల మెజారిటీ లేకపోవడంతో బిల్లు ఆమోదానికి నోచుకోలేదు. రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోవడంతో దానికి అనుబంధంగా ఉన్న యూటీ చట్ట సవరణ సహా డీలిమిటేషన్ బిల్లులను కేంద్రం వెనక్కి తీసుకుంది.

**మహిళా రిజర్వేషన్లపై ప్రైవేటు బిల్లు**

చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించే ప్రైవేటు మెంబర్ బిల్లును డీఎంకే ఎంపీ పీ విల్సన్ శనివారం రాజ్యసభలో ప్రవేశపెట్టారు. దేశంలోని 543 లోక్‌సభ నియోజకవర్గాలను పునర్విభజన చేయకుండా, జనగణనతోనూ సంబంధం లేకుండా వచ్చే ఎన్నికల నుంచే మహిళా కోటాను అమలు చేయాలని ఈ బిల్లులో ప్రతిపాదించారు. అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు, ఢిల్లీలలో అసెంబ్లీ సీట్ల సంఖ్యను పెంచకుండా, నియోజకవర్గాలను పునర్విభజన చేయకుండా, జనగణనతో సంబంధం లేకుండా మహిళా కోటాను అమలు చేయాలని ప్రపోజ్ చేశారు. మహిళలకు చట్టసభల్లో శాశ్వతంగా 33 శాతం రిజర్వేషన్లు అమల్లో ఉంటాయని ప్రైవేటు మెంబర్ బిల్లులో పేర్కొన్నారు. శనివారం రోజు సభకు సంబంధించిన మిగతా కార్యకలాపాలన్నీ ఆపేసి, ఈ బిల్లుపైనే చర్చకు అవకాశాన్ని ఇవ్వాలంటూ రూల్ 267 ప్రకారం రాజ్యసభ ఛైర్మన్‌కు డీఎంకే ఎంపీ పీ విల్సన్ నోటీసు ఇచ్చారు.

**బీజేపీ జం విపక్షాలు**

విపక్షాల మొండి వైఖరి వల్లే మహిళలకు లోక్‌సభ, అసెంబ్లీల్లో 33 శాతం రిజర్వేషన్లు కల్పించే చారిత్రక బిల్లు ఆమోదానికి నోచుకోలేదని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా విమర్శించారు. ఆ బిల్లుకు నియోజకవర్గాల పునర్విభజన, జనగణనలతో లింక్ పెట్టినందు వల్లే తాము మద్దతు ఇవ్వలేదని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తేల్చి చెప్పారు. మహిళా కోటా ముసుగులో భారతదేశ రాజకీయ చిత్రపటాన్ని మార్చేందుకు బీజేపీ యత్నించిందని ఆయన ఆరోపించారు. తమిళనాడు, కేరళ, బంగాల్, అసోం, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న వేళ నిర్వహించిన మూడు రోజుల ప్రత్యేక పార్లమెంటు సెషన్ రాజకీయ ప్రాధాన్యాన్ని సంతరించుకుంది.

## ప్రజాస్వామ్యానికి అతిపెద్ద విజయం

మహిళల రిజర్వేషన్ల కోసం కేంద్ర ప్రవేశపెట్టిన రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోవడంపై ప్రియాంక గాంధీ కీలక వ్యాఖ్యలు చేశారు. డీలిమిటేషన్, మహిళల హక్కుల కోసం తీసుకొచ్చిన బిల్లు కాదని పేర్కొన్నారు. విపక్షాలన్నీ ఏకతాటిపైకి వచ్చి ప్రభుత్వాన్ని ఓడించాయని తెలిపారు. ఇది ప్రజాస్వామ్యానికి అతిపెద్ద విజయమని పేర్కొన్నారు. మహిళలకు తక్షణమే హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. శనివారం ఢిల్లీలో నిర్వహించిన మీడియాలో సమావేశంలో ప్రియాంక గాంధీ ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. 'అన్ని పార్టీల మద్దతుతో 2023లో ఆమోదం పొందిన మహిళా రిజర్వేషన్ బిల్లును తిరిగి తీసుకురావాలి. అమలు కోసం చిన్న మార్పులు అవసరమైతే చేయండి. కానీ ఆలస్యం చేయకుండా మహిళలకు హక్కులు వెంటనే ఇవ్వండి. మహిళా రిజర్వేషన్‌కు మేం వ్యతిరేకం కాదు. అయితే దానిని జనగణన, డీలిమిటేషన్ ప్రక్రియలతో అనుసంధానం చేయడానికే వ్యతిరేకం. ఇతర అంశాలతో కలిపి ప్రజలను తప్పుదోవ పట్టించకండి. వెంటనే అమలు చేయండి' అని ప్రియాంక గాంధీ అన్నారు.

**ప్రభుత్వంపై ఘాటు విమర్శలు**

కేంద్రంపై ప్రియాంక గాంధీ విమర్శలు గుప్పించారు. బిల్లు వీగిపోవడం ప్రజాస్వామ్యానికి అతిపెద్ద విజయమని, విపక్షాలన్నీ ఏకతాటిపైకి వచ్చి ప్రభుత్వాన్ని ఓడించాయని ప్రియాంకగాంధీ వ్యాఖ్యానించారు. ఫెడరల్ వ్యవస్థను బలహీనపరచే ప్రభుత్వ ప్రయత్నం విఫలమైందని అన్నారు. ఇది రాజ్యాంగానికి, దేశానికి, ప్రతిపక్ష ఐక్యతకు విజయమని తెలిపారు. మహిళా మెస్సయ్య కావాలని ప్రధాని నరేంద్ర మోదీ భావించారని విమర్శించారు. ఇది వారికి బ్లాక్? డే అని అన్నారు. మహిళల సమస్యలు రోజురోజుకీ పెరుగుతున్నాయని, ఏం జరుగుతుందో వారు అర్థం చేసుకుంటున్నారని తెలిపారు. ప్రచారం, మీడియా హైప్ ఇక పనిచేయదని పేర్కొన్నారు.

## హార్ముజ్ వద్ద ఉద్రిక్తత..

## రెండు నౌకలపై కాల్పులు..

హార్ముజ్ జలసంధి వద్ద మళ్లీ ఉద్రిక్త పరిస్తితులు నెలకొంటున్నాయి. తాజాగా హార్ముజ్ జలసంధిని దాటేందుకు ప్రయత్నిస్తున్న రెండు నౌకలపై ఇరాన్‌లోని ఐఆర్‌జీసీకి చెందిన గన్ బోట్స్ కాల్పులు జరిపినట్లు తెలుస్తోంది. ఎలాంటి హెచ్చరిక, సమాచారం లేకుండానే ఈ కాల్పులు జరిగినట్లు నౌకలోని కెప్టెన్లు తెలిపినట్లు బ్రిటన్‌కు చెందిన మారిటైమ్ ట్రేడ్ ఆపరేషన్స్ సంస్థ వెల్లడించింది. అయితే, ఈ కాల్పుల్లో ఎవరికీ ఎలాంటి హానీ జరగలేదని వివరించింది. మరోవైపు ఇండియాకు చెందిన చమురు నౌక ఒకటి శనివారం హార్ముజ్ జలసంధిని దాటింది. దేశ్ గరిమ అనే నౌక ఈ జలసంధిని దాటినట్లు అక్కడి ట్రాఫిక్ డాటా ద్వారా తెలిసింది. యుద్ధం ప్రారంభమైన తర్వాత జలసంధిని దాటిన పదో భారత నౌక ఇది. ఖతార్‌లోని రస్ లాఫ్ఫాన్ పోర్టు నుంచి ఈ నౌక ఇండియాకు వస్తోంది. ప్రస్తుతం గల్ఫ్ ఆఫ్ ఒమన్ వద్ద ఈ నౌక ఉన్నట్లు తెలుస్తోంది. మొత్తంగా ఈ రోజు హార్ముజ్ నుంచి వివిధ దేశాలకు చెందిన ఎనిమిది నౌకలు దాటినట్లు అంచనా. హార్ముజ్ జలసంధిని ఇరాన్ మూసేస్తున్నట్లు ప్రకటించడానికి ముందే ఈ నౌకలు ఈ ప్రదేశాన్ని దాటి ఉండొచ్చు. ప్రస్తుతం హార్ముజ్‌ను ఇరాన్ మూసేసిన నేపథ్యంలో మళ్లీ నౌకల రవాణా నిలిచిపోనుంది. హార్ముజ్ ప్రస్తుతం ఇరాన్ మిలిటరీ నియంత్రణలో ఉంది. ఇంకోపక్క లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులు కొనసాగిస్తోంది. ఆ దేశంతో ఇరాన్ పది రోజులపాటు కాల్పుల ఒప్పందం కుదుర్చుకున్న సంగతి తెలిసిందే. ఒక పక్క ఈ ఒప్పందం ఉన్నప్పటికీ లెబనాన్‌లోని హెజ్బొల్లా తీవ్రవాద సంస్థపై దాడి చేసినట్లు ఇజ్రాయెల్‌కు చెందిన ఐడీఎఫ్ (ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్స్) తెలిపింది. దక్షిణ లెబనాన్‌లోని యెల్లో లైన్ వద్ద ఉన్న తీవ్రవాదులు కాల్పుల విరమణ నిబంధనలు ఉల్లంఘించడంతో తాము దాడులు చేశామని ఇజ్రాయెల్ తెలిపింది. మరోవైపు ఇరాన్‌కు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తాజా హెచ్చరిక జారీ చేశారు. ఈ రెండు దేశాల మధ్య పాకిస్తాన్ వేదికగా సోమవారం రెండో దశ చర్చలు జరగనున్న నేపథ్యంలో ట్రంప్ వార్నింగ్ ఇచ్చారు. బుధవారం లోపు ఇరాన్ తమతో ఒప్పందం కుదుర్చుకోకపోతే.. మళ్లీ దాడులు చేస్తామని హెచ్చరించారు.

# వేసవి తాపానికి గుడ్‌బై!

తెలంగాణ రాష్ట్రంలో ఈనెల 26 వరకు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ ప్రకటించింది. ఉపరితల ఆవర్తనం, క్యూములోనింబస్ మేఘాలతో వర్షాలు కురిసే అవకాశం ఉందని, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపింది. గంటకు 30 నుంచి 40 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీస్తాయని తెలిపింది.

**గరిష్ఠ ఉష్ణోగ్రతల్లో స్వల్ప మార్పు ఉండే అవకాశం**

ఇవాళ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాలకు వర్ష సూచన ఉన్నట్లు వాతావరణశాఖ వెల్లడించింది. రేపు ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఎల్లుండి ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, కరీంనగర్,పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాలకు వర్ష సూచన ఉందిని ప్రకటించింది. వర్షం కురిసే జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేసిన వాతావరణశాఖ వర్షాలతో గరిష్ఠ ఉష్ణోగ్రతల్లో స్వల్ప మార్పు ఉండే అవకాశం ఉందని తెలిపింది.

**పంటను కాపాడుకోలేక రైతులు సతమతం**

నిజామాబాద్ జిల్లాలో సాయంత్రం కురిసిన ఈదురు గాలులతో కూడిన వడగళ్ల వాన నానా బీభత్సం సృష్టించింది. చేతికి వచ్చిన వరి పంట పూర్తిగా నేలకొరిగింది. కొనుగోలు కేంద్రాల వద్ద ఆరబోసిన ధాన్యం తడిసి ముద్దైంది. సిరికొండ, ధర్పల్లి, డిచ్?పల్లి, ఇందల్వాయి మండలంలో పొద్దంతా ఎండ కొట్టి సాయంత్రం అకాల వర్షం పడడంతో పంటను కాపాడుకోలేక రైతులు సతమతం అయ్యారు. అకాల వర్షాలను దృష్టిలో ఉంచుకొని అయినా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు వేగవంతం చేయాలని రైతులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.



**ఉత్తర తెలంగాణ జిల్లాల్లో వడగాల్పులు వీస్తున్నాయి**

మరోవైపు రాష్ట్ర వ్యాప్తంగా ఎండలు మండిపోతున్నాయి. గరిష్ఠ ఉష్ణోగ్రతలు 44 డిగ్రీల మేర నమోదవుతున్నాయి. ఎండ తీవ్రతతో పాటు ఉక్కపోత వాతావరణం ఎక్కువగా ఉంటుందని, ఉత్తర తెలంగాణ జిల్లాల్లో వడగాల్పులు వీస్తున్నాయని వాతావరణ శాఖ అధికారి ధర్మరాజు తెలిపారు. రాత్రిపూట కనిష్ఠ ఉష్ణోగ్రతలు పెరగడం వల్ల అసౌకర్య పరిస్థితులు నెలకొంటున్నాయని తెలిపారు. ఉపరితల చక్రవాత అవర్తనం, ద్రోణి, క్యూములోనింబస్ మేఘాల ప్రభావంతో ఈ నెల 26 వరకు తెలంగాణ రాష్ట్రంలో ఉరుములు మెరుపులు, ఈదురుగాలులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని చెప్పారు. ఈ వర్షాల వల్ల ఉష్ణోగ్రతల్లో అతి స్వల్పంగా మార్పు ఉంటుందని తెలిపారు.

**కుమురంభీం జిల్లాలో 44.5 డిగ్రీల ఉష్ణోగ్రత**

శనివారం కుమురంభీం జిల్లా కెరమెరిలో అత్యధికంగా 44.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయ్యింది. నిజామాబాద్ జిల్లా మెండోరాలో 44.5 డిగ్రీలు, జగిత్యాల జిల్లా ఎండపల్లిలో 44.4 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. రోజు రోజుకూ ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో చిన్నారులు, వృద్ధులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, అత్యవసరం అయితే తప్ప బయటకు వెళ్లొద్దని వాతావరణ శాఖ సూచనలు చేసింది.

# అడగంటుతున్న భూ గర్భజలాలు

**కరీంనగర్ :** వేసవిలో ఎండల తీవ్రత అంతకంతకు పెరుగుతుండగా, కరీంనగర్ జిల్లాలోని నీటివనరులన్నీ నిండుకున్నాయి. వాగులు, వంకలు, చెరువులు, కుంటలు అడుగంటి ఒండ్రు మట్టి తేలితున్నాయి. జిల్లా పరిధిలోని చిన్న, మధ్య తరహా, భారీ ప్రాజెక్టుల్లో కూడా నీటి నిల్వలు అదిగంటుతున్నాయి. ఉక్కపోత, భరించలేని వేడి నుంచి ఉపశమనం పొందేందుకు ప్రజలు కూడా నీటిని అదే స్థాయిలో వినియోగిస్తున్నారు.ఈ ప్రభావం భూగర్భ జలాలపై పడుతోంది. చివరి దశలో ఉన్న పంటలను కాపాడుకునేం దుకు అన్నదాతలు అరిగోస పడుతున్నా రు. తమ స్థిరాస్తులు, ఆభరణాలు తనాఖా పెడుతూ, అట్టడుగుకు చేరిన నీటిని పైకి తె చ్చేందుకు భగీరథ ప్రయత్నాలు చేస్తున్నారు. నీటిమట్టంపై జిల్లా భూగర్భ జలవనరుల శాఖ విడుదల చేసిన నివేదిక ప్రకారం ఈ ఏడాది మార్చిలో 8.10 మీటర్లు, ఏప్రిల్ లో 9.02 మీటర్ల సగటు నీటిమట్టం నమోదైంది.గత ఏడాది వేసవిలో కూడా ఇవే పరిస్థితులు నెలకొన్నాయి. జూలై, ఆగస్టు నెలల్లో కురిసిన భారీ వర్షాలతో భూగర్భ జలమట్టంలో మార్పు వచ్చి, కొంతమేర ఉపశమనం కలిగింది. అనంతరం అసలు రెయినీ సీజన్లోనే వర్షా లు ముఖం చాటేయగా, ఎప్పటికప్పుడు భూగర్భజలాలు పాతాళానికి పడిపోతున్నా యి. అడపాదడపా వర్షాలు కురిసినా వాటి తో భూగర్భజలాలు పెరగలేదని భూగర్భ జల వనరుల శాఖ నివేదికలు స్పష్టం చేస్తున్నాయి.కరీంనగర్ జిల్లా గంగాధర మండలంలో వేసవి తీవ్రతతో భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా వరి పంట కు సరిపడా నీరు అందకపోవడంతో పం టలు ఎండిపోతున్న పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో రైతులు ప్రత్యామ్నాయ



మార్గాలను అన్వేషిస్తూ బావుల్లో పేరుకుపోయిన మట్టిని క్రేన్ల సహాయంతో తొలగిస్తున్నారు. నీటి నిల్వలు పెరగాలని ఆశిస్తూ పెద్ద మొ త్తంలో ఖర్చు పెట్టి బావులను శుభ్రం చేస్తున్నారు. అంతేకాకుండా, మరింత నీరు అం దుబాటులోకి రావాలనే ఉద్దేశంతో బావుల పక్కనే సైడ్ బోర్లు కూడా వేయిస్తున్నారు.కరీంనగర్ ఎల్ఎండీ సామర్థ్యం 24.034 టి ఎంబసీ లు కాగా జలాశయంలో నీటి నిల్వలు 6.9 టీఎంసీలకు పడిపోవడంతో నగరంలో నీటి కష్టాలు మొదలయ్యాయి. గతంలో ప్రతిరోజూ 55 ఎంఎల్డీల నీటిని సరఫరా చేసిన నగరపాలక సంస్థ, రెండు రోజులకు ఒకసారి సరఫరా చేసేందుకు సిద్దం అవుతుంది ఎంఎండల తీవ్రత దృష్ట్యా ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోవాలని, వృథా చేయవద్దని అధికారులు విజ్ఞప్తి చేశారు. మిడ్ మానేరు నుంచి ప్రస్తుతం 500 క్యూసెక్కుల నీటి విడుదల చేస్తున్నారు.

# గ్యాస్ ఏజెన్సీల దందా...

**వరంగల్ :** హనుమకొండ జిల్లాలో గ్యాస్ పంపిణీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గ్యాస్ ఏజెన్సీల నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న తీరు సామాన్య ప్రజలకు, చిరు వ్యాపారులకు శాపంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఆన్లైన్ బుకింగ్ పేరుతో జాప్యం చేస్తూ.. మరోవైపు అధిక ధరలకు బ్లాక్లో సిలిండర్లను విక్రయిస్తూ ఏజెన్సీలు కాసుల వేటలో పడ్డాయనే విమర్శలు బాహటంగా వినిపిస్తున్నాయి. పర్యవేక్షించాల్సిన అధికారులు చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నారని ఫలితంగా, దోపిడీ పర్వం యథేచ్ఛగా సాగుతోందనే విమర్శలు వస్తున్నాయిగ్యాస్ కొరత కారణంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొంతకాలం గడువు విధిస్తూ ఆన్లైన్ బుకింగ్ విధానం వినియోగదారులకు సౌకర్యంగా ఉండాల్సింది పోయి, ఇబ్బందుల పాలయ్యేలా చేస్తోందని వినియోగదారులు చెబుతున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఒక సిలిండర్ బుక్ చేస్తే అది ఇంటికి చేరడానికి 20 రోజులకు పైగా సమయం పడుతోందని, దీనివల్ల సామాన్యులు కట్టెల పొయ్యి వైపు చూడాల్సిన పరిస్థితి తలెత్తుతుందని చెబుతున్నారు. వెంటనే ఈ ఆన్లైన్ విధానాన్ని పక్కన పెట్టి, పాత పద్ధతిలోనే ఇంటింటికీ సక్రమంగా పంపిణీ చేయాలని జిల్లా ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.కొన్ని ఏజెన్సీలు, డెలివరీ బాయ్ లు అనుసరిస్తున్న కొత్త తరహా మోసం వినియోగదారులను విస్మయానికి గురిచేస్తోంది. గ్యాస్ పంపిణీ చేయకముందే వినియోగదారుల వద్ద నుంచి రకరకాల సాకులతో ఓటిపి లను సేకరిస్తున్నారు. సాఫ్ట్వేర్లో డెలివరీ అయినట్లు చూపిస్తూ.. ఆ సిలిండర్లను బహిరంగ



మార్కెట్లో అధిక ధరలకు అమ్ముకుంటున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.వంట గ్యాస్ ధర అధికారికంగా రవాణా చార్జీలతో కలిపి 1000 ఉండగా, బ్లాక్లో రూ. 2 వేలకు విక్రయిస్తున్నారని, ఇక ఇదే కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధర 1850 ఉండగా, ఏకంగా 3వేలకు అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్యాస్ ధరల సెగ హోటల్ యజమానులకు, బజ్జీల బండి వ్యాపారులకు గట్టిగా తగులుతోంది. కమర్షియల్ గ్యాస్ ధరలు సామాన్యుడికి అందనంత ఎత్తుకు చేరడంతో వ్యాపారాలు సాగించడం భారంగా మారింది. పోనీ కట్టెల పొయ్యి మీద వంట చేద్దామన్నా.. కట్టెల ధరలు కూడా వేలల్లో ఉండటంతో 'ముందు నుయ్యి.. వెనుక గొయ్యి' చందంగా మారిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.జిల్లా వ్యాప్తంగా ఇంత బహిరంగంగా అక్రమాలు జరుగుతున్నా, పౌరసరఫరాల శాఖ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని బాధితులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి, అక్రమాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వస్తున్న గ్యాస్ ఏజెన్సీల గోదాములపై దాడులు నిర్వహించి, కృత్రిమ కొరత సృష్టించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని గృహ, వాణిజ్య వినియోగదారులు కోరుతున్నారు.గ్యాస్ పంపిణీలో జరుగుతున్న అక్రమాలపై సివిల్ సప్లై డిటి సదానందం స్పందిస్తూ.. వినియోగదారుల వద్ద నుంచి ముందస్తుగా ఓటిపిలు సేకరించడం, సిలిండర్లను బ్లాక్ మార్కెట్కు తరలించడం చట్టరీత్యా నేరమని పేర్కొన్నారు. జిల్లాలో ఎక్కడైనా గ్యాస్ ఏజెన్స

## మరో బిల్లు తీసుకొస్తే అడ్డుకుంటాం

-మొదటిపేజీ తరువాయి

చేశారు. మహిళా రిజర్వేషన్ల బిల్లు విషయంలో రాజకీయం చేయాల్సిన అవసరం లేదన్నారు.

**గల్లీ నుంచి పార్లమెంట్ వరకు నిరసన తెలుపుతాం**

నిన్న లోక్‌సభలో బిల్లు వీగిపోవడంతో ప్రధాని మోదీ అహంకారం తగ్గిందన్న సీఎం తప్పు డు చట్టాలు తీసుకొస్తే గల్లీ నుంచి పార్లమెంట్ వరకు నిరసన తెలుపుతామని వెల్లడిం చా రు. 2023 మహిళా బిల్లును సోమవారం పార్లమెంట్‌లో పెట్టాలని డిమాండ్ చేశారు. 20 23 మహిళా బిల్లును పెడితే మద్దతు ఇచ్చేందుకు తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

**మరో బిల్లు తీసుకొస్తే అడ్డుకుంటాం**

మహిళా బిల్లు ముసుగులో డీలిమిటేషన్ బిల్లు తీసుకువచ్చారని రేవంత్ రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మహిళలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చిందని కొనియాడారు. మహిళా రిజర్వేషన్ల బిల్లును కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకించట్లేదని స్పష్టం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ రాజకీయ పంతాలు, పట్టింపులకు పోవాల్సిన పనిలేదని హితువు పలికారు. మహిళా రిజర్వేషన్లకు సంబంధించి ఎలాంటి సవరణ తీసుకువచ్చినా మద్దతు ఇస్తామని స్పష్టం చేశారు. మహిళా రిజర్వేషన్ల బిల్లు ముసుగులో మరో బిల్లు తీసుకువస్తే గుర్తించి అడ్డుకుంటామని హెచ్చరించారు. "లోక్‌సభలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బిల్లులను చర్చలతో పాటు కేంద్ర ప్రభుత్వం ఓటమిని ప్రజలు కళ్లారా చూశారు. ఈ ఓటమి భారతీయ జనతా పార్టీ తెచ్చిన చట్టాల ఓటమిగా చూడాల్సిన అవసరం లేదు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం చిత్తశుద్ధే ఓటమికి గురైంది. మహిళా రిజర్వేషన్ల ముసుగులో సీట్లను పెంచాలని చూశారు"

## రాష్ట్రంలో రోజువారీ కూలీల్లో ఎస్సీలే అధికం

-మొదటిపేజీ తరువాయి

పథకాల కింద కూలీలుగా, 17 శాతం మంది వ్యవసాయ కూలీలుగా పని చేస్తున్నారు. 23 శాతం మంది స్వయంగా సాగు చేసుకునే రైతులుగా ఉన్నారు. ఇక మొత్తం జనాభాలో 10.3 శాతంగా ఉన్న ఎస్టీ విభాగంలో 17 శాతం మంది వ్యవసాయ కూలీలుగా, 13 శాతం మంది రోజువారీ కూలీలుగా, 12 శాతం మంది ఉపాధి హామీ పథకాల కింద కూలీలుగా పని చేస్తున్నారనే విషయాన్ని పరిగణనలోకి తీసుకుంటే అత్యధిక శాతం మంది తక్కువ వేతనాలు వచ్చే వృత్తులపైనే ఆధారపడి జీవిస్తున్నారని స్పష్టమవుతోంది. వీరిలో 3 శాతం మందికి మాత్రమే మధ్యతరహా లేదా భారీ స్థాయి వ్యాపారాలు సొంతంగా ఉన్నాయి.

**బీసీల్లో జనాభాకు తగ్గట్టుగా**

ఇక బీసీల విషయానికొస్తే వీరు మొత్తం జనాభాలో 52.6 శాతంగా ఉన్నారు. ఇందులో రోజువారీ కూలీలుగా పని చేసేవారిలో వీరి వాటా 58 శాతంగా ఉంది. అదేవిధంగా ఉపాధి హామీ పనుల్లో 58 శాతం కాగా, వ్యవసాయ కూలీల్లో 52 శాతంగా ఉంది. సాగుదారులుగా ఉన్న వారిలో బీసీలు 54 శాతం ఉన్నారు. వ్యాపార రంగంలో కూడా వీరి ప్రాతినిథ్యం గణనీయంగా ఉండటంతో 53 శాతంగా నమోదైంది. ప్రభుత్వ ఉద్యోగాల్లో వీరి వాటా 54 శాతం కాగా, ప్రైవేటు రంగ ఉద్యోగాల్లో 53 శాతంగా ఉంది. భారీ పరిశ్రమలు, మధ్య తరహా పరిశ్రమలు, వ్యాపార సంస్థల్లోని మొత్తం వీరు 53 శాతం ఉన్నారని నివేదికలో పేర్కొంది.

**ఓసీల్లో 4 శాతం మాత్రమే**

ఓపెన్ కేటగిరీల విషయానికి వస్తే రోజువారీ కూలీలు, ఉపాధి హామీ కార్మికులు, వ్యవసాయ కూలీల్లో వీరి వాటా కేవలం 4 శాతం మాత్రమే. సాగుదారులతో అయితే 12 శాతం, వ్యాపారాల్లో 39 శాతం, ప్రభుత్వ ఉద్యోగాల్లో 19 శాతం, ప్రైవేటు రంగంలో 29 శాతంగా ఉంది. రాష్ట్రవ్యాప్తంగా చూస్తే మొత్తం జనాభాలో కేవలం 56.4 శాతం మంది మాత్రమే 12వ తరగతి వరకు విద్యను అభ్యసిస్తున్నారు. ఇందులో షెడ్యూల్డ్ కులాల శాతం 57 శాతంతో సగటు కంటే కొంచెం ఎక్కువగా ఉంది. ఇక బీసీలు, షెడ్యూల్డ్? తెగల విషయానికి వస్తే నమోదైన గణాంకాలు వరుసగా 54, 53 శాతంగా ఉన్నాయి.

**మరుగుదొడ్ల సౌకర్యం లేదు**

తెలంగాణలో మొత్తం జనాభాలో 13.5 శాతం మందికి మరుగుదొడ్ల సౌకర్యం అందుబాటులో లేదు. ఈ టాయిలెట్? సౌకర్యాల లేమి ఎస్టీ జనాభాలో 32.5 శాతం మంది, ఎస్సీలో 18.8 శాతం, బీసీల్లో 10.8 శాతం, ఓసీల్లో 4.5 శాతంగా ఉంది. వివిధ సామాజిక వర్గాల మధ్య పారిశుద్ధ్యం, ఆరోగ్యం అసమానతలకు ఈ విషయం ఒక సూచికగా గుర్తుంటుందని నివేదికలో పేర్కొంది. ప్రత్యేకించి ఈ సమస్య మహిళ భద్రత, గౌరవానికి సంబంధించిన విషమని తెలిపింది.

## మహిళలకు మరోసారి అన్యాయం




-మొదటిపేజీ తరువాయి

ఓడిపోతున్నామనే నిరాశ, నిస్పృహ కాంగ్రెస్‌లో కనిపిస్తోందని ఎద్దేవా చేసారు. మహిళలు, దక్షిణాది రాష్ట్రాలకు మేలు జరిగే బిల్లును అడ్డుకుని తప్పు చేశారని, రాజకీయాల్లోకి రావాలనుకునే మహిళల ఉత్సాహంపై నీళ్లు చల్లారని పేర్కొన్నారు.

**అసదుద్దీన్ ఓవైసీ కళ్లల్లో ఆనందం చూసేందుకు**

సర్జికల్ స్ట్రైక్స్, ఆపరేషన్ సిందూర్‌ను కూడా అవమానించేలా రాహుల్‌గాంధీ మాట్లాడారని, ప్రధాని మోదీని జాదుగర్ అంటూ రాహుల్‌గాంధీ అవమానించారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి మార్గదర్శకుడు తెలంగాణలో ఉన్నారని, అసదుద్దీన్ ఓవైసీ కళ్లల్లో ఆనందం చూసేందుకే మహిళా బిల్లును ఓడించారని వెల్లడించారు. మహిళల ఆకాంక్షలకు అసదుద్దీన్ ఓవైసీ దగ్గర తాకట్టు పెట్టారని విమర్శించారు.

**మహిళలకే కాకుండా దక్షిణాదికి తీవ్ర అన్యాయం చేశారు**

దేశంలోని 70 కోట్ల మంది మహిళల రాజకీయ అవకాశాలను దెబ్బతీసిన కాంగ్రెస్‌ను వదిలిపెట్టబోమని ప్రజాక్షేత్రంలో ఎక్కడికక్కడ నిలదీస్తామని కిషన్ రెడ్డి స్పష్టంచేశారు. 131వ రాజ్యాంగ సవరణకు అడ్డుకోవడం ద్వారా మహిళలకే కాకుండా దక్షిణాదికి తీవ్ర అన్యాయం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జనగణన ద్వారా డీలిమిటేషన్ జరిగితే తీవ్ర నష్టం జరుగుతుందని కిషన్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు.

"కాంగ్రెస్ పార్టీ మహిళలకు మరోసారి అన్యాయం చేసింది. నియోజకవర్గాల పునర్విభజన జరగాలని గతంలో చేసిన చట్టంలోనే ఉంది. దక్షిణాది రాష్ట్రాలకు న్యాయం జరిగేలా మంచి ఫార్ములాను మోదీ తీసుకువచ్చారు. కాంగ్రెస్ పార్టీకి మార్గదర్శకుడు తెలంగాణలో ఉన్నారు. అసదుద్దీన్ ఓవైసీ కళ్లల్లో ఆనందం చూసేందుకు మహిళా బిల్లును ఓడించారు. మహిళల ఆకాంక్షలకు అసదుద్దీన్ ఓవైసీ దగ్గర తాకట్టు పెట్టారు"


కిషన్ రెడ్డి శుక్రవారం మాట్లాడుతూ దక్షిణాది రాష్ట్రాలకు ప్రాతినిధ్యం తగ్గకుండా డిలిమిటేషన్ జరుగుతుందని పునరుద్ఘాటించారు. కొత్త నాయకత్వానికి అవకాశం వస్తుందనే ఆవేదనతోనే ప్రతిపక్షాలు డీలిమిటేషన్‌ను వ్యతిరేకిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ప్రక్రియపై కాంగ్రెస్, బీఆర్ఎస్? ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నాయని ఆరోపించిన కిషన్ రెడ్డి మహిళల రిజర్వేషన్లకు ఎంఐఎం వ్యతిరేకమని అన్నారు. మహిళల రిజర్వేషన్లు, డీలిమిటేషన్‌పై కాంగ్రెస్ పార్టీ, బీఆర్ఎస్? ను కలిపింది ఎంఐఎం పార్టీయేనని ఆరోపించారు.

# సంపాదకీయం

## మహిళా రిజర్వేషన్లు.. చరిత్రలో మరో కీలక మలుపు

లోకసభలో మహిళా రిజర్వేషన్ల బిల్లు వీగిపోవడం దేశ రాజకీయాలలో మరో కీలక మలుపుగా నిలిచింది. రాజ్యాంగ సవరణ స్థాయి బిల్లులు సాధారణ చట్టాల కంటే విభిన్నమైన ప్రామాణికతను, విస్తృత రాజకీయ సమ్మతిని కోరుకుంటాయి. 131వ రాజ్యాంగ సవరణగా ప్రతిపాదించ బడిన ఈ బిల్లుతో పాటు నియోజకవర్గాల పునర్విభజన, కేంద్ర పాలిత ప్రాంతాల సీట్ల పెంపు వంటి కీలక ప్రతిపాదనలు ఒకేసారి లోకసభ ముందుకు రావడం రాజకీయంగా ఆసక్తికరమైనా, వ్యూహాత్మకంగా ప్రమాదకర నిర్ణయంగా మారింది. 528 మంది సభ్యులు పాల్గొన్న ఓటింగ్‌లో 298 అనుకూల ఓట్లు, 230 వ్యతిరేక ఓట్లు రావడం గణాంక పరంగా మెజార్టీలా కనిపించినా, రాజ్యాంగ సవరణకు అవసరమైన రెండు-మూడవ వంతు మెజార్టీ సాధించడంలో ప్రభుత్వం విఫలమైంది. ఇదే ఈ పరిణామానికి మూల కారణం. ఈ పరిణామాన్ని అర్థం చేసుకోవాలంటే ముందుగా మహిళా రిజర్వేషన్ల చరిత్రను పరిశీలించాల్సి ఉంటుంది. 1990ల నుంచే మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్ కల్పించాలనే ఆలోచన రాజకీయ చర్చల్లో నిలిచింది. 1996లో మొదటిసారి ఈ బిల్లు ప్రవేశపెట్ట బడినా, అప్పటి నుండి అనేకసార్లు అది పార్లమెంట్‌లో ప్రవేశించి నిలిచి పోయింది. 2010లో రాజ్యసభలో ఆమోదం పొందినా, లోకసభలో ఆమోదం పొందకపోవడం వల్ల చట్టరూపం దాల్చలేదు. అంటే, మహిళా రిజర్వేషన్లు భారత రాజకీయాల్లో ఒక 'అసంపూర్తి వాగ్దానం'గా మిగిలి పోయాయి. ప్రస్తుత సందర్భంలో కేంద్ర ప్రభుత్వం ఈ బిల్లును మళ్లీ తీసుకురావడం వెనుక రాజకీయ, సామాజిక రెండు కోణాలు ఉన్నాయి. ఒకవైపు మహిళా సాధికారతకు కట్టుబడి ఉన్నామని చెప్పుకోవడం, మరోవైపు ఎన్నికల ముందు మహిళా ఓటర్లను ఆకర్షించడమే లక్ష్యంగా కనిపించింది. అయితే, ఈ బిల్లును ఇతర రెండు కీలక బిల్లులతో కలిపి ఒకేసారి ప్రవేశ పెట్టడం ప్రభుత్వ వ్యూహంపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. నియోజకవర్గాల పునర్విభజన అనేది అత్యంత సున్నితమైన అంశం. జనాభా ప్రాతిపదికన సీట్ల పునర్విభజన జరిగితే దక్షిణాది రాష్ట్రాలకు నష్టం జరుగుతుందనే భయం చాలా కాలంగా ఉంది. ఇదే సమయంలో కేంద్ర పాలిత ప్రాంతాల సీట్ల పెంపు ప్రతిపాదన కూడా రాజకీయ సమీకరణాలను ప్రభావితం చేసే అంశంగా నిలిచింది. ఈ రెండు అంశాలు ప్రాంతీయ అసమానతలు, రాజకీయ ప్రయోజనాల చుట్టూ తిరుగుతుండగా, మహిళా రిజర్వేషన్ అనే సర్వసాధారణంగా అంగీకరించ దగిన అంశాన్ని కూడా వివాదంలోకి లాగినట్లైంది. లోకసభలో జరిగిన ఓటింగ్ గణాంకాలను పరిశీలిస్తే, ప్రభుత్వం సాధారణ మెజార్టీని సాధించినప్పటికీ, రాజ్యాంగ సవరణకు అవసరమైన ప్రత్యేక మెజార్టీ దూరంగా ఉంది. మొత్తం హాజరైన సభ్యులలో కనీసం రెండు మూడవ వంతు అనుకూల ఓట్లు అవసరం. 528 మంది సభ్యులు ఉన్న సందర్భంలో కనీసం 352 ఓట్లు అవసరం కాగా, ప్రభుత్వం 298 ఓట్లకే పరిమితమైంది. అంటే సుమారు 54 ఓట్ల లోటుతో బిల్లు వీగిపోయింది.ఇక్కడ ప్రధాన ప్రశ్న ఏమిటంటే?ఇది ప్రభుత్వ వ్యూహపరమైన పొరపాటా? లేక ఉద్దేశపూర్వక రాజకీయ ప్రణాళికా? విశ్లేషకుల అభిప్రాయాలు ఈ విషయంలో విభిన్నంగా ఉన్నాయి. ఒక వర్గం అభిప్రాయం ప్రకారం, ప్రభుత్వం మూడు బిల్లులను కలిపి ప్రవేశపెట్టడం ద్వారా ప్రతిపక్షాలను చిక్కులో పెట్టాలని భావించింది. మహిళా రిజర్వేషన్‌కు వ్యతిరేకంగా ఓటు వేస్తే మహిళా వ్యతిరేకులుగా ముద్ర పడుతుంది; మిగతా బిల్లులకు అనుకూలంగా ఓటు వేస్తే తమ రాజకీయ ప్రయోజనాలు దెబ్బతింటాయి. ఈ పరిస్థితిలో ప్రతిపక్షాలు విభజిత మవుతాయని ప్రభుత్వం అంచనా వేసి ఉండవచ్చు. అయితే వాస్తవ ఫలితం వ్యతిరేకంగా వచ్చింది. ప్రతిపక్షాలు ఈ మూడు బిల్లులను వేర్వేరుగా పరిశీలించాలని డిమాండ్ చేశాయి. ముఖ్యంగా పునర్విభజన అంశంపై స్పష్టత లేకపోవడం, మహిళా రిజర్వేషన్ అమలు ఎప్పటి నుంచి అనేది తెలియక పోవడం, కొన్ని వర్గాలకు ఉప-రిజర్వేషన్ల అంశం స్పష్టంగా లేకపోవడం వంటి కారణాలు ప్రతిపక్షాలను ఒక్కటిగా నిలబెట్టాయి. ఫలితంగా వారు బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేసే నిర్ణయం తీసుకున్నారు. ఇక్కడ మరో కీలక అంశం ప్రాంతీయ పార్టీల వైఖరి. కొన్ని ప్రాంతీయ పార్టీలు మహిళా రిజర్వేషన్‌కు మౌలికంగా అనుకూలంగానే ఉన్నప్పటికీ, పునర్విభజనతో తమ రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గుతుందనే భయంతో బిల్లును వ్యతిరేకించాయి. అంటే, మహిళా సాధికారత అనే అంశం ప్రాంతీయ రాజకీయాల కంటే తక్కువ ప్రాధాన్యత పొందినట్లు కనిపించింది.కేంద్ర ప్రభుత్వానికి ఇది రాజకీయంగా కూడా ఒక హెచ్చరికగా భావించవచ్చు. రాజ్యాంగ సవరణలు కేవలం సంఖ్యలతో కాదు, విశ్వాసంతో ఆమోదం పొందాలి. ప్రతిపక్షాలను సంప్రదించకుండా, విస్తృత చర్చలు లేకుండా, కీలక బిల్లులను ఒకేసారి ప్రవేశపెట్టడం వల్ల ఈ పరిస్థితి ఏర్పడింది. దీనిని వ్యూహాత్మక పొరపాటు అని చెప్పడం అతిశయోక్తి కాదు.అయితే మరో కోణంలో చూస్తే, ఇది ఒక రాజకీయ ప్రయోగంగా కూడా భావించవచ్చు. ప్రభుత్వం ఈ బిల్లులను ప్రవేశపెట్టి, ప్రతిపక్షాల అసలు వైఖరిని ప్రజల ముందు ఉంచాలని భావించి ఉండవచ్చు. మహిళా రిజర్వేషన్‌కు మద్దతు ఇస్తున్నామని చెప్పుకునే పార్టీలే చివరకు వ్యతిరేకంగా ఓటు వేసిన పరిస్థితి ప్రజల్లో చర్చకు దారి తీస్తుంది. ఎన్నికల సమయంలో ఇది ఒక ప్రధాన ప్రచార అంశంగా మారే అవకాశం ఉంది. మొత్తానికి, లోకసభలో ఈ మూడు బిల్లులు వీగిపోవడం ఒకే సమయంలో రాజకీయ వ్యూహం, లెక్కచేసిన రిస్క్, అలాగే అమలు లోపం? కలయికగా కనిపిస్తుంది. మహిళా రిజర్వేషన్ వంటి కీలక సామాజిక సంస్కరణ మరోసారి ఆలస్యమవడం బాధాకరం. అయితే ఈ సంఘటన భవిష్యత్తులో ఇలాంటి బిల్లులను ఎలా ప్రవేశపెట్టాలి, ఎలా సమ్మతి సాధించాలి అనే విషయంలో ఒక పాఠంగా నిలుస్తుంది. దేశ రాజకీయాలలో సంఖ్యల గణితం మాత్రమే కాదు, సమన్వయం, సమ్మతి, సమగ్ర దృక్పథం కూడా అంతే ముఖ్యమని ఈ పరిణామం స్పష్టంగా తెలియ జేస్తోంది. మహిళా రిజర్వేషన్లు అమలు కావాలంటే, అది కేవలం బిల్లుగా కాకుండా, రాజకీయ సంకల్పంగా మారాలి. లేదంటే, అది ప్రతి సారి పార్లమెంట్ గడప దాటక ముందే నిలిచిపోతూనే ఉంటుంది.

# అలుపెరుగని పోరాట యోధుడు




భారత దేశంలో సర్దార్ లుగా పేరొందిన ప్రముఖులలో ఒకరు సర్దార్ వల్లభభాయి పటేల్. మరొకరు సర్దార్ గౌతు లచ్చన్న. ఒకరిది దేశస్థాయిలో, మరొకరిది రాష్ట్ర స్థాయిలో రాణించారు. సర్దార్ అంటే సేనాని. స్వాతంత్ర్యోద్యమ పోరాట వీరునిగా ఎన్నో ఉద్యమాలు నడిపిన కురువృద్ధుడు సర్దార్ గౌతు లచ్చన్న. జమీందారీ వర్గాల వ్యతిరేక పోరాట వీరునిగా ప్రజాహృదయాలలో లచ్చన్న స్థానం చెక్కు చెదరనిది. గౌతు లచ్చన్న (ఆగష్టు 16, 1909 – ఏప్రిల్ 19, 2006) సాహసానికి, కార్యదక్షతకు మెచ్చి ప్రజలిచ్చిన కితాబే సర్దార్. సర్దార్ గౌతు లచ్చన్న, వి.వి.గిరి, నేతాజి సుభాష్ చంద్రబోస్, జయంతి ధర్మతేజ, మొదలగు అనేకమంది జాతీయ నాయకులతో కలిసి భారత దేశ స్వాతంత్ర్య పోరాటాలలో పాల్గొని, అనేక పర్యాయాలు జైలుకు వెళ్ళారు. ప్రకాశం పంతులు, బెజవాడ గోపాల రెడ్డి మంత్రివర్గంలో మంత్రి పదవి నిర్వహించిన లచ్చన్న, మద్యపాన నిషేధం విషయంలో ప్రకాశం పంతులుతో విభేదించి, అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టి, ప్రకాశం ప్రభుత్వ పతనానికి కారణభూతుడయ్యారు. చిన్న రాష్ట్రాల ఏర్పాటుకు మద్దతు ప్రకటించారు. తెలంగాణ ప్రత్యే?క రాష్ట్ర సాధనకు నాటి ఉద్యమ నేత మర్రి చెన్నారెడ్డితో చేతులు కలిపారు. తెలంగాణా రాష్ట్ర అవసరాన్ని, ఔచిత్యాన్ని వివరిస్తూ పుస్తకం వ్రాశాడు. ఇందిరాగాంధి అత్యవసర పరిస్థితి విధించినప్పుడు వ్యతిరేకించి, స్వేచ్ఛ కోసం పోరాడారు. చౌదరి చరణ్ సింగ్, జయప్రకాష్ నారాయణ, మసాని లతో కలిసి పనిచేశారు. తెలుగులో మంచి ఉపన్యాసకుడుగా, రాజాజి ఉపన్యాసాల అనువాదకుడిగా, చరిత్ర ముద్ర వేయించుకున్న బడుగువర్గ పోరాట యోధుడు లచ్చన్న. సర్దార్ గౌతు లచ్చన్న. ఉత్తర కోస్తా కళింగసీమలో ఉద్ధానం ప్రాంతాన (నాటి గంజాం జిల్లా) సోంపేట తాలూకాలో బారువా అనే గ్రామంలో 1909 ఆగష్టు 16 వ తేదీన ఒక సాధారణ బీద గౌడ కుటుంబములో గౌతు చిట్టయ్య, రాజమ్మ దంపతులకు జన్మించారు.

బారువాలోగల ప్రాథమిక పాఠశాలలో 1916లో చేరి, పాఠశాలలో 8వ తరగతి వరకు చదివి, ప్రక్కనే ఉన్న మందసా రాజావారి హైస్కూల్లో 9 వ తరగతిలో చేరి, పరీక్ష తప్పాడు. శ్రీకాకుళంలో ఉన్నత పాఠశాలలో చేర్పించగా, అక్కడ జగన్నాథం పంతులుగారి ఇంటిలో ఉండి చదువు సాగించారు. ఆ స్కూల్లో డ్రిల్ మాష్టారు నేమాని నరసింహమూర్తి శిక్షణలో జాతీయ భావాల్ని అలవర్చుకున్నారు. లచ్చన్నకు ఆనాటికి 21 సవంత్సరాలు. 1929–30 విద్యా సంవత్సరం మెట్రిక్యులేషన్ చదువుతుండగానే 21వ ఏట గాంధీజీ పిలుపువిని విద్యకు స్వస్తి చెప్పి స్వాతంత్ర్యోద్యమంలో దూకారు. 1930 లో మహాత్మాగాంధీ ఉప్పు సత్యాగ్రహానికి పిలుపినిచ్చారు. దీనికి ప్రభావితుడైన లచ్చన్న బారువా సమీపంలో ఉన్న సముద్రపు నీరుతో ఉప్పు తయారుచేసి ఆ డబ్బుతో ఆ ఉద్యమాన్ని నడిపారు. విదేశీ వస్తు బహిష్కరణోద్యమంలో పాల్గొని అందరూ చూస్తుండగానే తన విలువైన దుస్తులను అగ్నికి అహుతి చేశారు. ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొంటున్నప్పుడు లచ్చన్నను అరెస్టు చేసి టెక్కలి, నరసన్నపేట సబ్ జైళ్లల్లో నలభై రోజులు ఉంచారు. కోర్టు తీర్పు మేరకు మరో నెల రోజుల శిక్షను అతను బరంపురం జైల్లో అనుభవించవలసి వచ్చింది. 1932 వ సంవత్సరంలో శాసనోల్లంఘన ఉద్యమంలో పాల్గొంటున్న లచ్చన్నను రాజమండ్రి జైల్లో ఐదు మాసాలు ఉంచారు. అంటరానితనం నిర్మూలన. అంటరానితనం మీద కత్తి ఝుళిపించాడు లచ్చన్న. అతను నడిపిన హరిజన సేవా సంఘాలు, చేపట్టిన హరిజన రక్షణ యాత్రలు ప్రజలను బాగా ప్రభావితం చేశాయి. బారువా గ్రామ వీధుల్లో యువజనులను వెంట వేసుకొని భజన గీతాలు పాడుతూ వెళుతుంటే గ్రామమంతా దద్దరిల్లుతున్నట్లు కనిపించేది. సవర్ణులలో ఆశ్చర్యం, హరిజనులలో ఆశలు రేకెత్తించేవి. రాత్రి పాఠశాలలు నిర్వహించి బడుగు వర్గాల విద్యాభివృద్ధికి అతనెంతో కృషి చేశాడు. హరిజనులకు దేవాలయాలలో ప్రవేశం కలిగించారు. లచ్చన్న చేసిన ఆర్థిక సహాయంతో కుశాగ్రబుద్ధులైన ఎందరో హరిజన విద్యార్థులు ఉన్నత స్థానాల నలంకరించారు.

ఆచార్య గోగినేని రంగాతో లచ్చన్న స్నేహం రాష్ట్ర రాజకీయాలలో ఒక నూతన శకాన్ని ఆరంభించింది. మహాత్మాగాంధీ, పండిట్ నెహ్రూ గురు శిష్య సంబంధం లాంటిదే రంగా- లచ్చన్నల సంబంధం. 1935లో రాష్ట్రంలో కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ శాఖ ఏర్పడినప్పుడు దానికి అతను సభ్యుడుగా ఎన్నికయ్యాడు. ఆ రోజుల్లో రైతు సంఘాలు కాంగ్రెస్ పార్టీలోని అంగాలే. 1939లో త్రిపురలో జరిగిన అఖిలభారత కాంగ్రెస్ మహాసభ, కిసాన్ సభలను ఆంధ్రలోని పలాసాలో జరపాలని తీర్మానించారు. రాహుల్ సాంకృత్యాయన్ ఈ సభలకు అధ్యక్షత వహించారు. ఈ సభలు జయప్రదం కావడానికి ప్రధానకారకుడు లచ్చన్నే. దీనితో ఆయన పేరూ, ఆయన కార్యదీక్ష దేశమంతటా తెలిసింది. లచ్చన్న అనేక కిసాన్ ఉద్యమాలు నడిపి ఆ రోజుల్లో జమీందార్ల పక్కల్లో బల్లెంగా తయరైనారు. 1942లో జరిగిన క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్న లచ్చన్నను ప్రభుత్వం అతి ప్రమాదకరమైన వ్యక్తిగా గుర్తించి, ఆయనను పట్టి యిచ్చిన వారికి పదివేల రూపాయల బహుమతిని ప్రకటించింది. చివరకు ప్రభుత్వమే అతనిని బంధించి మూడేళ్ళు జైల్లో ఉంచి 1945 అక్టోబరులో విడుదల చేసింది. ఆనాటి నుంచి లచ్చన్న ఆంధ్ర అగ్రనాయకులలో ఒకరైనారు. 1947లో లచ్చన్న ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ కు రాష్ట్ర శాఖ అధ్యక్షులయ్యారు. 1950లో ఆచార్య గోగినేని రంగా కృషి కార్ లోక్ పార్టీని స్థాపించినప్పుడు అందులో లచ్చన్న ప్రధాన పాత్ర పోషించాడు. 1953 అక్టోబరు 1 న ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం ఏర్పడింది. మద్రాసు ప్రభుత్వం నుంచి ఆంధ్రులకు రావలసిన ఆస్తుల విభజనను పరిశీలించడానికై ఏర్పడిన ఆంధ్రసంఘంలో కాంగ్రెస్ నుంచి నీలం సంజీవరెడ్డి, ప్రజా పార్టీ నుంచి తెన్నేటి విశ్వనాథం, కృషి కార్ లోక్ పార్టీనుంచి లచ్చన్న సభ్యులు. ప్రకాశం పంతులు మంత్రివర్గంలో, బెజవాడ గోపాలరెడ్డి మంత్రివర్గం లోనూ, లచ్చన్న మంత్రిగా పనిచేశారు. 1961లో రాజాజీ ఏర్పాటు చేసిన స్వతంత్ర పార్టీకి ఆంధ్రప్రదేశ్ శాఖకు సర్దార్ గౌతు లచ్చన్న అధ్యక్షుడు. 1978లో లచ్చన్న ఆంధ్రప్రదేశ్ శాసనసభలో అధికార ప్రతిపక్ష నాయకుడుగా ఉన్నాడు. పబ్లిక్ అక్కౌంట్స్ ఛైర్మన్ గా ఆ రోజుల్లో పనిచేశారు. కొంతకాలం బహుజన పార్టీలో పనిచేసిన లచ్చన్న ఆ తరువాత అన్ని రాజకీయ పార్టీలతో తెగతెంపులు చేసుకుని, పార్టీలకు అతీతంగా బడుగు వర్గాల సంక్షేమానికి కృషి చేస్తూ వచ్చారు. అణగారిన వర్గాల ఆశాజ్యోతి సర్దార్ గౌతు లచ్చన్న 2006 ఏప్రిల్ 19 న కన్ను మూశారు.

# జీవుల్ని ఏ అతీతశక్తీ సృష్టించలేదు..



డార్విన్ పేరును తలుచుకుంటే ఎవరికైనా వెనువెంటనే గుర్తుకు వచ్చేది పరిణామ సిద్ధాంతం. భూమిపై జీవజాలము ఏ విధంగా పరిణామక్రమం చెందినది అనే విషయముపై పరిశోధనలు చేసి, జీవ పరిణామ సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు అయన. ప్రకృతిలో జీవజాతులు వేటికవే ఏక కాలంలో రూపొందినట్లు ఎంతో కాలం నుండి నమ్ముతూ వస్తున్న ప్రజానీకానికి – అదంతా వాస్తవం కాదని ఒక మాతృక నుంచి సకల జీవరాశులు క్రమానుగతంగా పరిణామం చెందుతూ ఏర్పడతాయని, ఈ చర్య అనంతంగా కొనసాగుతూ ఉంటుందని మొట్ట మొదటి సారిగా వివరించినవాడు చార్లెస్ డార్విన్ మాత్రమే. వానరుని నుంచి నరవానరుడు, నరవానరుని నుంచి నరుడు పరిణామ పరంగా ఉద్భవించాడని తెలిపి సంచలనం రేపిన ప్రకృతి శాస్త్రవేత్త చార్లెస్ డార్విన్. చార్లెస్ రాబర్ట్ డార్విన్ (ఫిబ్రవరి 12, 1809 ? ఏప్రిల్ 19, 1882) ఇంగ్లాండుకు చెందిన ప్రకృతివాది.డార్విన్ 1809 ఫిబ్రవరి 12న ఇంగ్లండులోని ష్రూస్‌బరీలో జన్మించాడు. వైద్యుడైన తండ్రి అన్ని సదుపాయాలూ సమకూర్చినా చదువులో రాణించలేదు. ఆయనను మంద బుద్ధిగా ఉపాధ్యాయులు భావించేవారు. ఆయన చిన్ననాటి నుండి కీటకాలను, ఖనిజాలను సేకరిస్తూ రసాయనిక శాస్త్రంలో పరిశోధనలు చేస్తూ ఉండేవాడు. 16 యేండ్ల వయస్సులో వైద్య విద్యను చదవటం కోసం ఆయనను ఎడిన్ బర్గ్ విశ్వ విద్యాలయంలో చేర్పించారు. కాని మత్తు మందులు లేకుండా చేస్తున్న ఆపరేషన్లను చూచి, ఆ చిత్రహింసకు ఆయన కలత చెంది వైద్య విద్యపై మనసు పెట్టి చదవలేకపోయాడు. ఏదో ఒక డిగ్రీ సంపాదించాలనే తండ్రి కోరికపై కేంబ్రిడ్జ్‌లో తత్త్వశాస్త్ర అధ్య అధ్యయనంలో చేరినా అక్కడా అదే పరిస్థితి. అక్కడి ప్రొఫెసర్ ఓసారి అతడికి 'బీగల్' అనే ఓ నౌక కెప్టెన్ కు పరిచయం చేశాడు. వివిధ దేశాల్లో, దీవుల్లో ఉండే జీవుల పరిశీలనకు అవకాశం ఉంటుందనే ఆలోచనతో డార్విన్ తన తండ్రి వద్దంటున్నా వినకుండా ఆ ఓడ ఎక్కేశాడు. ఆ నౌకాయానంలో డార్విన్ అనేక ప్రాంతాల్లో మొక్కలు, రాళ్లు, శిలాజాలు, కీటకాలు, జంతువులను పరిశీలించి చాలా నమూనాలను సేకరించి ఇంటికి పంపుతూ వచ్చాడు. ఆ పరిశీలనల ఆధారంగానే జీవజాతుల పరిణామ క్రమంపై పుస్తకం రాశాడు. 150 సంవత్సరాల క్రితం రాసిన ఈ గ్రంథం ఇప్పటికీ ప్రామాణికంగా నిలిచి ఉంది. జీవుల్ని ఏదో అతీత శక్తి ఏకకాలంలో సృష్టించలేదని, అవి వివిధ దశల్లో స్వాభావిక ఎంపిక ద్వారా పరిణామం చెందాయని డార్విన్ సిద్ధాంతం చెబుతుంది. ఇది ఇప్పటి మైక్రో బయాలజీ, జెనిటిక్స్, మాలిక్యులర్ బయాలజీలను సంఘటిత పరచడంలోనూ, డీఎన్ఏ పరీక్షల్లోనూ ప్రముఖ పాత్ర వహిస్తోంది.

చార్లెస్ డార్విన్ ప్రతిపాదించిన డార్విన్ జీవపరిణామ సిద్ధాంతం భూమి మీది జీవుల పరిణామ క్రమాన్ని తెలియజేస్తుంది. ఆధునిక జీవ శాస్త్రంలో "డార్వినిజం" చాలా మార్పు తెచ్చింది. మూఢ నమ్మకాలను విభేదించడంలో కూడా డార్వినిజం కీలక పాత్ర పోషించింది. మనిషి ఒక రకమైన కోతి జాతి నుంచి పరిణామం చెందుకుంటూ వచ్చాడని, మనిషిని దేవుడు సృష్టించలేదన్న సిద్ధాంతాన్ని తెర మీదకు తెచ్చింది. ఇప్పుడు కూడా సృష్టివాదం పేరుతో డార్వినిజాన్ని వ్యతిరేకించే వాళ్ళు ఉన్నారు. డార్విన్ జీవ పరిణామ సిద్ధాంతం మార్క్సిస్ట్ చారిత్రక భౌతికవాద రచనలకి కూడా ఊపిరి పోసింది. మలేషియా నుంచి రసెల్ వాలేస్ (1823–1913) అనే వ్యక్తి పంపిన సిద్ధాంత వ్యాసం డార్విన్ వ్యాసం ఒకే విధంగా ఉన్నాయి. డార్విన్ 1844లో తన రచనను, వాలేస్ పంపిన వ్యాసాన్ని లియన్ సొసైటీ జర్నల్‌కు అందచేశాడు. 1858 జూలై 15న శాస్త్రవేత్తల సమావేశం జరిగింది. ఇరువురి వ్యాసాలు పరిశీలించారు. 1844లో డార్విన్ మొదలు పెట్టగా, వాలేస్ 1858లో రాశాడు. కనుక డార్విన్ ముందు రాసినట్టు నిర్ధారించారు. ప్రస్తుతం ప్రపంచంలో కనబడుతున్న రకరకాల ప్రాణులు మొదటి నుంచీ లేవనేది ఈ సిద్ధాంతం యొక్క ప్రధానమైన వాదన. కుక్కలూ, నక్కలూ, తోడేళ్ళూ ఒక జాతివనీ, పిల్లులూ, చిరత పులులూ, పెద్ద పులులూ, సింహాలూ మరొక జాతికి చెందినవనీ, గుర్రాలూ, గాడిదలూ, జీబ్రాలూ ఒకలాంటివే. గతంలో వీటికి తలొక "పూర్వీకుడూ" ఉండి ఉండాలి. ఇంకా వెనక్కెళితే ఈ "ఆదిమ" శునకానికీ, మార్జాలానికీ, అశ్వానికీ జన్మనిచ్చిన మరేదో మృగం ఉండి ఉంటుంది. ఇంకా ప్రాచీన యుగంలో ఈ క్షీరదాలకీ, తక్కిన చేపలూ, తాబేళ్ళూ, జలచరాలూ, పక్షులూ అన్నిటి ఆవిర్భావానికీ దారితీసిన ప్రాణి ఏదో ఉండే ఉంటుంది. వీటిలో కొన్ని శాకాహారులుగా, మరికొన్ని మాంసాహారులుగా రూపొందడానికి భౌతిక ప్రేరణలూ, పర్యావరణ పరిస్థితులే కారణాలు అయి ఉంటాయి. ఇన్నిరకాల ప్రాణులు "వాటంతట అవే" ఎలా ఉద్భవిస్తాయని వీరి వాదన సాగిపోతుంది. ఉదాహరణకు ఆఫ్రికాలో పుట్టుకొచ్చిన మానవ జాతి క్రమంగా ఉత్తర దిశగానూ, తక్కిన ప్రాంతాలకీ విస్తరించిందని శాస్త్రవేత్తలు ఊహిస్తున్నారు. ఉష్ణోగ్రత దృష్ట్యా తొలి మానవులు నల్లని రంగులో ఉండి ఉంటారని అనుకోవచ్చు. ఉత్తరాన ఎండపొడ తక్కువగా పడే ప్రాంతాలకు వెళ్ళినవారి చర్మం తెల్లగా మారక తప్పలేదు. పూర్తిగా నల్లరంగులో ఉన్న ఒక మానవ సమూహం తెల్లగా మారి పోవడానికి 20 వేల సంవత్సరాలు సరిపోతాయని అంచనా. తక్కిన జంతువుల సంగతి ఎలా ఉన్నా, ఒక్క మనిషి జాతినే తీసుకుంటే, చర్మం రంగూ, ముఖ కవళికలూ అన్నీ మెల్ల మెల్లగా మారడానికి జీవపరిణామ ప్రక్రియలే కారణమని రుజువు అవుతోంది. సరిగ్గా ఆ సమయంలోనేఆల్ఫ్రెడ్ రస్సెల్ వాలెస్ అనే మరో శాస్త్రవేత్త కూడా డార్విన్ చెప్పిన సిద్ధాంతాన్నే వెలువరించాడు. డార్విన్ కు ఉత్తరం కూడా రాసాడు. 1858 లో వీరిద్దరూ సంయుక్తంగా ఒక పరిశోధనా పత్రాన్ని సమర్పించారు. కూడా! 1859 లో ప్రపంచ ప్రసిద్ధి పొందిన "ది ఆరిజన్ ఆఫ్ స్పీసిస్ ఆఫ్ నేచురల్ సెలక్షన్" పుస్తకాన్ని చార్లెస్ డార్విన్ వెలువరించాడు. ఈ పుస్తకం విడుదలైన రోజునె అన్ని ప్రతులూ అమ్ముడు పోయి సరికొత్త రికార్డును సృష్టించింది. పరిణామ సిద్ధాంతం జీవజాతుల మధ్య సంఘర్షణ ఉంటుంది. సజాతి సంఘర్షణ, విజాతి సంఘర్షణ, ప్రకృతిలో సంఘర్షణ. ఈ సంఘర్షణలో నెగ్గినవే ప్రకృతి ఎన్నిక చేసిన సార్థకమ జీవులు. ఇవే మనుగడను సాగిస్తాయి. ఈ జీవులలోని వైవిద్యాలే తరాలు మారుతూపోగా కొత్త జాతుల ఉత్పన్నానికి మూలాధారాలు అవుతాయి. ఇది సంక్షిప్తంగా డార్విన్ పరిణామవాదం. అయితే సృష్టి సిద్ధాంత వాదులు ఈయన వాదనను సమర్థించరు. అయితే బైబిల్ లో చెప్పినట్లు ఏడు రోజుల లోనే సమస్త సృష్టి, సకల జీవ జలాలు రూపొందించ బడినాయని చెబితే మాత్రం నమ్మడం కష్టం.చార్లెస్ డార్విన్ స్వంత దేశమైన బ్రిటన్ లో డార్వినిజం ఎన్నో ప్రశంశలు అందుకుంది. డార్వినిజం ప్రపంచంలో ఎంతో మంది భౌతిక శాస్త్రవేత్తలని, జీవ శాస్త్రవేత్తలని ప్రభావితం చేసి అధునిక భౌతిక శాస్త్ర విజ్ఞానాన్ని ఎన్నో మలుపులు తిప్పింది.అయితే కొన్ని క్రైస్తవ, ఇస్లామిక్ దేశాలలో డార్వినిజం చాలా వివాదాస్పద మయ్యింది. సృష్టి వాదాన్ని వ్యతిరేకించడం దైవ ద్రోహం అని మతవాదుల వాదన. కొన్ని ఇస్లామిక్ దేశాలలో ఈ సిద్ధాంతాన్ని నిషేదించారు. ఈ సిద్ధాంతం తప్పని, జీవ పరిణామక్రమం జరగలేదని వాదించే వారు కూడా ఉన్నారు. ఈయన 74 యేండ్ల వయస్సులో మృతి చెందాడు. సర్ ఐజాక్ న్యూటన్ సమాధి దగ్గరే ఆయన కూడా సమాధి చేయ బడింది. డార్విన్ లేకపోయినా ఆయన ప్రతిపాదించిన జీవ పరిణామ సిద్దాంతం ఎప్పటికీ నిలిచే ఉంటుంది.

# బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య తెలంగాణ ప్రజలకు బేషరుతుగా క్షమాపణ చెప్పాలి..

తెలంగాణ ఉద్యమ కారుల ఐక్య వేదిక డిమాండ్



**మంచిర్యాల,ఏప్రిల్18(సూర్యరేఖ)** తెలంగాణ ఆత్మగౌరవాన్ని కించపరిచే విధంగా పార్లమెంట్‌లో వ్యాఖ్యలు చేసిన తేజస్వి సూర్య తెలంగాణ ప్రజలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని మంచిర్యాల జిల్లా తెలంగాణ ఉద్యమ కారుల ఐక్య వేదిక డిమాండ్ చేసింది.ఈ సమావేశంలో నాయకులు మాట్లాడుతూ...తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును దేశ విభజనతో పోలుస్తూ లోక్ సభలో చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ఉన్నాయని తీవ్రంగా ఖండించారు.60 ఏళ్లపాటు సాగిన పోరాటం,వేలాది అమర వీరుల త్యాగాలతో పార్లమెంట్ ప్రక్రియ ద్వారా ఏర్పడిన తెలంగాణను పాకిస్తాన్‌తో పోల్చడం క్షమించరాని చర్య అని పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఎంపీ తేజస్వి సూర్య వెంటనే బేషరతుగా క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో తెలంగాణలో ఆయన పర్యటనలను అడ్డుకుంటామని హెచ్చరించారు.అలాగే ఆయన చేసిన వ్యాఖ్యలను పార్లమెంట్ రికార్డుల నుండి తొలగించాలని ఓం బిర్లాను కోరారు. బాధ్యతారాహిత్య వ్యాఖ్యలు చేసినందుకు ఆయనను సస్పెండ్ చేయాలని కూడా డిమాండ్ చేశారు.ఇక తెలంగాణ ఉద్యమాన్ని అవమానించే విధంగా వ్యాఖ్యానాలు చేయకుండా బీజేపీ నాయకులు జాగ్రత్త వహించాలని హెచ్చరించారు. ఇదే విధంగా కొనసాగితే రాష్ట్రంలో బీజేపీకి ప్రజలు తగిన సమాధానం ఇస్తారని స్పష్టం చేశారు. సమావేశంలో పాల్గొన్న నాయకులు తెలంగాణ చరిత్రను అవగాహన చేసుకుని మాట్లాడాలని సూచిస్తూ,ఉద్యమ కాలంలో ప్రజలు ఎదుర్కొన్న కష్టాలు,త్యాగాలను గుర్తుచేశారు.ఈ సమావేశంలో అధ్యక్షుడు గజెల్లి వెంకటయ్య,ఉపాధ్యక్షుడు ఏ. గంగయ్య,కార్యదర్శి కస్తూరి సూర్యం,ఉద్యమ నాయకులు బి.ప్రభాకర్,జేడీ బీరయ్య,సిహెచ్ వైకుంఠం,కె.రాజిరెడ్డి,డి.సాయిలు తదితరులు పాల్గొన్నారు.

# మహిళా రిజర్వేషన్ బిల్లును వెంటనే అమలు చేయాలి..

డీలిమిటేషన్‌తో అనుసంధానం చేయడం ఆలస్యం చేసే ప్రయత్నమే..
మరిపెడ మున్సిపల్ చైర్ పర్సన్ వీసారపు ప్రగతి శ్రీపాల్ రెడ్డి

**మరిపెడ,ఏప్రిల్18(సూర్యరేఖ)**మహిళలకు రాజకీయాల్లో సముచిత ప్రతినిధిత్వం కల్పించే మహిళా రిజర్వేషన్ బిల్లును తక్షణమే అమలు చేయాలని మున్సిపల్ చైర్ పర్సన్ వీసారపు ప్రగతి శ్రీపాల్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.శనివారం మరిపెడ మున్సిపల్ కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ... 2023లో పార్లమెంట్ ఆమోదం పొందిన మహిళా రిజర్వేషన్ బిల్లును వెంటనే అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు.మహిళల అభివృద్ధి, సామాజిక న్యాయం కోసం ఈ చట్టం ఎంతో కీలకమని అన్నారు.దేశంలో మహిళల జనాభా సగానికి సమానంగా ఉన్నప్పటికీ, శాసనసభలు, పార్లమెంట్‌లో వారి ప్రాతినిధ్యం తక్కువగానే ఉందని గుర్తుచేశారు.మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించే చట్టం అమలులోకి వస్తే పాలనలో సమానత్వం సాధ్యమవుతుందని అన్నారు .మహిళలకు లోక్‌సభ,రాష్ట్ర శాసనసభల్లో 33శాతం రిజర్వేషన్ కల్పించే ఈ చట్టాన్ని ఆలస్యం చేయడం మహిళల రాజకీయ హక్కులను వాయిదా వేయడమేనని,మహిళా రిజర్వేషన్ బిల్లును జనగణ, డీలిమిటేషన్ ప్రక్రియలతో అనుసంధానం చేయడం వల్ల అమలు మరింత ఆలస్యం అవుతుందని విమర్శించారు.బిల్లును ఆలస్యం చేయడం వల్ల మహిళల రాజకీయ అవకాశాలు మరింత వెనక్కి వెళ్లే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.ఇప్పటికే పార్లమెంట్ ఆమోదం పొందిన చట్టాన్ని వెంటనే అమలు చేయకుండా వివిధ ప్రక్రియల పేరుతో వాయిదా వేయడం సరైంది కాదని అభిప్రాయపడ్డారు.అదే విధంగా డీలిమిటేషన్ ప్రక్రియను మహిళా రిజర్వేషన్‌తో అనుసంధానం చేయడం వల్ల దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యంపై ప్రభావం పడే ప్రమాదం ఉందనే సీఎం రేవంత్ రెడ్డి ఆందోళన నూటికి నూరు పాళ్ళు వాస్తవమని దేశవ్యాప్తంగా అభిప్రాయం వ్యక్తమవుతుందని అన్నారు. ముఖ్యంగా జనాభా నియంత్రణలో ముందంజలో ఉన్న కొన్ని రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గే అవకాశం ఉందని పలు వర్గాలు ఇప్పటికే అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నాయని పేర్కొన్నారు. మహిళలకు రాజకీయాల్లో సముచిత ప్రాతినిధ్యం కల్పించాలంటే మహిళా రిజర్వేషన్ బిల్లును తక్షణమే అమలు చేయాలని,మహిళల హక్కుల విషయంలో ఆలస్యం చేయడం ప్రజాస్వామ్యానికి అనుకూలం కాదని కాంగ్రెస్ పార్టీ స్పష్టం చేసిందన్నారు.



## ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బందికి సిఐటియు సంఘీభావం



**రామకృష్ణాపూర్,ఏప్రిల్18(సూర్యరేఖ)** టెండర్ రద్దు కారణంగా ఉపాధి కోల్పోయిన 230 మంది కాంట్రాక్టు కార్మికులు గత కొన్ని రోజులుగా ఆందోళనలు కొనసాగిస్తున్న నేపథ్యంలో వారికి సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు)సంఘీభావం తెలిపారు.సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కారానికి మద్దతుగా శనివారం రామకృష్ణాపూర్ సిహెచ్‌పి వద్ద నిర్వహించిన కార్యక్రమంలో సిఐటియు బ్రాంచ్ అధ్యక్షుడు ఎస్.వెంకటస్వామి మాట్లాడుతూ...గత పది రోజులుగా కార్మికులు తమకు ఉపాధి కల్పించాలని కోరుతూ వివిధ రూపాల్లో తమ నిరసనలు వ్యక్తం చేస్తున్నారని తెలిపారు.కార్మికుల సమస్యలను గమనించిన కార్మికశాఖ మంత్రి మరియు స్థానిక ఎమ్మెల్యే వివేక్ స్పందించి,కొత్త టెండర్‌లో పాత కార్మికులనే కొనసాగించాలని సూచించారని వెల్లడించారు. దీనిపై స్థానిక జీఎం కూడా స్పందించి,ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బందికి భరోసా కల్పించారని,ఆందోళనలను విరమించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు.అయితే కొత్త టెండర్‌లో పోస్టుల సంఖ్యను 90కి తగ్గించకుండా, పాత విధంగా 126పోస్టులను కొనసాగించాలని డిమాండ్ చేశారు.ఈ డిమాండ్లు నెరవేరని పక్షంలో అన్ని యూనియన్లను కలుపుకొని పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘం సిఐటియు రాష్ట్ర అధ్యక్షుడు దూలం శీను,సిహెచ్‌పి సెక్రటరీ గుజ్జ సతీష్,పంగ మల్లేష్, సీనియర్ నాయకుడు అలవాల సంజీవ్‌తో పాటు పలువురు కార్మికులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ రాష్ట్రీయ సమ్మాన్ పురస్కారం అందుకున్న ప్రభుత్వ టీచర్



**మందమర్రి,ఏప్రిల్ 18(సూర్యరేఖ)** పట్టణంలోని ఫిల్టర్ బెడ్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల (ఎంపిపిఎస్)లో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు డాక్టర్ భీంపుత్ర శ్రీనివాస్ జల్లంపల్లి ప్రతిష్టాత్మక "డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ రాష్ట్రీయ సమ్మాన్ -2026" పురస్కారాన్ని అందుకున్నారు.గ్లోబల్ ఐకాన్స్ ఆఫ్ ఇండియా ఈ-మ్యాగజైన్‌లో స్థానం సంపాదించిన ఆయనకు ఈ అవార్డును నిర్వాహకులు ప్రదానం చేశారు.ఈ సందర్భంగా అవార్డుతో పాటు సర్టిఫికెట్, మెడల్,జ్ఞాపికలను పోస్టు ద్వారా శనివారం అందజేశారు.అలాగే భీం పుత్ర శ్రీనివాస్ సేవలను ప్రశంసిస్తూ గ్లోబల్ ఐకాన్స్ ఆఫ్ ఇండియా మ్యాగజైన్‌లో ప్రత్యేక కథనాన్ని కూడా ప్రచురించారు. డాక్టర్ భీం పుత్ర శ్రీనివాస్ జల్లంపల్లి గత25 సంవత్సరాలుగా విద్యారంగంలో అంకితభావంతో సేవలందిస్తున్న అనుభవజ్ఞుడైన ఉపాధ్యాయుడు. విద్యార్థులతో స్నేహపూర్వకంగా మెలుగు తూ, పాఠశాల యూనిఫాంలోనే బోధిస్తూ క్రమశిక్షణ, సమానత్వాన్ని పెంపొం దించే విధానానికి ఆయన ప్రత్యేక గుర్తింపు పొందారు.ఈ కారణంగా "యూనిఫాం టీచర్"గా ప్రసిద్ధి చెందారు.అలాగే క్షేత్రస్థాయి బోధన, ఆచరణాత్మక అభ్యాసం,"చేస్తూ నేర్చుకోవడం"వంటి వినూత్న పద్ధతుల ద్వారా విద్యార్థుల్లో నేర్చుకునే ఆసక్తిని పెంపొందిస్తున్నారు. విద్యకు మాత్రమే కాకుండా కోవిడ్-19అవగాహన, ఆరోగ్య విద్య,అవయవ దానం వంటి సామాజిక కార్యక్రమాల్లో కూడా ఆయన చురుకుగా పాల్గొంటున్నారు.అనేక పురస్కారాలను అందుకున్న శ్రీనివాస్, విలువల ఆధారిత విద్య,సామాజిక బాధ్యత, సంపూర్ణ వ్యక్తిత్వ వికాసం పట్ల తన నిబద్ధతతో యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...అంబేద్కర్ పేరుతో ఈ ప్రతిష్టాత్మక పురస్కారం అందుకోవడం గర్వంగా ఉందని తెలిపారు.ఈ పురస్కారం అందుకున్న డాక్టర్ భీం పుత్ర శ్రీనివాస్ జల్లంపల్లిని పలువురు అభినందించారు.

## కన్నీళ్ల కష్టాల నుంచి రాష్ట్రస్థాయి కిరీటం వరకు..
## రిషికా స్ఫూర్తిదాయక విజయం..

కష్టాలను మెట్లుగా చేసుకుని చదువులో శిఖరాలను అధిరోహించిన ఓ బాలిక...బైపీసీ ఫస్ట్ ఇయర్‌లో స్టేట్ సెకండ్ ర్యాంక్ సాధించిన రామాయంపేటకు చెందిన రిషికా కథనం ప్రతి హృదయాన్ని తడిమింది.






**రామాయంపేట,ఏప్రిల్18(సూర్యరేఖ)** రామాయంపేట పట్టణానికి చెందిన దోమకొండ చందన శ్రీనివాస్ దంపతుల కూతురు రిషికా తన ప్రతిభతో రాష్ట్ర స్థాయిలో వెలుగొందింది. హైదరాబాద్ మియాపూర్‌లోని వీఆర్ జూనియర్ కాలేజీలో బైపీసీ ఫస్ట్ ఇయర్ చదువుతున్న ఆమె, రాష్ట్ర స్థాయిలో ద్వితీయ ర్యాంక్ సాధించి అందరి ప్రశంసలు అందుకుంది .సాధారణ కుటుంబంలో పుట్టిన రిషికా,తన లక్ష్యాన్ని ముందుంచుకుని ఎన్నో కష్టాలను తట్టుకుని ఈ ఘనతను సాధించింది. రాత్రింబవళ్లు కష్టపడి చదివిన ఆమె పట్టుదల, తల్లిదండ్రుల త్యాగాలు ఈ విజయానికి బాటలు వేశాయి."చదువే మార్గం"అన్న నమ్మకంతో ముందుకు సాగిన రిషికా విజయగాథ అనేకమందికి స్ఫూర్తిగా నిలుస్తోంది.ఈ సందర్భంగా వీఆర్ జూనియర్ కాలేజ్ చైర్మన్ రమేష్ ఆమెను పుష్పగుచ్ఛంతో సత్కరించి అభినందనలు తెలిపారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం,క్రమశిక్షణ ఉంటే ఎలాంటి లక్ష్యమైనా సాధ్యమేనని ఆయన పేర్కొన్నారు. ఇక సగర జాతికి చెందిన రిషికా ఈ ఘనత సాధించడంతో,ఆ వర్గానికి గర్వకారణంగా నిలిచింది. "మన జాతి పేరు రాష్ట్ర స్థాయిలో మారుమోగేలా చేసింది" అంటూ సగర సంఘ సభ్యులు భావోద్వేగంతో కృతజ్ఞతలు తెలిపారు.రిషికా విజయంతో రామాయంపేట మాత్రమే కాదు,మొత్తం ప్రాంతం ఆనందంలో మునిగిపోయింది.

## అధినేత అడుగుజాడల్లో నడుస్తాం..
## పార్టీని బలోపేతం చేస్తాం.

పల్లెం అరవింద్ జనసేన సాదక్.




**కామారెడ్డి,ఏప్రిల్18(సూర్యరేఖ)** ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి జనసేన అధినేత శ్రీకొణిదెల పవన్ కళ్యాణ్ అడుగుజాడల్లో నడుస్తూ కామారెడ్డి నియోజకవర్గంలో జనసేన పార్టీని బలోపేతానికి కృషి చేస్తానని జనసేన పార్టీ రామారెడ్డి మండలసాదక్ పల్లెం అరవింద్ అన్నారు.గత కొద్ది రోజులుగా జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పై కొందరు వ్యక్తులు అనుచిత వాక్యాలు చేస్తున్నారు. ఒక్కసారి పార్టీ అధినేత గురించి తెలుసుకొని మాట్లాడాలని వారికి సూచించారు.తెలుగు రాష్ట్రాల్లో నిరంతరం ప్రజల కోసం తపనపడే వ్యక్తి ఎవరైనా ఉన్నారంటే అది ఒక పవన్ కళ్యాణ్ తప్ప వేరే నాయకుడు ఎవరు లేరని అరవింద్ తెలిపారు.పార్టీ కార్యకర్తల కోసం ఐదు లక్షల రూపాయల బీమా సౌకర్యం కల్పించి భారత దేశంలో ఏ పార్టీ కూడా ఇలాంటి సాహూసపతమైన నిర్ణయం తీసుకోవడం ఒక పవన్ కళ్యాణ్ కి తప్ప మిగతా నాయకులకు ఇలాంటి ఆలోచనలు రావు కావున దయచేసి మరోసారి పవన్ కళ్యాణ్ పై మాట్లాడే ముందు ఆలోచించి మాట్లాడాలని రామారెడ్డి మండల జనసేన పార్టీ సాదక్ పల్లె అరవింద్ అన్నారు.

## పెరుగుతున్న ఎండ తీవ్రత..ప్రతి ఒక్కరు జాగ్రత్తగా ఉండాలి..

శివంపేట్ మండల కాంగ్రెస్ నాయకులు బోయిని నాగరాజు యాదవ్..



**శివంపేట,ఏప్రిల్18(సూర్యరేఖ)**తెలంగాణ రాష్ట్రంలో రోజురోజుకు ఎండగా తీవ్రత గరిష్టంగా చేరుకుంటుందని,ప్రతి ఒక్కరు జాగ్రత్తగా ఉండాలని శివంపేట మండలశీలోని పెద్ద గొట్టిముక్కల గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బోయిని నాగరాజు యాదవ్ పత్రిక ప్రకటనలో తెలియజేశారు.ముఖ్యంగా ఉపాధి కూలీలు,గర్భిణీ స్త్రీలు, చిన్నపిల్లలు ఎట్టి పరిస్థితులను బయటకు వెళ్లకూడదని, ఎండాకాలంలో పాటించే సూచనలు ప్రతి ఒక్కరు పాటించాలని,త్రాగునీరు ఎక్కువ త్రాగాలని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు.

# గంగపుత్ర ఆత్మగౌరవ భవన నిర్మాణం తొందరలోనే పూర్తి చేస్తాం..

మంత్రి పొన్నం ప్రభాకర్



**కామారెడ్డి,ఏప్రిల్18(సూర్యరేఖ)** గంగపుత్ర ఆత్మగౌరవ భవన నిర్మాణం కోసం. శనివారం తెలంగాణ రాష్ట్ర ఫిషరీస్ చైర్మన్ మెట్టు సాయికుమార్ ఆధ్వర్యంలో మంత్రి పొన్నం ప్రభాకర్, ను మర్యాదపూర్వకంగా కలిశారు. గంగపుత్ర సంఘ భవనం నిర్మాణానికి ప్రభుత్వం చేపట్టి గంగపుత్రులకు భవనం అందుబాటులోకి తేవాలని వారు మంత్రిని కోరారు.దానికి మంత్రి స్పందిస్తూ తొందరలోనే మూడు కోట్ల రూపాయలను విడుదల చేయిస్తామని హామీ ఇచ్చారు.త్వరలో భవన నిర్మాణం పూర్తిచేసేలా మీకు అన్ని విధాల సహకార అందిస్తానని మంత్రి గంగపుత్రులకు హామీ ఇచ్చారు. అలాగే బీసీఏలో గంగపుత్రులు కాకుండా అగ్నికుల క్షత్రియ అని ఇవ్వడం జరిగింది.ఉమ్మడి రాష్ట్రంలో ఉన్నప్పుడు హైదరాబాదులో కానీ తెలంగాణ జిల్లాలో వారి జనాభా 40వేల లోపే ఉంటారు.కానీ గంగపుత్ర బిస్తా గుండ్ల సుమారుగా 15లక్షల జనాభా ఉంటుంది కానీ అగ్నికుల క్షత్రియ అని ఇవ్వడం జరిగినది.దీనిపైన కూడా మంత్రితో మాట్లాడడం జరిగిందని వారు తెలిపారు.తప్పకుండా జీవో గంగపుత్ర అని విడుదల చేస్తామని మంత్రి గంగపుత్రులకు హామీ ఇవ్వడం జరిగిందని వారు తెలిపారు.మంత్రి కలిసిన వారిలో తెలంగాణ రాష్ట్ర గంగపుత్ర సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు, కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు మాజీ కౌన్సిలర్ పాక జ్ఞానేశ్వరి ప్రసాద్ లు ఉన్నారు

# భారత యూఎస్ ట్రేడ్ డీల్ కి వ్యతిరేకంగా హౌస్ బాపూఘాట్ జాతీయ యూత్ కాంగ్రెస్ దీక్ష..





**నాంపల్లి,హైదరాబాద్,ఏప్రిల్18(సూర్యరేఖ)** జాతీయ యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో భారతయూఎస్ ట్రేడ్ డీల్ కి వ్యతిరేకంగా రంగారెడ్డి జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు కొండకళ్ల నాగేందర్ రెడ్డి లంగర్ హౌస్ సత్యాగ్రహ దీక్ష 10వ రోజుకు చేరింది.ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా జాతీయ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఉదయభాను చిబ్,అతిథులుగా తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, తెలంగాణ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి, రాష్ట్ర ఇంచార్జ్ భవ్యాజి,జిల్లా ఇన్చార్జ్ సంతోష్ గౌడ్, జాతీయ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఉదయభాను పాల్గొని ప్రసంగిస్తూ...రైతులకు జరుగుతున్న అన్యాయం పట్ల వివరిస్తూ జాతీయ యువజన కాంగ్రెస్ తరపున రైతులకు అండగా ఉంటామం టూ హామీ ఇచ్చారు.అనంతరం జిల్లా అధ్యక్షునికి, రంగారెడ్డి జిల్లా ఇన్చార్జ్ నాయకులకు నిమ్మరసం అందించి దీక్షను విరమణ చేయించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు మిట్టపల్లి వెంకటేష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు రవికాంత్ గౌడ్, వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు సతీష్ రెడ్డి,రంగారెడ్డి జిల్లా కార్యవర్గ కమిటీ ఉపాధ్యక్షుడు సైనికేష్, సంజయ్, రమేష్ నాయక్, ప్రధాన కార్యదర్శిలు రామకృష్ణ,ఇర్ఫాన్, కస్తూరి పవన్,నియోజవర్గ ఉపాధ్యక్షులు చంద్ర యాదవ్,సోషల్ మీడియా కోఆర్డినేటర్ సంతోష్ ముదిరాజ్, శ్రీనివాస్, కిరణ్,ఆదర్శ తదితర నియోజ వర్గాల కార్యవర్గం కమిటీ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# సూక్ష్మ,చిన్న,మధ్య తరహా పరిశ్రమల బలోపేతానికి కృషి..

లఘు ఉద్యోగ భారతి అఖిల భారత అధ్యక్షుడు మధుసూదన్ దాడు



(L-R) Sri Om Anuj Kehrandelwal, Treasurer, TG LUB; Sri B. Anil Kumar, All India EC Member, LUB; Sri Madhu Sudan Dadu, All India President, Laghu Udyog Bharati (LUB); Sri V. Venkateswarlu, State President, Telangana (TG) LUB & Sri K. Narendranath Dath, State General Secretary, TG LUB; at the press conference, organised by Laghu Udyog Bharati, the India's largest MSME-association, today at Aramghar.

**రాజేంద్రనగర్,ఏప్రిల్18(సూర్యరేఖ)** సూక్ష్మ,చిన్న,మధ్య తరహా పరిశ్రమల బలోపేతానికి కృషి చేస్తున్నట్లు లఘు ఉద్యోగ భారతి అఖిల భారత అధ్యక్షుడు మధుసూదన్ దాడు తెలిపారు.రాజేంద్రనగర్ ఆరంఘర్ లోని బికనేర్వాలా బొటిక్‌లో మీడియా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...లఘు ఉద్యోగ భారతి సూక్ష్మ,చిన్న,మధ్య తరహా పరిశ్రమలకు ప్రాతినిధ్యం వహిస్తుందన్నారు.28 రాష్ట్రాల్లో 75వేల మందికి పైగా సభ్యులతో దేశంలోనే అతిపెద్ద సంఘంగా నిలిచిందన్నారు.కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలతో సన్నిహితంగా పని చేస్తూ ఎంఎస్ఎంఈ విధానాల రూపకల్పన, అమలులో విలువైన సూచనలు అందిస్తున్నామని తెలిపారు.ప్రభుత్వాలు కూడా మా సూచనలను కోరుకుంటున్నాయన్నారు. తెలంగాణ శాఖ దేశంలోనే అత్యంత చురుకైన శాఖలలో ఒకటిగా ఉందన్నారు.ఎంఎస్ఎంఈ అభివృద్ధికి విశేషంగా తోడ్పడుతోందని చెప్పారు.దేశవ్యాప్తంగా సభ్యులు పరస్పరం కలిసేలా, వ్యాపార అవకాశాలు పెంపొందించుకునేలా లఘు ఉద్యోగ భారతి ఒక బలమైన డిజిటల్ వేదికను అందిస్తుందని పేర్కొన్నారు.సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్నామన్నారు.విద్యా సంస్థలు,ఐఐటీలు, పరిశోధన, మేనేజ్‌మెంట్ సంస్థల భాగస్వామ్యంతో సభ్యులు సామర్థ్యాన్ని పెంచుకుం టున్నారని తెలిపారు.సీఎస్ఐఆర్ తో నిర్వహించిన '100 రోజులు-100 టెక్నాలజీలు' కార్యక్రమం ద్వారా సభ్యులు వినూత్న సాంకేతిక పరిష్కారాలతో లాభపడుతున్నారని తెలిపారు.తెలంగాణకు చెందిన ఇద్దరు సభ్యులు ఈ సాంకేతికతతో ప్రయోజనం పొందారన్నారు.అదనంగా 100కు పైగా ఐటీఐలతో భాగస్వామ్యం ద్వారా పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా పాఠ్య ప్రణాళికలను రూపుదిద్దుతున్నామన్నారు.నైపుణ్యం కలిగిన మానవ వనరుల ను తయారు చేసి,ఉపాధి అవకాశాలు సృష్టిస్తున్నామని తెలిపారు.ఈ సందర్భంగా లఘు ఉద్యోగ భారతి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు వీ.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ...తెలంగాణలో 13 జిల్లాల్లో విస్తరణకు నిర్ణయం తీసుకున్నామన్నారు.కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల ముందు ఎంఎస్ఎం ఈల వాణిని మరింత బలంగా వినిపించడమే లక్ష్యమన్నారు. పరిశ్రమల సమస్యలకు ప్రాతినిధ్యం వహిస్తున్నామన్నారు.మా కృషితో ప్రభుత్వాల నుంచి సానుకూల స్పందన లభిస్తుందన్నారు.విధానాలు,జీఓలకు సంబంధించిన ముఖ్య సమస్యలు పరిష్కారమవుతున్నాయని తెలిపారు.నైపుణ్య లోటును అధిగమించేందుకు ఐటీఐ ప్రిన్సిపాళ్లతో చర్చలు ప్రారంభించామన్నారు. పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా పాఠ్య ప్రణాళికలో మార్పులకు చర్యలు చేపట్టామన్నారు.ఈ క్రమంలో కుదిరిన ఎంఓయూ ద్వారా ఇప్పటికే సుమారు 200 మంది విద్యార్థులకు ఉపాధి కల్పించగలిగామన్నారు. ఇన్నోవేషన్,పరిశ్రమల మధ్య గ్యాప్‌ను తగ్గించేందుకు,ఐఐసీటీ వద్ద ఉన్న 2,600కు పైగా సిద్ధంగా ఉన్న సాంకేతిక పరిజ్ఞానాలను ఎంఎస్ఎంఈలకు అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు.ఈ సందర్భంగా లఘు ఉద్యోగ భారతి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.నరేంద్రనాథ్ దత్ మాట్లాడుతూ ..లఘు ఉద్యోగ భారతి ఎంఎస్ఎంఈల సంక్షేమం కోసం కృషి చేస్తుందన్నారు.తెలంగాణలో 600మంది సభ్యులు ఉన్నారన్నారు.మా నినాదం 'మేడ్ ఇన్ ఇండియా-మేడ్ ఫర్ ది వరల్డ్' అన్నారు.ఈ సమావేశంలో లఘు ఉద్యోగ భారతి అఖిల భారత సంయుక్త ప్రధాన కార్యదర్శి మోహన్ సుందరం,అఖిల భారత ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడు బీ అనిల్ కుమార్,తెలంగాణ రాష్ట్ర కోశాధికారి ఓం అనుజ్ ఖేరండేవాల్ పాల్గొన్నారు.


## షెడ్యూల్డ్ కులాల యువత నుండి దరఖాస్తుల స్వీకరణకు గడువు పొడిగింపు..

జిల్లా షెడ్యూల్డ్ కులముల సేవా సహకార అభివృద్ధి సంఘం ఈ.ఈ.చాతరాజుల దుర్గాప్రసాద్

**మంచిర్యాల,ఏప్రిల్18(సూర్యరేఖ)** 2025-26 సంవత్సరానికి గాను 2పాడి గేదెల పెంపకం పథకం కోసం అర్హత గల ఎస్.సి.యువత దరఖాస్తు చేసుకునేందుకు గడువును ఈనెల 23వ తేదీ వరకు పొడిగించడం జరిగిందని జిల్లా షెడ్యూల్డ్ కులముల సేవా సహకార అభివృద్ధి సంఘం కార్యనిర్వాహక సంచాలకులు చాతరాజుల దుర్గాప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్ లైన్ లో నమోదు చేసిన దరఖాస్తును డౌన్ లోడ్ చేసుకొని అవసరమైన ప్రతులను జతపరిచి సంబంధిత మండల/మున్సిపల్ కార్యాలయాలలో సమర్పించాలని,అభ్యర్థులు దరఖాస్తుతో ఆధార్ కార్డు,రేషన్ కార్డు/ఆహార భద్రతా కార్డు,కుల ధ్రువీకరణ పత్రం(తెలంగాణ ఏర్పడిన తర్వాత జారీ చేయబడినది),ఆదాయ ధ్రువీకరణ పత్రం(మీ- సేవ ద్వారా జారీ చేయబడింది, గ్రామీణ ప్రాంతాల వారికి వార్షిక ఆదాయం రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల వారికి రూ.2లక్షల లోపు ఉండాలి) తెలిపారు.పాడి పశువుల పథకం కొరకు పశుగ్రాసం పెంచేందుకు కనీసం10 గుంటల భూమి కలిగి ఉండాలని,పాస్పోర్ట్ సైజ్ ఫోటో జతపరచవలసి ఉంటుందని తెలిపారు.ఆసక్తి,అర్హత గల నిరుద్యోగ యువతీ యువకులు ఈనెల 23వ తేదీలోగా ఆన్ లైన్ లో వెబ్ సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని,అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## వేర్వేరు ఘటనల్లో ఇద్దరి ఆత్మహత్య





**రాజేంద్రనగర్,ఏప్రిల్18(సూర్యరేఖ)** రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో వేర్వేరు చోట్ల జరిగిన ఘటనల్లో ఇద్దరు ఆత్మహత్యకు పాల్పడి మృతిచెందారు.పోలీసుల వివరాల ప్రకారం..కాళీమందిర్ ఎన్ఎఫ్‌సీ కాలనీలో నివసిస్తున్న భార్గవ్ కుమార్ అనే జేబీఐటి ఫైనల్ ఇయర్ విద్యార్థి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు.ఈ ఘటనకు సంబంధించిన కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది. మరో ఘటనలో హిమాయత్‌నగర్‌కు చెందిన వేముల రాజేష్ కుటుంబ సమస్యలతో మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు.రాజేష్ తరచుగా భార్యతో గొడవపడేవాడని,15 రోజుల క్రితం భార్య తన పుట్టింటికి వెళ్లిపోవడంతో ఆయన తీవ్రంగా బాధపడ్డాడని సమాచారం.ఈ రెండు ఘటనలపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు రాజేంద్రనగర్ పోలీసులు వెల్లడించారు.

## హిందూ సమ్మేళనం ఆహ్వాన పత్రిక విడుదల..





**రాజేంద్రనగర్,ఏప్రిల్18(సూర్యరేఖ)** అత్తాపూర్ హిందూ సమ్మేళన ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఆదివారం జరగనున్న హిందూ సమ్మేళనంకు సంబంధించిన ఆహ్వాన పత్రిక విడుదల కార్యక్రమం స్థానిక శ్రీరాంబాగ్ సీతా రామచంద్ర స్వామి దేవాలయంలో జరిగింది.ఆహ్వాన పత్రికలను ముందుగా శ్రీసీతా రామచంద్రస్వామి వారి పాదాల వద్ద ఉంచి వేద మంత్రాలతో పూజ చేసిన తరువాత సమితి అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి విడుదల చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...ఇప్పటి వరకు ఇలాంటి కార్యక్రమం ఎప్పుడూ జరగలేదు కావున అందరం కలసి కులాలకు రాజకీయాలకు అతీతంగా ఈ కార్యక్రమం పెద్ద ఎత్తున విజయవంతంగా జరపాలని అందరిని కోరారు.ఈ సందర్భంగా సమితి సభ్యులు,పుర ప్రముఖులు హిందూ బంధువులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల వైపు తల్లిదండ్రుల చూపు..

గ్రామంలో విస్తృత అవగాహన కార్యక్రమం.

సర్పంచ్ కృష్ణవేణి వీరబాబు...




**కారేపల్లి,ఏప్రిల్18(సూర్యరేఖ)** మండల పరిధిలోని గుంపులగూడెం గ్రామంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని గ్రామ ప్రజలకు పిలుపునిచ్చారు.ప్రైవేటు పాఠశాలల్లో కంటే ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య,అనుభవజ్ఞులు ఉపాధ్యాయులు,ఉచిత సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని వివరించారుముఖ్యంగా మధ్యాహ్న భోజనం,పాఠ్యపుస్తకాల,యూనిఫాం, డిజిటల్ విద్య సదుపాయాలు వంటి అంశాలు విద్యార్థుల సమగ్రహ అభివృద్ధికి దోహదపడుతున్నాయని తెలిపారుఈ సందర్భంగా హెచ్ఎం శంకర్ మాట్లాడుతూ...ప్రభుత్వ పాఠశాలలో అభివృద్ధి కోసం ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తుందని,తల్లిదండ్రులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.విద్య అనేది పిల్లల భవిష్యత్ కు బలమైన పునాది.. మంచి విలువలు క్రమశిక్షణ ప్రభుత్వ పాఠశాల ద్వారా మెరుగుపడతాయని,ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించడం ద్వారా గ్రామస్థాయిలో విద్య ప్రమాణాలు మెరుగుపడతాయని, సమాజాభివృద్ధికి అది దోహదపడుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ కృష్ణవేణి వీరబాబు,పంచాయతి సెక్రటరీ సంతోష్ కుమార్,ఉపాధ్యాయులు,గ్రామ ప్రజలు ఈ అవగాహన కార్యక్రమం ద్వారా తల్లితండ్రులలో చైతన్యం పెరిగే ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని విశ్వాసం మరింత బలపడింది.

## అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలి..

కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వీసారపు శ్రీపాల్ రెడ్డి




**మరిపెడ,ఏప్రిల్18(సూర్యరేఖ)** మున్సిపాలిటీలో జరిగే అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వీసారపు శ్రీపాల్ రెడ్డి సూచించారు. శనివారం ఆయన మరిపెడ పట్టణంలోని కార్గిల్ సెంటర్ జాతీయ రహదారికి ఇరువైపుల కొనసాగుతున్న సైడ్ డ్రైనేజి పనులను పరిశీలించారు.ఈ సందర్భంగా శ్రీపాల్ రెడ్డి మాట్లాడుతూ ...వర్షాకాలం దృష్ట్యా పనులు త్వరతగతిన పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులను కోరారు.నాణ్యతలో రాజీ పడకూడదని సూచించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ టౌన్ అధ్యక్షుడు షేక్ తాజుద్దీన్,వార్డు కౌన్సిలర్ జాటోతు సురేష్,నాయకులు గంధసిరి భిక్షపతి ,అలువాల ఉపేందర్ ప్రజాపతి,కోమటి వీరన్న తదితరులు పాల్గొన్నారు.

## శివరాంపల్లి వీకర్ సెక్షన్ కాలనీలోని అంగన్వాడి కేంద్రంలో ఫ్యాన్ల పంపిణీ..




**రాజేంద్రనగర్,ఏప్రిల్18(సూర్యరేఖ)** సేవ చేయడంలోని ఆనందం మరెక్కడ దొరకదని బిజెపి రాజేంద్రనగర్ సర్కిల్ నాయకులు గుడిసె యాదయ్య అన్నారు.ఎంతకాలం బతికామన్నదీ కాదు,మనం ఏమిచేశామన్నదీ ముఖ్యమన్నారు.శుక్రవారం రాజేంద్రనగర్ సర్కిల్ శివరాంపల్లి వీకర్ సెక్షన్ కాలనీలోని అంగన్వాడీ కేంద్రంలో రెండు ఫ్యాన్లను పంపిణీ చేశారు.అంగన్వాడీ కేంద్రంలో ఫ్యాన్లు లేక చిన్నారులు ఉక్కపోతతో ఇబ్బంది పడుతున్నట్లు నేషనల్ అంబేద్కర్ సేన రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జ్ పంబాల రాజు తన దృష్టికి తేవడంతో తన వంతు సహాయంగా రెండు ఫ్యాన్లను పంపిణీ చేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ జగ్జీవన్ రామ్,డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవ కమిటీ అధ్యక్షులు దాసరి రమేష్,రాజేంద్రనగర్ అంబేద్కర్ యువజన అధ్యక్షులు గొడుగు సంజీవ,శివాజీ పొదుపు సంఘం అధ్యక్షులు శివకుమార్,అంగన్వాడి టీచర్ ఎం జ్యోతి,అంగన్వాడి సహాయకురాళ్లు సంగీత,సుశీల తదితరులు పాల్గొన్నారు.

# పేద విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్ పంపిణీ..





దాతృత్వం చాటుకున్న ఖమ్మం సాయి మారుతి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్

**మరిపెడ,ఏప్రిల్18(సూర్యరేఖ)**సామాజిక సేవలో భాగంగా పరీక్షలకు సిద్ధమవుతున్న పేద విద్యార్థులకు సహాయం చేయడం సంతోషకరమని ఖమ్మం పట్టణానికి చెందిన శ్రీసాయి మారుతి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రతినిధి విజయ్ రెడ్డి తెలిపారు.శనివారం మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండల పరిధిలోని మహాత్మ జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.తాళ్లవుకల్ గ్రామ సర్పంచ్ తప్పెట్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్.అనిత చేతుల మీదుగా 500మంది విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్స్ పంపిణీ చేశారు.అనంతరం తాళ్లవుకల్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న మరో 100మంది విద్యార్థులకు కూడా ఎగ్జామ్ ప్యాడ్స్ అందజేశారు.ఈ సందర్భంగా విజయ్ రెడ్డి మాట్లాడుతూ...ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివిన అనేక మంది విద్యార్థులు కష్టపడి ఉన్నత స్థానాలకు ఎదిగి వైద్యులుగా కొనసాగుతున్నారని పేర్కొన్నారు.ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులు కూడా పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ తప్పెట్ల శ్రీనివాస్,అడ్వకేట్ తప్పెట్ల మహేష్,ప్రిన్సిపాల్ అనిత,ఉపాధ్యాయులు, విద్యార్థులు,సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

# రామంతాపూర్ లో రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం చేసిన బిజెపి నాయకులు

రామంతపూర్ డివిజన్ బిజెపి అధ్యక్షులు వంగాల సంతోష్ గుప్త



ఉప్పల్,ఏప్రిల్18(సూర్యరేఖ) నారీ శక్తి వందన్ అధినియం(మహిళా రిజర్వేషన్ బిల్లు)అమలు సంబంధించి దేశ జనాభాలో దాదాపు 50శాతం మహిళలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించడంపై కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా రిజర్వేషన్ చట్టాన్ని అడ్డుకోవడం ద్వారా మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు నిరాకరించాయి.దీనికి కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే “నారీ శక్తిని” అవమానిస్తూ చట్టసభల్లో మహిళలకు ప్రాతినిత్యం కల్పించే చారిత్రాత్మక అడుగును కాంగ్రెస్ అడ్డుకుందని, మహిళలకు చేసిన ద్రోహం నిరాకరిస్తూ శనివారం సాయంత్రం రామంతాపూర్ మెయిన్ రోడ్ లో రామంతాపూర్ డివిజన్ అధ్యక్షులు వంగాల సంతోష్ గుప్తా ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం చేసి నిరసన తెలియజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు తాళ్ల బాలకృష్ణగౌడ్,వల్లపు జగన్ యాదవ్,వెంపటి శ్రీనివాస్,కొ ంపల్లి ఉపేందర్,ఊర నగేష్ గుప్తా, దర్శనల సుధాకర్,పలుగుల అంజయ్య పటేల్,పెరక బద్రీనాథ్,తమ్మలి రవి,భారత్ ,కల్మకల లింగం,సురేష్ శర్మ,గుండె ముఖేష్,వెంపటి రామ్ రాజ్,మహిళా నాయకురాలు బండి పద్మ ,అంబాటి భాగ్యలక్ష్మి,తాళ్ల మంగ,సువర్ణ షిండే,కొండేరు స్రవంతి,ఉమాదేవి, జలేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## ముత్యం ప్రవీణ్ కు ఘనంగా నివాళులు..

అప్పాజీపల్లి సర్పంచ్ వెంకట్ గౌడ్(గజిని)

**కొల్చారం,ఏప్రిల్18(సూర్యరేఖ)**

ఈనెల ఏడో తేదీన అనారోగ్యంతో మృతి చెందిన కొల్చారం మండల కేంద్రానికి చెందిన సీనియర్ నాయకుడు ముత్యం ప్రవీణ్ దశదినకర్మకు హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...గతంలో నర్సాపూర్ తాలూకా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు పనిచేసిన సందర్భంలో కొల్చారం మండల యువజన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా పనిచేసి రాజకీయ ఓనమాలు నేర్చుకోవడం జరిగిందన్నారు.అటువంటి అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ వారి పవిత్ర ఆత్మ శాంతి చేకూరాలని వారి చిత్రపటానికి పూలమాలవేసి శ్రద్ధాంజలి ఘటించారు.మన మధ్యన లేకున్నా ముత్యం ప్రవీణ్ కాంగ్రెస్ పార్టీకి చేసిన సేవలు ఎప్పుడు గుర్తుంటాయని,కాంగ్రెస్ పార్టీ వారి కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటదని కొల్చారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాగులగారి మల్లేశం గౌడ్ తెలపడం జరిగింది.ఈ కార్యక్రమానికి కౌడిపల్లి గ్రామ సర్పంచ్ కోదండం కృష్ణ గౌడ్,అప్పాజీపల్లి గ్రామ సర్పంచ్ నాయిని వెంకట్ గౌడ్,గజిని,మెదక్ వ్యాపారం వేత కరణ్ గుప్తా, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదకరంగా మారిన భవనం కూల్చివేయాలి..

రోడ్డు వెడల్పులో భూసేకరణ చేపట్టి ఏళ్లు గడుస్తున్న పట్టించుకోని అధికారులు..



**రాజేంద్రనగర్,ఏప్రిల్18(సూర్యరేఖ)** రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని శివరాంపల్లి పిల్లర్ నెంబర్ 290వద్ద రోడ్డు వెడల్పులో పోయిన భవనం కూల్చకపోవటంతో ప్రమాదకరంగా మారింది. జిహెచ్ఎంసి అధికారులకు ఈవిషయంలో గత కొన్ని సంవత్సరాలుగా విన్నవిస్తున్న పట్టించుకోవటం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాటేదాన్ సర్వేనెంబర్ 130,149లలో 20గుంటల భూమిని 1995లో ఇన్నర్ రింగ్ రోడ్డు నిర్మాణానికి భూసేకరణ చేపట్టి అందుకు భూయజమానికి,ఇంటి యజమానికి నష్టపరిహారం చెల్లించింది.2008లో ఫ్లైఓవర్ నిర్మాణం సమయంలో ఈ ఇంటికి నోటీసు సైతం ఇచ్చింది.ఫ్లైఓవర్ ఏర్పడిన తర్వాత ట్రాఫిక్ రద్దీ పెరిగి భవనం తొలగించకపోవడంతో ప్రమాదకరంగా మారింది.జిహెచ్ఎంసి అధికారులు ఇప్పటికైనా స్పందించి ప్రమాదకరంగా మారిన భవనం తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

## వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు చేపట్టాలి..

అడిషనల్ కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో



**మరిపెడ,ఏప్రిల్18(సూర్యరేఖ)** ప్రస్తుతం వేసవిలో రోజురోజుకు ఎండలు ముదురుతుండడంతో గ్రామాలలో తాగునీటి సమస్య తలెత్తకుండా తగిన చర్యలు చేపట్టాలని అడిషనల్ కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో అధికారులకు సూచించారు.శనివారం ఆయన మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలంలోని గుర్రప్పతండాలో పర్యటించారు.ఓహెచ్ఎస్ ఆర్ ట్యాంకును పరిశీలించారు.ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ...ట్యాంక్ యొక్కమెట్లు విరిగిపోయి ఉండడంతో మరమ్మత్తులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.వేసవి దృష్టా ప్రజలకు నీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వేణుగోపాల్ రెడ్డి,ఎంపీఓ సోమ్లాల్ నాయక్,సర్పంచ్ బానోత్ శరత్,పంచాయతీ కార్యదర్శి హారిక తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల బాధలే అజెండా.. హృదయాలను కదిలించిన
# టి.హరీష్ రావుతో రామాయంపేట నేతల భేటీ





ఆశల ఆవేదనల మధ్య భావోద్వేగా క్షణం..టి.హరీష్ రావును కలిసిన చరిత సుప్రభాతరావు

ప్రజల కోసం ఒకే మాట..అభివృద్ధి లక్ష్యం అంటూ టి. హరీష్ రావు వద్ద కదిలిన మనసులు

పట్టణ అభివృద్ధి,ప్రజల ఆశలు,నాయకత్వ బాధ్యతల మధ్య సాగిన హృదయాలను కదిలించిన భేటీ...

సిద్దిపేట ఎమ్మెల్యే,మాజీ మంత్రి టి.హరీష్ రావుతో రామాయంపేట నేతల సమావేశం భావోద్వేగానికి దారితీసింది..

**రామాయంపేట,ఏప్రిల్18(సూర్యరేఖ)** సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి టి.హరీష్ రావును రామాయం పేట పట్టణానికి చెందిన బీఆర్ఎస్ జిల్లా నాయకులు చౌదరి సుప్రభాత రావు,ఆయన కుమార్తె, 5వ వార్డు కౌన్సిలర్ చౌదరి చరితలు శనివారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో జరిగిన ఈ భేటీలో యువనాయకుడు పృథ్వీరావు కూడా పాల్గొన్నారు.సాధారణ మర్యాదపూర్వక భేటీగా ప్రారంభమైన ఈ సమావేశం, క్రమంగా ప్రజల భావోద్వేగాలను తాకిన అరుదైన సందర్భంగా మారింది.రామాయంపేట పట్టణ ప్రగతి,మెదక్ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు,గ్రామీణ-పట్టణ సమస్యలపై విస్తృతంగా చర్చ జరిగింది.ప్రతి వార్డులో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై హరీష్ రావు చూపిన శ్రద్ధ,అడిగిన ప్రశ్నలు అక్కడి నేతల హృదయాలను కదిలించాయి."ప్రజల నమ్మకం మన బలం...వారి కష్టాలు మన బాధ్యత"అంటూ ఆయన వ్యక్తం చేసిన అభిప్రాయం భేటీకి హాజరైన వారిని లోలోపల ఆలోచింపజేసింది.ప్రజల సమస్యల పరిష్కారంలో కౌన్సిలర్లు,పార్టీ నాయకులు ఎల్లప్పుడూ ముందుండాలని,పార్టీ బలోపేతం కోసం ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని ఆయన స్పష్టంగా సూచించారు. రామాయంపేట మున్సిపాలిటీ అభివృద్ధికి తన వంతు సహకారం ఎప్పటికీ ఉంటుందని హామీ ఇవ్వడం నేతల్లో కొత్త నమ్మకాన్ని నింపింది.ఈ సందర్భంగా చౌదరి సుప్రభాతరావు మాట్లాడుతూ...పట్టణంలోని అభివృద్ధి పనులు, తాజా రాజకీయ పరిస్థితులపై హరీష్ రావు ఎంతో ఆసక్తిగా ఆరా తీశారని తెలిపారు.ఈ భేటీ రాజకీయ పరిమితులను దాటి,ప్రజల పట్ల నాయకత్వం ఎంత బాధ్యతతో ఉండాలో గుర్తు చేసిన ఒక భావోద్వేగ ఘట్టంగా నిలిచింది.రామాయంపేట ప్రజల ఆశలు, అభివృద్ధి పట్ల ఉన్న నిబద్ధత,సేవాభావం ఈ సమావేశంలో ప్రతిధ్వనించింది.

## బోర గంగయ్య మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు..

కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు నూకల అభినవ్ రెడ్డి

బోర గంగయ్య కుటుంబానికి పరామర్శ



**మరిపెడ,ఏప్రిల్ 18(సూర్యరేఖ)** కాంగ్రెస్ నాయకుడు బోర గంగయ్య మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు అని కాంగ్రెస్ పార్టీ నాయకులు జిల్లా నూకల అభినవ్ రెడ్డి అన్నారు.మహబూబాద్ జిల్లా మరిపెడ మున్సిపాలిటీ పరిధిలో దేశ తండా సమీపంలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన మరిపెడ మున్సిపాలిటీ సీతరాంపురం కాలనీకి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బోర గంగయ్య కుటుంబాన్ని శనివారం నూకల అభినవ్ రెడ్డి,మాజీ సర్పంచ్ పానుగోత్ రాంలాల్,తొర్రూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బట్టు నాయక్,మెంచ్ అశోక్ గౌడ్ లు పరామర్శించారు.గంగయ్య చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.గంగయ్య ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థించారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీకి ఆయన అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు.పార్టీ అభివృద్ధికి ఆయన చేసిన కృషి అపారమని,ఆయన మరణం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటుగా మిగిలిపోతుందని పేర్కొన్నారు.బోర గంగయ్య సేవలను స్మరించుకుంటూ భావోద్వేగానికి లోనయ్యారు.వారి వెంట బొలగాని శ్రీను,గుండగాని బాబు రావు,నాయకులు, కార్యకర్తలు తదితరులు కలరు.

## డీసీఎంఎస్ ధాన్యం కనుగొలు కేంద్రం ప్రారంభించిన, కల్లూరు ఏఎంసీ చైర్మన్




**ఖమ్మం,ఏప్రిల్18(సూర్యరేఖ)** కల్లూరు మండల పరిధిలోని లింగాల గ్రామపంచాయతీలో ఏనుగు సత్యంబాబు ఆధ్వర్యంలో డీసీఎంఎస్ కొనుగోలు కేంద్రాన్ని ఏఎంసీ చైర్మన్ భాగం నీరజ ప్రభాకర్ చౌదరి ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్,దేవరపల్లి నాగమణి శ్రీను,కాంగ్రెస్ సీనియర్ నాయకులు దేవరపల్లి వెంకటేశ్వర రావు,మట్టురి రామారావు,మద్దినేని గోపయ్య దేవరపల్లి శ్రీనివాసరావు, మద్దినేని శ్రీనివాసరావు,మట్టూరి వెంకట్రావు,చావా మోహన్ రావు,మాను కొండ చంద్రం,దేవరపల్లి మంగపతి,తక్కెళ్ళపాడు దుర్గాప్రసాద్,సర్పంచ్ వేము కృష్ణ,ఉపసర్పంచ్ దేవరపల్లి వెంకటేశ్వరరావు,డిసిఎంఎస్ మేనేజర్, ఏఈఓ పవన్,రైతులు పాల్గొన్నారు

## రామాయంపేటలో గోమాత సంరక్షణపై విశ్వహిందూ పరిషత్ ఆందోళన..





గోమాతల సంరక్షణకు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ రామాయంపేటలో విశ్వహిందూ పరిషత్ కార్యకర్తలు వాల్ పోస్టర్ విడుదల చేసి, స్థానిక అధికారులకు మెమోరండం సమర్పించారు.

**రామాయంపేట,ఏప్రిల్ 18(సూర్యరేఖ)** రామాయంపేటలో గోమాతల సంరక్షణ కోసం విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా స్థానిక విశ్వహిందూ పరిషత్ కార్యాలయంలో గోమాత సంరక్షణకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. అనంతరం స్థానిక ఎస్సై మరియు తహసిల్దార్లను కలిసి గోమాతల రక్షణపై మెమోరండం సమర్పించారు.ఈ సందర్భంగా ప్రాంత సహ సత్సంగ్ ప్రముఖ్ పుట్టి మల్లేశం



మాట్లాడుతూ...1977 గోవధ నిషేధ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని కోరారు. గోమాతల అక్రమ వధ మరియు రవాణా జరుగుతున్నాయని,దీనిపై అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అలాగే గోశాల నిర్వహకులకు సరైన వసతులు కల్పించాలని,ప్రతి జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వం 100 ఎకరాల భూమిని కేటాయించి గోశాలలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.సేంద్రియ వ్యవసాయం చేస్తున్న రైతులకు సబ్సిడీలు,గోమాతల సంరక్షణ ఖర్చుల కోసం పింఛన్ సదుపాయం కల్పించాలని కూడా కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి ఎర్రం ముత్యాలు,ప్రకండ ఉపాధ్యక్షులు గబ్బుల వెంకటేశం,బల్ల సుధాకర్,బీర నరసింహులు,పట్టణ బజరంగ్ దళ్ సంయోజక్ నాంపల్లి,జిల్లా శారీర ప్రముఖ్ ప్రసాద్,సురేష్, హరి,సాయి,రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## డిలిమిటేషన్ బిల్లుకు వ్యతిరేకంగా ఎంసీపీఐయు ఆగ్రహం..

మహిళా రిజర్వేషన్ బిల్లుతో అనుసంధానం అన్యాయం--కేంద్ర విధానాలపై పోరాటానికి పిలుపు




**బెల్లంపల్లి,ఏప్రిల్18 ం(సూర్యరేఖ)** డిలిమిటేషన్ బిల్లుకు వ్యతిరేకంగా ఎంసీపీఐయు పార్టీ మంచిర్యాల జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బెల్లంపల్లి పట్టణంలో అత్యవసర సమావేశం నిర్వహించారు.131వ రాజ్యాంగ సవరణ పేరుతో సమైక్యవాదాన్ని బలహీనపరిచే ప్రయత్నాలను ఖండిస్తూ ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి సబ్బని రాజేంద్ర ప్రసాద్,జిల్లా సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మహిళా రిజర్వేషన్ బిల్లును డిలిమిటేషన్ ప్రక్రియతో అనుసంధానం చేయడం అన్యాయమని విమర్శించారు. మహిళా రిజర్వేషన్‌కు దేశవ్యాప్తంగా మద్దతు ఉన్నప్పటికీ,ఆ బిల్లును ముసుగుగా ఉపయోగించి నియోజకవర్గాల పునర్విభజన చేపట్టడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని పేర్కొన్నారు.2029 ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం తమకు అనుకూలంగా నియోజకవర్గాల సంఖ్యను మార్చుకునే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు.పార్లమెంట్‌లో ఈ విధానాలకు అడ్డుకట్ట పడినట్లు తెలిపారు. 2011జనాభా లెక్కల ఆధారంగా పార్లమెంట్ సీట్ల పెంపు చేపట్టాలని కేంద్రం చూస్తోందని,దీని వల్ల దక్షిణ భారత రాష్ట్రాలకు అన్యాయం జరిగే ప్రమాదం ఉందని అన్నారు.ముఖ్యంగా తెలంగాణకు సీట్లు తగ్గే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. 2026జనాభా లెక్కలను ఆధారంగా తీసుకుని పార్లమెంట్ సీట్ల పునర్విభజన చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.కేంద్ర విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు పెద్ద ఎత్తున పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాజేంద్రనగర్ ఆర్డీవోకు నెల జైలు,రూ.2వేలు జరిమానా..

**రాజేంద్రనగర్,ఏప్రిల్18(సూర్యరేఖ)** కోర్టు ధిక్కారానికి పాల్పడినందు కుగాను రాజేంద్రనగర్ ఆర్డీవో కొప్పుల వెంకటరెడ్డికి రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం నెల రోజుల సాధారణ జైలు శిక్ష,రూ.2వేల జరిమానా విధించింది.జరిమానా చెల్లించకపోతే మరో రెండు వారాలు జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని ఉత్తర్వులు జారీ చేసింది.అయితే..ఈ ఉత్తర్వులపై అప్పీల్ కు వీలుగా తీర్పు అమలును రెండు వారాలపాటు నిలిపివేసింది. శిక్ష అమలుకు వీలుగా రిజాస్టార్ ఎదుట లొంగిపోవాలని స్పష్టం చేసింది.ఈ ఘటనకు సంబంధించిన వివరాలు..రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం పెద్ద షాపూర్‌లోని 74.97 భూమికి సంబంధించిన వివాదంలో 2017లో అప్పిలేట్ ట్రైబ్యునల్ ఆదేశాల మేరకు విచారించిన ఆర్డీవో తీర్పు వెలువరించకపోవడంతో హైదరాబాద్,కు చెందిన నవాబ్ మహమ్మద్ యూసుఫుద్దీన్ ఖాన్ హైకోర్టులో పిటిషన్ వేశారు.దీనిపై విచారించిన హైకోర్టు 6వారాల్లో తీర్పు వెలువరించాలని గత ఏడాది ఫిబ్రవరిలో ఆర్డీవోను ఆదేశించింది. అయినప్పటికీ ఫలితం లేకపోవడంతో కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు.దీనిపై జస్టిస్ సి.వి భాస్కర్ రెడ్డి ధర్మాసనం ఇటీవల విచారణ చేపట్టింది.ఇరు పక్షాల న్యాయవాదుల వాదనలు విన్న న్యాయమూర్తి..కోర్టు నిర్ణయించిన గడువులోగా ఉత్తర్వులు జారీ చేయడంలో ఆర్డీవో విఫలమయ్యారని అభిప్రాయపడ్డారు.ఆ తర్వాత అమలు చేసినా దానిని అంగీకరించలేమని, నిర్దేశించిన సమయాన్ని పాటించపోవడం ధిక్కరణే



అని నిర్ధారిస్తూ న్యాయస్థానం ఆర్డీవో వెంకటరెడ్డికి నెల రోజుల శిక్ష,అదే విధంగా రూ.2 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.ఆర్డీవో ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేస్తూ ఈ వివాదాన్ని మరో అధికారికి కేటాయించాలంటూ కలెక్టర్,కు ఆదేశాలు జారీ చేశారు.అయితే అయితే అప్పీలుకు అవకాశం కల్పిస్తూ శిక్ష అమలును రెండు వారాలపాటు నిలిపివేసింది

# "కృషితో నాస్తి దుర్భిక్షం"

# నిత్య సేవలో కె.పి ధైర్యసాహసాల చరిత్ర..









**కల్లూరు మండల పాయపూరు గ్రామం యువకుడు కృష్ణ ప్రసాద్‌కు జాతీయ స్థాయి గౌరవం..**

**ఖమ్మం,ఏప్రిల్18(సూర్యరేఖ)** "కృషితో నాస్తి దుర్భిక్షం"అనే నానుడిని నిజం చేస్తూ కృష్ణ ప్రసాద్ తన జీవితం ద్వారా చూపించాడు. కష్టపడి పనిచేస్తే ఎలాంటి పరిస్థితులైనా అధిగమించ వచ్చని,సేవకు ఎప్పుడూ విలువ ఉంటుందని ఆయన కథ చెబుతోంది.ప్రజల ప్రాణాలను కాపాడడం ఒక వృత్తి మాత్రమే కాదు... అది ఒక బాధ్యత,ఒక అంకితభావం..ఆ బాధ్యతను నిబద్ధతతో,ధైర్యసాహసాలతో నిర్వర్తించిన వారికి సమాజం గౌరవం అందిస్తుంది.అలాంటి అరుదైన గౌరవం ఇప్పుడు ఖమ్మం జిల్లా కల్లూరు మండలం పాయపూర్ గ్రామానికి చెందిన యువ ఫైర్ సిబ్బంది గద్దె కృష్ణ ప్రసాద్‌కు దక్కింది.భారత ప్రభుత్వ హోంమంత్రిత్వశాఖ పరిధిలోని డైరెక్టరేట్ జనరల్ ఫైర్ సర్వీసెస్,సివిల్ డిఫెన్స్‌డహోం గార్డ్స్ వారు తెలంగాణ రాష్ట్ర ఫైర్,డిజాస్టర్ రెస్పాన్స్,ఎమర్జెన్సీ మరియు సివిల్ డిఫెన్స్ విభాగానికి చెందిన సిబ్బందికి"బ్రోంజ్ డిస్క్ మరియు ప్రశంసాపత్రం" పురస్కారాలను ప్రకటించారు.దేశవ్యాప్తంగా అత్యుత్తమ విధి నిర్వహణ,ధైర్యం,సేవాభావం కలిగిన సిబ్బందికి ఈ పురస్కారం ప్రత్యేకంగా ప్రదానం చేస్తారు.ఈ పురస్కారానికి తెలంగాణ నుంచి ఎంపికైన 10మంది సిబ్బందిలో కల్లూరు మండలము పాయపూరు గ్రామ వాసి కృష్ణ ప్రసాద్ తో పాటు ఖమ్మం నుండి వాగదాని రాంబాబు (ఫైర్ ఫైటర్ టెక్నికల్)ఉండటం ఖమ్మం జిల్లాకు గర్వకారణం.

**సాధారణ కుటుంబం నుంచి అసాధారణ ప్రయాణం..**

కృష్ణ ప్రసాద్ ఒక రైతు కూలి కుటుంబంలో జన్మించాడు.చిన్ననాటి నుంచే కష్టాలను చూసి పెరిగిన అతడు,జీవితంలో ఏదో సాధించాలని సంకల్పించాడు.ప్రభుత్వ పాఠశాలలోనే తన విద్యాభ్యాసాన్ని పూర్తి చేశాడు.1వ తరగతి నుంచి ఇంటర్ వరకు కల్లూరు ప్రభుత్వ హైస్కూల్, జూనియర్ కాలేజీ,డిగ్రీ ఖమ్మంలోని ఎస్ఆర్డ బీజీఎన్ఆర్ కాలేజీల్లో చదివాడు.చదువుతో పాటు కష్టపడి ఎదగాలనే తపన అతనిలో ఎప్పుడూ కనిపించేది.2011ఆగస్టులో కానిస్టేబుల్ నోటిఫికేషన్ ద్వారా ఫైర్ సర్వీసులో చేరిన కృష్ణ ప్రసాద్, అప్పటి నుంచి తన వృత్తిని కేవలం ఉద్యోగంగా కాకుండా సేవగా భావిస్తూ ముందుకు సాగుతున్నాడు.

**ప్రమాదాల్లో ప్రాణాలను పణంగా...నిరంతర సేవా దృక్పథం**

ఫైర్ సిబ్బంది అంటే ప్రమాదం ముందు అడుగు వేయాల్సినవారు.మంటలు ఎగసిపడుతున్నా, ప్రాణాలు సైతం పణంగా పెట్టి ముందుకు వెళ్లాల్సిందే. అలాంటి ఎన్నో క్లిష్ట సందర్భాల్లో కృష్ణ ప్రసాద్ తన ధైర్యాన్ని చాటుకున్నారు.2012లో మధిర కోల్డ్ స్టోరేజ్‌లో జరిగిన భారీ అగ్ని ప్రమాదం సమయంలో ఆయన విధుల్లో పాల్గొన్నారు.ఆ ఘటనలో సహచర సిబ్బంది ప్రాణాలు కోల్పోవడం ఆయనను తీవ్రంగా కలచివేసింది.అయినా వెనుకడుగు వేయకుండా సేవను కొనసాగించారు. 2013లో ముదిగొండలోని మిర్చి ఆయిల్ ఫ్యాక్టరీలో జరిగిన ప్రమాదంలో మంటలను అదుపులోకి తెచ్చే క్రమంలో ధైర్యసాహసాలు ప్రదర్శించారు. 2018లో ఖమ్మంలోని ఫర్నిచర్ షాప్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో 12 మంది సిబ్బంది,8మంది కస్టమర్లు చిక్కుకుపోయిన సమయంలో వారిని రక్షించడంలో కీలక పాత్ర పోషించారు.ఇది అతని కెరీర్‌లో అత్యంత క్లిష్టమైన ఆపరేషన్‌గా గుర్తింపు పొందింది.2022లో కల్లూరు ప్రధాన కేంద్రంలోని మెడికల్ షాప్‌లో జరిగిన భారీ అగ్ని ప్రమాదంలో కూడా ఆయన పాల్గొన్నారు. 2024లో వెలుగు మట్ల అర్బన్ పార్క్‌లో మంటలను ఆర్పడంలో చురుకుగా వ్యవహరించారు. అదే ఏడాది ఖమ్మం జిల్లాలో వచ్చిన వరదల సమయంలో ప్రజలను రక్షించేందుకు ఫైర్ సిబ్బంది చేసిన సేవల్లో ఆయన కీలకంగా నిలిచారు. 2026లో మధిర కోల్డ్ స్టోరేజ్ ప్రమాదంలో కూడా తన అనుభవాన్ని వినియోగించి కీలక పాత్ర పోషించారు.

**సేవకు గుర్తింపు...రాష్ట్రానికి గౌరవం**

కృష్ణ ప్రసాద్ లాంటి సిబ్బంది వల్లే ఫైర్ సర్వీసులకు ప్రజల్లో విశ్వాసం పెరుగుతోంది. ఆయన చేసిన సేవలను గుర్తించి ఈ జాతీయ స్థాయి పురస్కారం అందించడం అతని కృషికి న్యాయం చేసినట్లే.ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఫైర్,డిజాస్టర్ రెస్పాన్స్, ఎమర్జెన్సీ మరియు సివిల్ డిఫెన్స్ విభాగం డైరెక్టర్ జనరల్ విక్రమ్ సింగ్ మాన్,ఐపీఎస్ పురస్కార గ్రహీతలను అభినందించారు.ఈ గౌరవం సిబ్బందికి మరింత నిబద్ధతతో పని చేయడానికి,ప్రజల్లో అగ్ని భద్రతపై అవగాహన పెంచడానికి ప్రేరణగా నిలుస్తుందని పేర్కొన్నారు.

**డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్,స్టేషన్ ఫైర్ ఆఫీసర్‌ల ప్రోత్సాహం -కుటుంబ సభ్యుల ఆనందం..**

డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్, స్టేషన్ ఫైర్ ఆఫీసర్‌ల ప్రోత్సాహం,మార్గదర్శకత్వంతోనే తాను ఈ జాతీయ స్థాయి పురస్కారం అందుకున్నానని కృష్ణ ప్రసాద్ తెలిపారు.తాను సాధించిన ఈ విజయంపై ఆయన కుటుంబ సభ్యులు, గ్రామస్థులు,సహచర సిబ్బంది, స్నేహితులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.ఒక సాధారణ కుటుంబం నుంచి వచ్చిన యువకుడు తన కృషితో జాతీయ స్థాయి గౌరవం అందుకోవడం ఎంతో మంది యువతకు ప్రేరణనిస్తుందని కల్లూరు మండల వాసులు పేర్కొంటున్నారు. ప్రాణాలను కాపాడే వృత్తిలో ఉన్న ప్రతి సిబ్బంది ఒక నిజమైన హీరోనే.అలాంటి హీరోలలో ఒకరిగా నిలిచిన కృష్ణ ప్రసాద్ పేరు ఇప్పుడు రాష్ట్రం గర్వంగా చెప్పుకునే స్థాయికి ఎదిగినారు.

# సింగరేణి పరిరక్షణకు టీఎన్‌టీయూసీ

# కార్మిక బాట పెండింగ్ సమస్యల పరిష్కారంపై డిమాండ్..







**బెల్లంపల్లి,ఏప్రిల్18(సూర్యరేఖ)** సింగరేణి సంస్థ పరిరక్షణతో పాటు పెండింగ్ సమస్యల పరిష్కారం,గనులు ఓపెన్‌కాస్ట్ విభాగాల్లో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం టీఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో కార్మిక బాట కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ...సింగరేణిలో ప్రైవేటీకరణ, కాంట్రాక్టీకరణ విధానాలను వ్యతిరేకిస్తూ పోరాటాలు మరింత ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు.కార్మికులకు సంబంధించిన అనేక సమస్యలను ఈ సందర్భంగా ప్రస్తావించారు. సొంత ఇంటి పథకం అమలు, పెర్క్విజిట్లపై పన్ను మినహాయింపు,మారుపేర్ల మార్పిడి,నూతన గనుల ప్రారంభం,వైద్య మండలి నిర్వహణ వంటి అంశాలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. కాంట్రాక్ట్ కార్మికులను శాశ్వతీకరించి సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు.రిటైర్డ్ కార్మికులకు పెన్షన్ పెంపు, పెరిగిన ధరలకు అనుగుణంగా భత్యాలు ఇవ్వాలని కోరారు.సీపీఎంఆర్ఎస్ పరిధిలో అధికారులకు ఇచ్చినట్లే కార్మికులకు కూడా 25లక్షల ప్రయోజనం ఇవ్వాలని అన్నారు.అలాగే 10వ వేతన బోర్డులో గ్రాట్యూటీ పరిమితిని తొలగించి,అధికారులకు ఇచ్చిన విధంగా 20లక్షల గ్రాట్యూటీ రిటైర్డ్ కార్మికులకు కూడా ఇవ్వాలని కోరారు. 11వ వేతన ఒప్పందం గడువు ముగియనున్న నేపథ్యంలో 12వ వేతన ఒప్పందాన్ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.కార్మికుడు పదవీ విరమణ చేసిన రోజునే అతనికి రావలసిన అన్ని ప్రయోజనాలు చెల్లించాలని పేర్కొన్నారు. కార్మిక బాటలో భాగంగా కైరిగూడ ఓపెన్‌కాస్ట్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు.క్యాంటీన్‌లో గ్యాస్ కొరత కారణంగా కట్టెల పొయ్యిలపై వంట చేయడం జరుగుతోందని,దీని వల్ల అగ్ని ప్రమాదాలు సంభవించే ప్రమాదం ఉందని తెలిపారు.వెంటనే గ్యాస్ సరఫరా సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఓపెన్‌కాస్ట్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని,కోల్ ఇండియాలో అమలులో ఉన్న మొదటి కేటగిరి వేతనాన్ని సింగరేణిలో కూడా అమలు చేయాలని కోరారు.పర్మనెంట్ కార్మికులతో సమానంగా పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు అన్ని సదుపాయాలు కల్పించి,వేతన స్లిప్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.లేదంటే బెల్లంపల్లి ప్రాంత జీఎం కార్యాలయం ముందు ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌టీ యూసీ ప్రధాన కార్యదర్శి టి.మణిరామ్ సింగ్,కార్యదర్శి చంద్రమౌళి,డి. అంజన్న, కాంట్రాక్ట్ కార్మిక సంఘ నాయకులు గజ్జ దుర్గయ్య,గైన తిరుపతి,బోనగిరి కుమార్, శ్రీనివాస్, ఎండి అన్వర్,దుర్గం సోమయ్య, కొమురయ్య,ఎన్. ఓదేలు తదితరులు పాల్గొన్నారు.

## రాజేంద్రనగర్ ఆర్డీవోకు నెల జైలు,రూ.2వేలు జరిమానా..

**తీర్పు వెలువరించిన హైకోర్టు**



**రాజేంద్రనగర్,ఏప్రిల్18(సూర్యరేఖ)** కోర్టు ధిక్కారానికి పాల్పడినందుకుగాను రాజేంద్రనగర్ ఆర్డీవో కొప్పుల వెంకటరెడ్డికి రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం నెల రోజుల సాధారణ జైలు శిక్ష,రూ.2వేల జరిమానా విధించింది.జరిమానా చెల్లించకపోతే మరో రెండు వారాలు జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని ఉత్తర్వులు జారీ చేసింది.అయితే..ఈ ఉత్తర్వులపై అప్పీల్ కు వీలుగా తీర్పు అమలును రెండు వారాలపాటు నిలిపివేసింది. శిక్ష అమలుకు వీలుగా రిజాస్ట్రార్ ఎదుట లొంగిపోవాలని స్పష్టం చేసింది.ఈ ఘటనకు సంబంధించిన వివరాలు..రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం పెద్ద షాపూర్‌లోని 74.97 భూమికి సంబంధించిన వివాదంలో 2017లో అప్పిలేట్ ట్రైబ్యునల్ ఆదేశాల మేరకు విచారించిన ఆర్డీవో తీర్పు వెలువరించకపోవడంతో హైదరాబాద్,కు చెందిన నవాబ్ మహమ్మద్ యూసుఫుద్దీన్ ఖాన్ హైకోర్టులో పిటిషన్ వేశారు.దీనిపై విచారించిన హైకోర్టు 6వారాల్లో తీర్పు వెలువరించాలని గత ఏడాది ఫిబ్రవరిలో ఆర్డీవోను ఆదేశించింది. అయినప్పటికీ ఫలితం లేకపోవడంతో కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు.దీనిపై జస్టిస్ సి.వి భాస్కర్ రెడ్డి ధర్మాసనం ఇటీవల విచారణ చేపట్టింది.ఇరు పక్షాల న్యాయవాదుల వాదనలు విన్న న్యాయమూర్తి..కోర్టు నిర్ణయించిన గడువులోగా ఉత్తర్వులు జారీ చేయడంలో ఆర్డీవో విఫలమయ్యారని అభిప్రాయపడ్డారు.ఆ తర్వాత అమలు చేసినా దానిని అంగీకరించలేమని, నిర్దేశించిన సమయాన్ని పాటించపోవడం ధిక్కరణే అని నిర్ధారిస్తూ న్యాయస్థానం ఆర్డీవో వెంకటరెడ్డికి నెల రోజుల శిక్ష,అదే విధంగా రూ.2 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.ఆర్డీవో ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేస్తూ ఈ వివాదాన్ని మరో అధికారికి కేటాయించాలంటూ కలెక్టర్,కు ఆదేశాలు జారీ చేశారు.అయితే అయితే అప్పీలుకు అవకాశం కల్పిస్తూ శిక్ష అమలును రెండు వారాలపాటు నిలిపివేసింది

## బీజేపీ--బీఆర్ఎస్ కుట్రపూరిత రాజకీయాలను ఖండించిన యూత్ కాంగ్రెస్ నాయకుడు



**మందమర్రి,ఏప్రిల్18, (సూర్యరేఖ)** బీజేపీ,బీఆర్ఎస్ పార్టీలపై మందమర్రి పట్టణ యూత్ కాంగ్రెస్ నాయకుడు చిప్పకుర్తి శశిధర్ తీవ్ర విమర్శలు చేశారు.కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ సమావేశాల్లో ప్రవేశపెట్టిన 33శాతం మహిళల రిజర్వేషన్ బిల్లును అడ్డుపెట్టుకుని డెలిమిటేషన్ బిల్లును కూడా తీసుకురావడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ఆయన అభిప్రాయపడ్డారు.మహిళల హక్కుల పేరుతో డెలిమిటేషన్ అంశాన్ని ముందుకు తెచ్చి దక్షిణాది రాష్ట్రాల ప్రజలను మోసం చేయడం అన్యాయమని శశిధర్ పేర్కొన్నారు.తెలంగాణ రాష్ట్రాన్ని కించపరిచే విధంగా బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య పార్లమెంట్‌లో చేసిన వ్యాఖ్యలను బీఆర్ఎస్ నాయకులు ఖండించకపోవడం సిగ్గుచేటని విమర్శించారు.కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని బీఆర్ఎస్ పార్టీలు రెండూ ఒకే విధమైన రాజకీయాలు చేస్తున్నాయని ప్రజలు గమనించాలని ఆయన సూచించారు.ఈ రెండు పార్టీల కుట్రపూరిత రాజకీయాలను తీవ్రంగా ఖండిస్తున్నామని స్పష్టం చేశారు.అలాగే తెలంగాణ ప్రజలకు బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.ఈ విషయంలో తెలంగాణ బీజేపీ ఎంపీలు స్పందించకపోవడాన్ని కూడా ఆయన ఎద్దేవా చేశారు.ఇక రాష్ట్రంలోని బీఆర్ఎస్ నాయకులు కూడా ఈ అంశంపై స్పందించకపోవడం హాస్యాస్పదమని అన్నారు.ప్రజలను అయోమయం లోకి నెట్టే రాజకీయాలకు బదులుగా ప్రజా సంక్షేమం కోసం పని చేసే ప్రభుత్వాన్ని ఆదరించాలని తెలంగాణ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## అత్యవసర వాహనాల ఆకస్మిక తనిఖీ..



**మరిపెడ,ఏప్రిల్18(సూర్యరేఖ)** మరిపెడ మండల కేంద్రంలోని108అత్యవసర వాహనాలను శనివారం మహబూబాబాద్ జిల్లా మేనేజర్ బత్తిని మహేష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన వాహనాల్లోని వైద్య పరికరాలను,వాటి పనితీరును పరిశీలించారు.ప్రజలకు అందిస్తున్న సేవల వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్యంను అందించాలని సూచించారు.వేసవి నేపద్యంలో తగు జాగ్రత్తలు పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని అన్నారు.అనంతరం వాహనానికి సంబంధించిన పలు రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి ప్రమాద బాధితులు, అనారోగ్య పీడితులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు.ఈ కార్యక్రమంలో 108ఈఎంటి అనుముల రమణ, పైలెట్ బి. రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్ వెలుగుగుట్ట దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ చైర్మన్
# గొరిగే పెద్ద మల్లేష్ కురుమ ప్రమాణస్వీకారం..







**ఉప్పల్,ఏప్రిల్18(సూర్యరేఖ)** వెలుగు గుట్టలో వెలిసిన శ్రీమల్లికార్జునస్వామి దేవాలయంలో దేవదాయ ధర్మాదాయశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ చైర్మన్,సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు శనివారం. ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ప్రముఖ సంఘ సేవకులు గొరిగే పెద్ద మల్లేష్ కురుమ చైర్మన్ గా ప్రమాణ చేశారు.దేవాలయంలో ప్రమాణం చేసి అధికారికంగా బాధ్యతలు చార్జ్ తీసుకున్నారు . ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఉప్పల్ కాంగ్రెస్ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రమాణ స్వీకారంలో మాట్లాడుతూ...దేవాలయ అభివృద్ధికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు.దేవదాయశాఖ ఇన్స్పెక్టర్ ప్రణీత్ దేవాలయ కార్య నిర్వహణ అధికారి శ్రీకాంత్ దేవాలయం ఫౌండర్ ట్రస్టీ గొరిగే మల్లేష్ హైకోర్టు అడ్వకేట్,దేవాలయం మాజీ చైర్మన్ జన్ని రఘు,రేవు కృష్ణ,సాగ రవి,ఉప్పల్ కురుమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ బర్ల కృష్ణ కురుమ,బట్కిరి ధన్ సాగర్,గోరిగే ఐలయ్య,మోటే నర్సింహ, రామంతపూర్ మల్లికార్జున స్వామిదేవాలయం చైర్మన్ శాగ శ్రీధర్,కంది ఆదిరెడ్డి,సుధాకర్ రెడ్డి,శ్రవణ్ కుమార్ రెడ్డి హాము నాయక్,బట్కిరి బీరప్ప కురుమ,మహిళ అధ్యక్షురాలు బండారు మంజుల బట్కిరి మంజుల కేమిడి ఇందిరా,సెల్వజి కర్రే శ్రీనివాస్ కురుమ,సాగ పెంటయ్య,బండ లక్ష్మయ్యరావుల బీరప్ప ,రావుల జంగయ్య,గొరిగే మహేష్ గోరిగె నరసింహ,కౌశిక సత్యనారాయణ,నర్రి మహేందర్,కంకల ఎలేందర్ తదితరులు పాల్గొనగా దేవస్థానం నూతన కమిటీ డైరెక్టర్లుగా తేజావత్ రాజు నాయక్,మారం దిలీప్ కుమార్,చెన్ రెడ్డి కృష్ణారెడ్డి,రోడ్ల శ్రీకాంత్ రెడ్డి,గుండు రాజు,జ్యోతి నాయక్ ప్రమాణ స్వీకారం చేయగా,ఆలయ పూజారి కొండూరు రమేష్ శర్మ పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరం : పరమేశ్వర్ రెడ్డి



**ఉప్పల్,ఏప్రిల్18 (సూర్యరేఖ)** మల్లాపూర్ డివిజన్ పరిధిలోని భవానినగర్ సంబంధించిన కుంట్ల సుశీల,ఎస్వినగర్ సంబంధించిన సంగీత,కాప్రా డివిజన్ పరిధిలోనీ ఇంద్రనగర్ కి సంబంధించిన నేహ అనారోగ్య సమస్యతో నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స చేపించాలని కాప్రా,మల్లాపూర్ డివిజన్ అధ్యక్షులు కొబ్బరి నాగ శేషు,కప్పర సాయిగౌడ్, నెమలి అనిల్ కుమార్ తెలియజేయడంతో అత్యవసర చికిత్స నిమిత్తం సీఎం సహాయ నిధి పథకం కింద ఎల్ ఓ సి ద్వారా కుంట్ల సుశీల రూ. 2,50,000/లు,నేహ రూ. 1,75,000/లు, సంగీత రూ. 2,50,000/లు, రూపాయలు మంజూరు చేయించి శనివారం ఎల్ఓసి పత్రాలని వారి కుటుంబ సభ్యులకు ఉప్పల్ నియోజకవర్గం ఇంచార్జి పరమేశ్వర్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ...ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరంగా మారిందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు సరితెగతిన చెక్కులు వచ్చేలా తన వంతు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బజార్ జగన్నాథ గౌడ్, కొబ్బరి నాగరాజు,ఎస్వి కిట్టు,దండల మురళి, శ్రీకాంత్ రెడ్డి,మల్లారెడ్డి,బాబురావు,జ్యోతి,జగదీశ్, టిల్ ముదిరాజ్,బాలరాజు,ఉపేంద్రరెడ్డి,టీలు, జయంత్,ఫిరోజ్,రాంపల్లి సాయి,తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆదేశాలమేరకు కాలనీలో పర్యటించిన
# బిఆర్ఎస్ నాయకులు గంధం నాగేశ్వరావు





**ఉప్పల్,ఏప్రిల్18(సూర్యరేఖ)** రామంతాపూర్ డివిజన్,ప్రగతినగర్ కాలనీలో డ్రైనేజీ సమస్య పరిస్కారానికి,గత మూడు రోజుల క్రితం ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పర్యటనలో భాగంగా ఎమ్మెల్యే ఆదేశాలమేరకు బిఆర్ఎస్ సీనియర్ నాయకులు గంధం నాగేశ్వరావు ఆధ్వర్యంలో శనివారం ప్రగతినగర్ లో జలమండలి డీజీఎం సుప్రజ, ఏఈ.రవీందర్ పలువురు కాలనీ నేతలతో కలిసి పనులకు సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఈ సందర్భంగా గంధం నాగేశ్వరరావు మాట్లాడుతూ.... ప్రగతినగర్ కాలనీకి అవుట్ లెట్ లేకపోవడం మూలంగా డ్రైనేజీ సమస్యలు తలెత్తుతున్నాయని సమస్య పూర్తిగా పరిష్కారం కావడానికి ఎమ్మెల్యే అధికారులకు అవసరమైన ఆదేశాలు ఇచ్చారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ ముఖ్య సలహాదారులు వెంకట్ రెడ్డి,ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్ రెడ్డి,బిఆర్ఎస్ నాయకులు శ్రీకాంత్ గౌడ్,మనీష్,రవి,వినోద్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### బీరప్పగడ్డలో రూ.40 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను పర్యవేక్షించిన
బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్





**ఉప్పల్,ఏప్రిల్18 (సూర్యరేఖ)** బీరప్పగడ్డ ఏఆర్ కె రెసిడెన్సీ నుండి వంజరి నర్సింగరావు ఇంటి వరకు శంకరయ్య కిరాణా దుకాణం వరకు సుమారు రూ. 40లక్షలతో నిర్మిస్తున్న సిసి రోడ్డు పనులను శనివారం బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ అధికారులతో కలిసి పర్యవేక్షించారు. బస్తీ వాసులతో కలిసి కాంట్రాక్టర్ ని పిలిపించి పనులను మొదలు పెట్టించారు. అనంతరం రోడ్డు వెడల్పుని 4.5 మీటర్స్ తగ్గకుండా చూడాలని కాంట్రాక్టర్ కి ఆదేశించడం జరిగింది. రోడ్డు నిర్మాణ సమయంలో బస్తీ వాసులకు ఇబ్బంది కలగకుండా త్వరత గతిన రోడ్డు పనులు పూర్తి చేయాలని బస్తీ వాసులకు కూడా కాంట్రాక్టర్ కి రోడ్డు నిర్మాణ సమయంలో సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కొక్కొండ జగన్,వంజరి నర్సింగ్ రావు,శ్రీనివాస్ యాదవ్,పండ్ల కిషన్ తిరుపతి యాదవ,గొరిగి ఐలేష్,బంటి గౌడ్, బస్తీ పెద్దలు బుచ్చిరెడ్డి,సల్ల రాజిరెడ్డి, సత్యనారాయణ,శంకరయ్య,తదితరులు పాల్గొన్నారు.

### బస్తీ బాటలో దూసుకెళ్తున్న మహమ్మద్ రఫీక్, ప్రజల మధ్యకు...సమస్యలపై సూటిగా స్పందించిన మహమ్మద్ రఫీక్





**ఉప్పల్,ఏప్రిల్ 18(సూర్యరేఖ)** బస్తీ బాట కార్యక్రమంలో భాగంగా రామంతపూర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు మహమ్మద్ రఫీక్ శనివారం రామంతాపూర్ నెహ్రు నగర్ విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను స్వయంగా తెలుసుకున్నారు. కాలనీలో దారుణ స్థితిలో ఉన్న రోడ్లు,అండర్ గ్రౌండ్ మంచినీటి ఇబ్బందులు, విద్యుత్ స్తంభాల సమస్యలు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమస్యల పై వెంటనే స్పందించిన రఫీక్ సంబంధిత అధికారులతో మాట్లాడి, ఉప్పల్ ఇంచార్జ్ మందముల పరమేశ్వర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి శాశ్వత పరిష్కారం చూపిస్తామని హామీ ఇచ్చారు "ప్రజల సమస్యల పరిష్కారం మా మొదటి ప్రాధాన్యం" అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గంగపుత్ర భాస్కర్, మొగిలి లింగం, లఘుసాని శ్రీనివాస్ గౌడ్, నరసింహ గాయత్రి గౌడ్,వరలక్ష్మి,కేబుల్ అశోక్,ఎండీ షకీల్, ఎండీ నయీమ్,రాజ్ కుమార్, మహేష్,వెంకట్, చోటు బాయ్ సూర్యఐకాన్,స్వామి మధు,సాయి, ఎండీ సిద్దక్,ముత్యాల రవి తదితరులు పాల్గొన్నారు

# ఉపాధి హామీ రక్షణకై జిల్లావ్యాప్తంగా ఆందోళనలు..

**మంచిర్యాల,ఏప్రిల్18(సూర్యరేఖ)** ఉపాధి హామీ చట్టాన్ని రక్షించాలనే డిమాండ్‌తో మంచిర్యాల జిల్లాలో కార్మిక సంఘాలు ఆందోళనలు చేపట్టాయి. పెండింగ్‌లో ఉన్న వేతనాలు,కూలీలకు రావాల్సిన కూలీ డబ్బులు వెంటనే చెల్లించాలని,పని స్థలాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో జిల్లా కేంద్రంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో శనివారం కరపత్రాన్ని విడుదల చేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు ముడిమడుగుల బ్రహ్మయ్య, కార్యదర్శి కనికరం అశోక్,లు మాట్లాడుతూ... పేదల దీర్ఘకాల పోరాటాల ఫలితంగా వచ్చిన ఉపాధి హామీ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం బలహీనపరిచేందుకు



ప్రయత్నిస్తున్నదని ఆరోపించారు. చట్టానికి తగిన నిధులు కేటాయించకుండా కోతలు విధించడం ద్వారా పేదల జీవనోపాధిపై తీవ్ర ప్రభావం పడుతోందని తెలిపారు. మరోవైపు చట్టాన్ని పూర్తిగా రద్దు చేయాలనే కుట్రలు జరుగుతున్నాయని విమర్శించారు. గత నాలుగు నెలలుగా ఏపీఓ,టీఏ, ఎఫ్ఏ,కార్యాలయ సిబ్బందికి వేతనాలు చెల్లించకపోవడం,కూలీలకు కూడా కూలి డబ్బులు ఇవ్వకపోవడం తీవ్ర అన్యాయమని పేర్కొన్నారు. సుమారు రూ. 200 కోట్ల బకాయిలు ఉన్నప్పటికీ ప్రభుత్వం వాటిని విడుదల చేయడంలో నిర్లక్ష్యం వహిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎండల్లో పని చేస్తున్న కార్మికులకు తాగునీరు,నీడ వంటి కనీస సౌకర్యాలు కూడా కల్పించకపోవడం బాధాకరమని తెలిపారు. రెండు ఫొటోల విధానం కారణంగా కూలీలు నష్టపోతున్నారని,వెంటనే ఆ విధానాన్ని పునఃపరిశీలించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సంకె రవి,రజక సంఘం జిల్లా కార్యదర్శి పాయిరాల రాములు, నాయకులు బోండ్ల సరిత,బోయిరే రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

## మినీ గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం..

ప్రాంతీయ సమన్వయ పి.రత్నకుమారి



తెలంగాణ గిరిజన మినీ గురుకులంలో (బాలికల) మరిపెడ మండలం మరియు కొత్తగూడ,గంగారం ఉమ్మడి మండలం గోవిందాపూర్ పరిధి ప్రాంతం వారికి 2026-27విద్యా సంవత్సరమునకు 1వ తరగతి (ఆంగ్ల మాధ్యమం)ప్రవేశాలకు 6 సంవత్సరాల వయస్సు కలిగిన బాలికలకు 1వ తరగతికి ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మహబూబాబాద్ ప్రాంతీయ సమన్వయ పి.రత్నకుమారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మరిపెడ మినీ గురుకులం 1వ తరగతిలో 30సీట్లు,మరియు బ్యాక్ లాగ్ వేకెన్సీలు 2వ తరగతిలో 04సీట్లు,5వ తరగతిలో 05 సీట్లు,కలవని,గోవిందాపూర్ మినీ గురుకులంలో ఒకటవ తరగతిలో 30సీట్లు,మరియు బ్యాక్ లాగ్ వేకెన్సీలు 5వతరగతిలో 20సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. మినీ గురుకులం ఉన్న మండలంలో వాళ్లకు మొదటి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. సీట్ల ఎంపిక విధానం పిఓఐటిడిఏ ఎటురునాగారం సమక్షంలో లాటరీ తీయబడునని ఎంపికైన విద్యార్థులకు ఉచిత భోజనం వసతి,నోటు పుస్తకాలు,బెడ్ షీట్స్ దుస్తులు,పాఠ్యపుస్తకాలు తదితర అన్ని రకాలైన సౌకర్యాలు కల్పించబడునని తెలిపారు. తేది 19వ తేదీ నుండి మే 05 లోపు మండల,ఇతర మండలాలకు చెందిన వారు నేరుగా మినీ గురుకులంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు హెచ్ఎం మినీ గురుకులంను నేరుగా సంప్రదించగలరని అన్నారు

# రామంతపూర్ ప్రభుత్వ పాఠశాలను సందర్శించిన మందముల పరమేశ్వర్ రెడ్డి






**ఉప్పల్,ఏప్రిల్18(సూర్యరేఖ)** ప్రజావాణి స్వచ్ఛంద సంస్థ విజ్ఞప్తి మేరకు ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మందముల పరమేశ్వర్ రెడ్డి రామంతపూర్ లోని జడ్పీహెచ్ఎస్ మండల ప్రాథమిక పాఠశాలను శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా హైస్కూల్ ప్రిన్సిపల్, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం,ప్రజావాణి స్వచ్ఛంద సంస్థ బృందం వారికి ఘనంగా స్వాగతం పలికి శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలను సందర్శించిన పరమేశ్వర్ రెడ్డికి ఆ స్కూల్ నందు ఉన్న సమస్యలను వారు దృష్టికి తీసుకువచ్చారు. పరమేశ్వర్ రెడ్డి ఆసమస్యలను గుర్తించి వెంటనే స్పందించారు. తక్కువ సమయంలో సమస్యలను పరిష్కరిస్తామని వారు హామీ ఇచ్చారు. త్రాగునీటి సమస్య, ఉపాధ్యాయుల కొరత, వంటగది,తరగతి గదులు,వాష్ రూమ్స్ సమస్య, వర్షపు నీటి సమస్య,మరియు ఫ్లోరింగ్ సమస్యలతో బాధపడుతున్న విద్యార్థులకు సమస్యను వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజావాణి స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు ఎర్రం శ్రీనివాస్,విజయ్ కుమార్,తెడ్డు రవీందర్,సిద్ధ గొని రాజుగౌడ్,గోలి కృష్ణయ్య,జిల్లా కిరణ్ కుమార్, అణువుల కిరణ్,కుమార్,పొనుకోటి రమేష్,డాన్ బిక్షపతి,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎండితోఫీక్,రామంతపూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎండి రఫీక్,వర్కింగ్ ప్రెసిడెంట్ వల్లపు శ్రీకాంత్ యాదవ్, పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ మహిళా వ్యతిరేకి..

మహిళా బిల్లును అడ్డుకోవడం దురదృష్టకరం..

రామయంపేటలో రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దగ్ధం..



**రామాయంపేట,ఏప్రిల్18(సూర్యరేఖ)** కాంగ్రెస్ పార్టీ మహిళల వ్యతిరేక పార్టీ అని ప్రజలకు అర్థం అయిందని బిజెపి నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్లమెంట్లో మహిళా బిల్లును కాంగ్రెస్ పార్టీ అడ్డుకోవడానికి నిరసిస్తూ శనివారం రామాయంపేట పట్టణ కేంద్రంలో రాస్తారోకో చేసి రాహుల్ గాంధీ యొక్క దిష్టిబొమ్మను దగ్ధం చేయడం జరిగింది. ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాగి రాములు మాట్లాడుతూ...మహిళలకు ఎంతో ప్రాధాన్యత ఇచ్చి రాజకీయంగా మహిళలు మరింత ఎదగడానికి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళా బిల్లును వ్యతిరేకించడం దురదృష్టకరమన్నారు. కాంగ్రెస్ పార్టీ వైఖరి యావత్ దేశ మహిళలు చూస్తున్నారని,మహిళల ఆగ్రహానికి కాంగ్రెస్ పార్టీ తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో యువ మోర్చా పట్టణ అధ్యక్షులు కన్నయ్య,మాజీ పట్టణ అధ్యక్షులు భాను,రామాయంపేట మాజీ అధ్యక్షుడు దయానంద రెడ్డి,పట్టణ ప్రధాన కార్యదర్శి అనిల్,భూత అధ్యక్షులు నాగరాజు,సంతోష్,అనిల్ మరియు మండల ఉపాధ్యక్షుడు శ్యామలాచారిపేట పట్టణ నాయకులు యాదగిరి యాదవ్,సీనియర్ నాయకులు దామోదర్ రావు,తదితరులు పాల్గొన్నారు.

# మోడీ జీ కోహటావో..కిసానో కో బచావో నినాదాలతో కిసాన్ న్యాయ్ సత్యాగ్రహ దీక్ష..

**సంఘీభావం తెలిపిన మహబూబాబాద్ జిల్లా యువజన కాంగ్రెస్**




**మరిపెడ,ఏప్రిల్18(సూర్యరేఖ)** మహబూబాబాద్ జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు అజ్మీర సురేష్ ఆధ్వర్యంలో కార్వాన్ నియోజకవర్గంలోని భాపు ఘాట్ వద్ద గత 10 రోజులుగా కొనసాగుతున్న కిసాన్ న్యాయ్ సత్యాగ్రహ దీక్ష కార్యక్రమంలో పలువురు ప్రముఖ నాయకులు పాల్గొని రైతులకు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్,యువజన కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు ఉదయ్ భాను ఛిబ్,రాష్ట్ర ఇంచార్జ్ కె.ఆర్ భవ్య,రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి,రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులు జక్కిడి శివచరణ్ రెడ్డి పాల్గొని దీక్షకు మద్దతు ప్రకటించారు. అలాగే రాష్ట్ర సెక్రటరీ మరియు మహబూబాబాద్ జిల్లా ఇన్‌చార్జ్ భూక్యవెంకటేష్, మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు అజ్మీర సురేష్ నాయక్,జిల్లా ఉపాధ్యక్షులు జరుపుల విజయ్ నాయక్,దంతాలపల్లి మండల అధ్యక్షులు సంపెట సురేష్ గౌడ్,మరిపెడ మండల అధ్యక్షులు బానోత్ నరేష్ నాయక్,నియోజకవర్గ సోషల్ మీడియా కోఆర్డినేటర్ కొర్ని అనిల్,నర్సింహులపేట మండల ఉపాధ్యక్షులు ఓరుగంటి శ్రీకాంత్ రజక, కురవి మండల ఉపాధ్యక్షులు శ్రీధర్ గౌడ్, యువజన నాయకుడు అఖిల్,తదితరులు పాల్గొన్నారు

## లింగాలలో డిసిసిబి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించిన ఏఎంసి చైర్మన్





**ఖమ్మం,ఏప్రిల్18(సూర్యరేఖ)** కల్లూరు మండల పరిధిలోని లింగాల గ్రామపంచాయతీలో చెన్నూరు సొసైటీ సీఈఓ మోరుగు వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రం ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని మార్కెట్ కమిటీ డైరెక్టర్,దేవరపల్లి నాగమణి, శ్రీనివాస్, గ్రామసర్పంచ్ వేము కృష్ణ,ఉపసర్పంచ్ దేవరపల్లి వెంకటేశ్వరరావు, తక్కెళ్ళపాటి దుర్గాప్రసాద్,దేవరపల్లి భాస్కరరావు,మద్దినేని శ్రీనివాసరావు, మద్దినేని లోకేశ్వరరావు,మద్దినేని గోపాల్ రావు,ఏపూరి సాంబశివరావు, దేవరపల్లి వెంకటేశ్వరరావు,దేవరపల్లి శ్రీనివాసరావు,బీరవల్లి దిద్దాలు,ఏనుగు సత్యంబాబు సొసైటీ సిబ్బంది, రైతులు,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## పిల్లల ఆరోగ్యం కోసం పోషణ్ పక్వాడ.. అంగన్వాడీలో ప్రత్యేక చర్యలు..



**కారేపల్లి,ఏప్రిల్ 18(సూర్యరేఖ)** కారేపల్లి మండలం,వెంకట్యాతండా పంచాయతీ పరిధిలోని అంగన్‌వాడి కేంద్రంలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో శనివారం పోషణ్ పక్వాడ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు అక్షరాభ్యాసం,గర్భిణీ స్త్రీలకు శ్రీమంతం వేడుకలను అంగన్వాడీ టీచర్ల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్వైజర్ రాధమ్మ మాట్లాడుతూ...పిల్లలు, మహిళల ఆరోగ్యానికి సరైన పోషకాహారం ఎంత ముఖ్యమో వివరించారు. సమతుల్య ఆహారం,తగిన పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలు తీసుకోవడం ద్వారా అనారోగ్య సమస్యలను నివారించవచ్చని తెలిపారు. చిన్నారుల శారీరక, మానసిక అభివృద్ధికి పాలు,గుడ్లు,కూరగాయలు, పండ్లు వంటి పోషకాహారం అవసరమని సూచించారు. పోషణ్ పక్వాడలో భాగంగా గ్రామస్థులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు, ప్రదర్శనలు నిర్వహించడం జరిగిందన్నారు. అంగన్‌వాడి కేంద్రంలో పిల్లలకు పోషకాహారం అందిస్తూ,ఆరోగ్య పరీక్షలు కూడా చేపట్టారని తెలిపారు. ఈ కార్యక్రమాల ద్వారా గ్రామాల్లో పోషకాహారంపై చైతన్యం పెరుగుతోందని తెలిపారు. సమగ్ర పోషణ లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన ఈ పోషణ్ పక్వాడ కార్యక్రమాలు ప్రజల్లో మంచి స్పందన లభిస్తుందన్నారు. పిల్లల ఆరోగ్యం మెరుగుపడేందుకు అంగన్‌వాడి కేంద్రాల ద్వారా మరిన్ని ప్రత్యేక చర్యలు చేపడతామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వైద్యురాలు హిమబిందు, అంగన్‌వాడి టీచర్లు జర్పుల శాంతి,బానోత్ కుమారి, గుగులోత్ సుజాత,ఏఎన్ఎం విజయలక్ష్మి,ఆశా కార్యకర్త రాధా,మహిళలు జనయిత్రి,నిరోషా,రమ్య, స్వాతి,లావణ్య,అరుణ,పిల్లలు పాల్గొన్నారు.

## దాహంతో విల విలలాడిన వారికి జీవజలం..
# కెసిఆర్ కాలనీవాసుల మానవత్వం మెరిసింది..




**చందాలతో చలివేంద్రాలు..కాలనీ వాసుల చేతుల్లో మానవత్వానికి చిరునామా..**

**వేసవి వేడికి వణికిపోతున్న ప్రయాణికుల దాహాన్ని తీర్చేందుకు ముందుకొచ్చిన కాలనీవాసులు...**

**చందాలు వేసుకుని చలివేంద్రాలు ఏర్పాటు చేసి మానవత్వాన్ని చాటిన కేసిఆర్ కాలనీ ప్రజలు.**

**రామాయంపేట,ఏప్రిల్18(సూర్యరేఖ)** వేసవి తాపం తీవ్రత పెరుగుతున్న వేళ,దాహంతో అలమటిస్తున్న ప్రయాణికుల కోసం రామాయంపేట కేసిఆర్ కాలనీవాసులు హృదయాన్ని హత్తుకునే సేవా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.శనివారం కాలనీలోని కేసిఆర్ కమాను వద్ద,అలాగే సంపు ప్రాంతంలో రెండు చలివేంద్రాలను స్థానికులే చందాలు సమీకరించి ప్రారంభించారు.

జాతీయ రహదారి పక్కన ఉన్న ఈ కాలనీలో ప్రతిరోజూ వందలాది లారీ డ్రైవర్లు,ప్రయాణికులు చెట్ల నీడలో వాహనాలను ఆపి తాగునీటి కోసం తంటాలు పడుతున్న దృశ్యాలు కాలనీవాసులను కలచివేశాయి.దాహంతో ఇబ్బందులు పడుతున్న వారిని చూసి స్పందించిన స్థానికులు ఆలస్యం చేయకుండా ముందుకొచ్చారు.కొందరు చందాలు వేసుకుని మట్టి కుండలు,తాగునీటి సదుపాయాలను ఏర్పాటు చేసి చలివేంద్రాలను ప్రారంభించారు. "మన ముందే దాహంతో అలమటిస్తున్న వారిని చూస్తూ ఊరుకోలేకపోయాం"అన్నట్లుగా కాలనీవాసుల సేవాభావం అక్కడ ప్రతిఫలించింది. చిన్నచిన్న సహాయాలు కలిస్తే పెద్ద మార్పు తీసుకురాగలవని వారు తమ చేతలతో చూపించారు.ఈ చిన్న ప్రయత్నం ఎన్నో దాహాలను తీర్చడమే కాదు మానవత్వం ఇంకా బ్రతికే ఉందని చాటి చెప్పిన ఉదాహరణగా నిలిచింది.ఈ కార్యక్రమంలో కేసిఆర్ కాలనీ సంఘం అధ్యక్షుడు కట్ట ప్రభాకర్,గౌరవాధ్యక్షురాలు బాలమణి,ఇమ్రాన్, వెంకన్న,ఎల్లాగౌడ్,చాంద్ పాషా,గంగారం, యాదగిరి, మైసగౌడ్,రాజు,స్వామి,చంద్రం,లద్ద నరసింహులు, అవుసుల రవి,నరసింహులు, రాములు,బాబు, శ్రీశైలం,సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళా సాధికారతకు కాంగ్రెస్ అడ్డుగోడ..
# బీజేపీ నేత గోపాల్ గౌడ్




**ఉప్పల్,ఏప్రిల్18 (సూర్యరేఖ)** పార్లమెంటులో 33 శాతం మహిళా రిజర్వేషన్ బిల్లుకు (131వ రాజ్యాంగ సవరణ బిల్లు,2026) వ్యతిరేకంగా ఓటు వేసిన కాంగ్రెస్ పార్టీ,'ఇండి' కూటమి వైఖరిని తీవ్రంగా ఖండించటం జరిగింది.

?పార్లమెంటులో శుక్రవారం జరిగిన మహిళా రిజర్వేషన్ బిల్లు ఓటింగ్ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అనుసరించిన తీరు ఆపార్టీ ద్వంద్వ ప్రమాణాలకు నిదర్శనమని బీజేపీ నాయకులు గోపాల్ గౌడ్ మండిపడ్డారు.దేశంలోని కోట్లాది మంది మహిళల దశాబ్దాల కలను సాకారం చేసేందుకు నరేంద్రమోదీ ప్రభుత్వం చిత్తశుద్ధితో అడుగులు వేస్తుంటే,కాంగ్రెస్ పార్టీ రాజకీయ ప్రయోజనాల కోసం దాన్ని అడ్డుకోవడం అత్యంత దురదృష్టకరమని ఆయన అన్నారు.మహిళా వ్యతిరేక పార్టీ కాంగ్రెస్ 33% మహిళా రిజర్వేషన్లను అమలు చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేయడం ద్వారా,కాంగ్రెస్ పార్టీకి మహిళా సాధికారతపై ఉన్న చిత్తశుద్ధి ఏపాటిదో అర్థమవుతోందని గోపాల్ గౌడ్ విమర్శించారు.

**అభివృద్ధికి విఘాతం:** కేవలం రాజకీయ ఉనికి కోసం దేశాభివృద్ధిని,సామాజిక న్యాయాన్ని కాంగ్రెస్ అడ్డుకుంటోందని,'నారీశక్తి' పట్ల వారికి గౌరవం లేదని ఈ ఓటింగ్ ద్వారా స్పష్టమైందని ఆయన ఆరోపించారు.చారిత్రక అవకాశం చేజార్చారు దేశ అత్యున్నత సభలో మహిళలకు ప్రాతినిధ్యం పెంచే చారిత్రక అవకాశాన్ని కాంగ్రెస్ తన సంకుచిత రాజకీయాలతో అడ్డుకుందని,దీనికి ఆపార్టీ తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ప్రజలే బుద్ధి చెబుతారు.మహిళా లోకం ఈ విషయాన్ని గమనిస్తోందని,రాబోయే రోజుల్లో మహిళలే కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెబుతారని గోపాల్ గౌడ్ పేర్కొన్నారు. నరేంద్రమోదీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం మహిళలకు చట్టసభల్లో సముచిత స్థానం కల్పించే వరకు తన పోరాటాన్ని ఆపదని,కాంగ్రెస్ ఎన్ని అడ్డంకులు సృష్టించినా మహిళా సాధికారత సాధించి తీరుతామని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు.

# పోలీసుల వినూత్న ఆలోచన..




**రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు హెల్మెట్ బ్యాంక్ ఏర్పాటు..**

**నిజాంపేట,ఏప్రిల్18 (సూర్యరేఖ)** మండల కేంద్రంలో శనివారం ఎస్ఐ రాజేష్ ఆధ్వర్యంలో రోడ్డు ప్రమాదాల నివారణకై వినూత్న ఆలోచన చేపట్టారు.హెల్మెట్ ధరించని వాహనదారులకు జరిమాన విధించకుండా హెల్మెట్ బ్యాంకు ఏర్పాటు చేసి హెల్మెట్ కొనుగోలు చేయించి వారికి అందించడం జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు వాహనదారులకు ఫైన్లు విధించకుండా హెల్మెట్ ను కొనుగోలు చేస్తున్నామన్నారు. హెల్మెట్ లేనివారు హెల్మెట్ బ్యాంకును నిజాంపేటలో ఏర్పాటు చేయడం జరిగిందని తక్కువ ధరలో హెల్మెట్లను అందజేస్తున్నా మని ఈ చక్కటి అవకాశాన్ని వాహనదారులు సద్వినియం చేసుకోవాలన్నారు. పోలీస్ శాఖ సూచనలను పాటిస్తూ రోడ్డు ప్రమాదాల నివారణ కు భాగ్యస్వాములు కావాలన్నారు.ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ మురళీధర్,ప్రకాష్, కానిస్టేబుల్ నవీన్,విజయ్,మహేష్,అశోక్,రమేష్, లు ఉన్నారు.

## మహబూబాబాద్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పదవికి యువ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి పెరుమాండ్ల చరణ్ గౌడ్‌ను నియమించాలి..

**ఎన్ఎస్‌యూఐ మరిపెడ మండల మాజీ అధ్యక్షులు మంగీలాల్ నాయక్ డిమాండ్**



మరిపెడ,ఏప్రిల్18(సూర్యరేఖ) మహబూబాబాద్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పదవికి యువ కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి,ఎన్ఎస్‌యూఐ మహబూబాబాద్ జిల్లా మాజీ అధ్యక్షుడు పెరుమాండ్ల చరణ్ గౌడ్‌కు అవకాశం కల్పించాలని ఎన్ఎస్‌యూఐ మరిపెడ మండల మాజీ అధ్యక్షులు మంగీలాల్ నాయక్ డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా శనివారం మంగీలాల్ మాట్లాడుతూ...కాంగ్రెస్ పార్టీ కోసం విద్యార్థి దశ నుంచే కష్టపడి పనిచేసిన నాయకుల్లో పెరుమాండ్ల చరణ్ గౌడ్ ఒకరని ఆయన పేర్కొన్నారు.ఎన్ఎస్‌యూల వివిధ హోదాల్లో పనిచేసి,పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేశారని తెలిపారు.మహబూబాబాద్ జిల్లాలో యువత,విద్యార్థులు,బీసీ వర్గాల మధ్య పార్టీకి బలమైన మద్దతు ఏర్పడటంలో ఆయన కీలక పాత్ర పోషించారని అన్నారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రజాసమస్యలపై,నిరుద్యోగం, విద్యార్థుల సమస్యలు,రైతుల సమస్యలపై అనేక పోరాటాలు నిర్వహించి,పలు కేసులను ఎదుర్కొన్న నాయకుడు పెరుమాండ్ల చరణ్ గౌడ్ అని మంగీలాల్ నాయక్ తెలిపారు.ప్రజల కోసం పోరాడటంలో ఎప్పుడూ వెనుకడుగు వేయకుండా,అధికారానికి ఎదురు నిలిచిన ధైర్యవంతుడని కొనియాడారు.అదేవిధంగా కేంద్ర బీజేపీ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా హైదరాబాద్‌తో పాటు దేశ రాజధాని న్యూ ఢిల్లీలో జరిగిన అనేక నిరసన కార్యక్రమాల్లో పాల్గొని కాంగ్రెస్ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేశారని అన్నారు.ఇలాంటి నిజమైన పార్టీ కార్యకర్తను గుర్తించి, మహబూబాబాద్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పదవితో గౌరవించాలని,తద్వారా బీసీ వర్గాలకు,యువతకు, ఎన్ఎస్‌యూఐ కార్యకర్తలకు ప్రోత్సాహం లభిస్తుందని మంగీలాల్ నాయక్ పేర్కొన్నారు.పార్టీ కోసం నిరంతరం కష్టపడిన, పోరాట పంథాలో ముందుండే నాయకులకు గుర్తింపు ఇవ్వడం ద్వారా కాంగ్రెస్ పార్టీకి మరింత బలం చేకూరుతుందని ఆయన అన్నారు.

## త్రాగునీటి సమస్యకు చెక్--హ్యాండ్ బోరింగ్ పంపు ఏర్పాటు..

**సర్పంచ్ బానోత్ పద్మ రూప్లా**



**కారేపల్లి,ఏప్రిల్ 18(సూర్యరేఖ)** సింగరేణి మండలం పరిధిలోని చిన్నమడంపల్లి గ్రామ పంచాయతీకి చెందిన చిన్నమడంపల్లి గ్రామంలో దీర్ఘకాలంగా నెలకొన్న త్రాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది.గ్రామ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని హ్యాండ్ బోరింగ్ పంపును ఏర్పాటు చేయడం ద్వారా స్వచ్ఛమైన మంచినీరు అందుబాటులోకి వచ్చింది.ఈ కార్యక్రమానికి ఖమ్మం జిల్లా ఎంపీ రామసాయం రఘురామ్ రెడ్డి నిధులు మంజూరు చేయడం విశేషం.గ్రామంలోని నీటి కొరతను గుర్తించి నిధులు విడుదల చేసిన ఎంపీకి గ్రామ సర్పంచ్ బానోతు పద్మరూప్ల నాయక్ మరియు గ్రామ పెద్దలు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా సర్పంచ్ బానోతు పద్మ రూప్లనాయక్ మాట్లాడుతూ...గ్రామ అభివృద్ధి తమ ముఖ్యలక్ష్యమని,ప్రజల సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ ముందుకు సాగుతున్నామని తెలిపారు. త్రాగునీటి సమస్య పరిష్కారంతో గ్రామ ప్రజలకు ఎంతో ఉపశమనం కలిగిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ స్వర్ణలత,1వ వార్డు మెంబర్ సరికొండ సుజాత కోటేశ్వరరావు,2వ వార్డు మెంబర్ జిగట త్రివేణి పాపారావు,పంచాయతీ కార్యదర్శి సంజీవరావు,గ్రామ పెద్దలు బచ్చల కోటయ్య,మొగిలి అచ్చయ్య,కోరాస సీతారాములు, సురభక స్వామి,జిగట ముత్తయ్య,మాజీ సర్పంచ్ మొగిలి ఆదినారాయణ,మాజీ ఉపసర్పంచ్ బానోతు హుస్సేన్,మాజీ ఎంపీటీసీ బానోతు రమేష్ తదితరులు పాల్గొన్నారు.గ్రామ ప్రజలు సర్పంచ్ బానోతు పద్మరూప్ల నాయక్ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రశంసిస్తూ,గ్రామ అభివృద్ధికి ఆమె కృషి కొనసాగాలని ఆకాంక్షించారు.హ్యాండ్ బోరింగ్ పంపు ఏర్పాటు గ్రామానికి ఒక పెద్ద ఊరటగా మారింది.

## అంగన్వాడి కేంద్రంలో సామూహిక శ్రీమంతాలు



**నిజాంపేట,ఏప్రిల్18 (సూర్యరేఖ)** మండల కేంద్రంలోని అంగన్వాడీ కేంద్రంలో శనివారం గర్భిణీ స్త్రీలకు సామూహిక శ్రీమంతాలు చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గ్రామ సర్పంచ్ చలిమేటి నరేందర్ హాజరై గర్భిణీ స్త్రీలకు చీర గాజులు పండ్లను అందించారు.చిన్నపిల్లలకు గర్భిణీ స్త్రీలకు మంచి పోషకాలతో కూడిన పౌష్టికారాన్ని అందించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ బాబు,వార్డు సభ్యురాలు నజీమా, అంగన్వాడి టీచర్ అరుణ,ఉన్నారు.

## ఈనెల 20నుండి26 వరకు నిర్వహించనున్న

# “వెల్ఫేర్ వీక్” కార్యక్రమాన్ని నిర్వహించాలి..

**రాష్ట్ర ముఖ్య కార్యదర్శి రామకృష్ణ**

కామారెడ్డి,ఏప్రిల్ 18(సూర్యరేఖ)శనివారం అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో సిఎస్ పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా రాష్ట్రంలోని అన్ని వెల్ఫేర్ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్‌లలో విస్తృత స్థాయిలో కార్యక్రమాలు చేపట్టాలని ఆయన ఆదేశించారు.ఈ ఏడురోజుల ప్రత్యేక డ్రైవ్ లో ముఖ్యంగా కిచెన్,శానిటేషన్ సదుపాయాల మెరుగుదల,హాస్టల్ విద్యార్థుల కోసం టాలెంట్ ఫెస్ట్ నిర్వహణ, అవసరమైన మైనర్ రిపేర్స్ చేపట్టడం వంటి చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారుఅదేవిధంగా హాస్టల్స్,రెసిడెన్షియల్ పాఠశాలల్లో పేరెంట్స్-టీచర్ మీటింగ్స్ నిర్వహించి,విద్యార్థుల అభివృద్ధిపై చర్చించాల్సిందిగా సూచించారు. విద్యార్థుల నైపుణ్యాల పెంపుకు స్కిల్ డెవలప్మెంట్ ప్రోగ్రామ్‌లు, సమ్మర్ క్యాంప్‌లు,స్పోర్ట్స్,గేమ్స్,ఆర్ట్డ క్రాఫ్ట్ కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు.అలాగే



“బడిబాట”కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో విద్యాపట్ల ఆసక్తిని పెంపొందించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.వెల్ఫేర్ వీక్ సందర్భంగా విద్యార్థుల సమగ్ర అభివృద్ధి,సౌకర్యాల మెరుగుదల, శ్రేయస్సు లక్ష్యంగా అన్ని విభాగాలు సమన్వయంతో పని చేయాలని రాష్ట్ర ముఖ్యకార్యదర్శి సూచించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్లు విక్టర్,మేడంమోహన్ ఆర్డీఓలు ఎన్.వి గిరి, ప్రభాకర్,వెల్ఫేర్ ఆఫీసర్స్,తదితరులు పాల్గొన్నారు

## తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని కించపరిచిన

# తేజస్వి సూర్యను సస్పెండ్ చేయాలి..

**సిపిఐ(మం)మండల కార్యదర్శి గుండగాని మధుసూదన్**

మరిపెడ,ఏప్రిల్18(సూర్యరేఖ)తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని కించపరిచిన తేజస్వి సూర్యను సస్పెండ్ చేయాలని సిపిఐ(మం) మండల కార్యదర్శి గుండగాని మధుసూదన్ డిమాండ్ చేశారు.శనివారం మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం స్థానిక స్థానిక ప్రజా సంఘాల భవనంలో కామ్రేడ్ బాణాల రాజన్న అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ...భారత పార్లమెంటులో చట్టబద్ధంగా చేసి తెలంగాణ రాష్ట్రంగా ఏర్పడిన విధానాన్ని కర్ణాటక రాష్ట్రం బెంగుళూరు ప్రాంతానికి చెందిన ఎంపీ తేజస్వి సూర్య భారత్,పాకిస్తాన్ విభజనతో పోల్చడం దేశద్రోహానికి పాల్పడడం లాంటిదేనని ఆయన వివరించారు.తెలంగాణ ఆత్మగౌరవాన్ని పార్లమెంటు సాక్షిగా అవమానించినట్లేనన్నారు.దాదాపు1200 వందల మంది ప్రాణత్యాగాలతో తెలంగాణ వచ్చిందని గుర్తు చేశారు.బిజెపి ప్రభుత్వం ఎప్పుడైనా సౌత్ ఇండియా రాష్ట్రాలకి,వ్యతిరేకమని కుండా బద్దలు కొట్టారని,భారత పార్లమెంటులో ప్రత్యేక మహిళా బిల్లు పెట్టాల్సిన అవసరం ఏమి లేదన్నారు.గతంలో మహిళా బిల్లు పెట్టారు,ఆమోదం పొందినదాని గుర్తు చేశారు.మహిళా బిల్లు షాక్ తో డి లిమిటేషన్ పద్ధతిలో 131వ రాజ్యాంగ రాజ్యాంగ సవరణ ద్వారా దక్షిణ భారతదేశానికి తీవ్ర అన్యాయం చేస్తున్నారని దుయ్యబట్టారు.డీలిమినేషన్ పద్ధతిలో పార్లమెంట్ లో ఆమోదం పొందాలంటే 1/3 మెజార్టీ అవసరం కావాలన్నారు.కానీ ఆ మెజార్టీ ఎక్కడ కూడా బిజెపి సాధించలేక పోయిందని వివరించారు.మొత్తం ఓటింగ్ లో పాల్గొన్న ఎంపీల సంఖ్య 478 అయితే బిల్లు ఆమోదం పొందడనికి కావలసిన ఓట్లు 358,అనుకూలంగా వచ్చిన ఓట్లు 298,వ్యతిరేకంగా వచ్చిన ఓట్లు 230 అని వివరించారు,ఇప్పటికైనా బీజేపీ ప్రభుత్వం దక్షిణ భారతదేశం మీద కక్ష సాధింపు చర్యలను మానుకోవాలని,లేకుంటే భవిష్యత్తులో దక్షిణ భారత దేశంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు



వస్తాయని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మండల ఆర్గనైజర్ బాణాలు రాజన్న, మండల కమిటీ సభ్యులు ఐద్వా మండల కార్యదర్శి దంతు మమత,బోడపట్ల రాజశేఖర్,అందాల రమేష్ తదితరులు పాల్గొన్నారు

# తెలంగాణకు అన్యాయం జరిగితే చూస్తూ ఊరుకోం

**మహబూబ్ నగర్** మహబూబ్ నగర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి ,ఎమ్మెల్యేలు మధుసూదన్ రెడ్డి, వంశీ కృష్ణ తదితరులు మీడియా సమావేశం నిర్వహించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ భారతదేశ ప్రజాస్వామిక వ్యవస్థలో నియంతృత్వానికి తావులేదని లోకసభ లో నిరూపితమైంది. ప్రజాస్వామ్యాన్ని బలహీనపర్చాలనే వారికి నిన్నటి బిల్లు వీగిపోవడం చెంపపెట్టు లాంటిది. 44 సంవత్సరాలుగా వాళ్ళ పార్టీకి ఒక్క బీజేపీ మహిళా అధ్యక్షురాలు లేదు. కాంగ్రెస్ పార్టీ పురుషులతో సమానంగా మహిళలకు ఓటు హక్కు కల్పించింది. రాజీవ్ గాంధీ పంచాయతీ రాజ్ యాక్ట్. స్థానిక సంస్థలు ఎన్నికల్లో మహిళా రిజర్వేషన్లు తెచ్చింది కాంగ్రెస్ పార్టీ.. మహబూబ్ నగర్ మేయర్ మహిళా అయింది అంటే కాంగ్రెస్ పార్టీ . రాజకీయ పరమైన నియంతృత్వం. డిలిమిటేషన్ ద్వారా దక్షిణ భారతదేశానికి అన్యాయం జరిగే విధంగా సీట్లు పెంచడంతో పాటు దానికి మహిళా బిల్లు జోడించడం అంటే వారికి చిత్తశుద్ధి లేదు. మా పార్టీ అధ్యక్షురాలు, ప్రధాని,రాష్ట్రపతి, లోకసభ స్పీకర్ ను మహిళలను చేసిన చరిత్ర కాంగ్రెస్ దని అన్నారు. ఇప్పటికే ఆమోదం పొందిన మహిళా బిల్లు వచ్చే ఎన్నికల్లో రిజర్వేషన్లు వచ్చేలా పెట్టండి. మహిళా బిల్లులో ఎస్సీ ఎస్టీ బీసీ సబ్ కోటా ఉండాలని కాంగ్రెస్ పార్టీ స్టాండ్. సంఖ్యా బలం ఉందని ఇష్టారీతిన వ్యవహరించారు ప్రజాస్వామ్యాన్ని కాలరాసే విధంగా చట్టాన్ని నిర్వీర్యం చేసే విధంగా వ్యవహరించడం వల్లే బిల్లు వీగిపోయింది..హ్యాట్సాఫ్ ఇండియా కూటమి ఎంపీలకు 2/3 శాతంలో 54 ఓట్లు తక్కువ వచ్చాయి. మహిళలకు సంబంధించి మొసలి కన్నీరు కారుస్తూ డిలిమిటేషన్ తో లేకగడుతూ ఇండివిజువల్ కాకుండా బిల్లు పెట్టారు ప్రజాస్వామ్యాన్ని నిరంకుశత్వంగా కూని చేశారు. కాంగ్రెస్ పార్టీ మహిళా రిజర్వేషన్లకే కట్టుబడి ఉందని అన్నారు. మహిళా



సాధికారతగా వెళ్తున్న తెలంగాణ మహిళలు బీజేపీ కుట్రలు తిప్పికొట్టాలి. తెలంగాణ రాష్ట్ర ఆకాంక్ష దశాబ్దాలుగా ఉంది. విద్యార్థులు,యువకులు అమరులైతే ఆనాడు పార్లమెంట్ సభ్యుడిగా కొట్లాడి ఆర్టికల్ 3 ద్వారా లోకసభ,రాజ్యసభ లో ఆమోదం పొంది ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడింది. బీజేపీ ఎంపీ దుర్మార్గుడు తెలంగాణ విభజన ను భారత్ పాకిస్థాన్ విభజన తో పోల్చి అవమానపరిచే విధంగా మాట్లాడారు. అదే సభలో ఉన్న తెలంగాణ బీజేపీ ఎంపీలకు చీము నెత్తురు లేదా అని నిలదీసారు. బీజేపీ అధ్యక్షుడు రామచంద్రరావు,కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ కాకినాడ తీర్మానం లో ఒక ఓటు రెండు రాష్ట్రాలు అన్నది ఎవరు. మీ వల్లే తెలంగాణ ఆలస్యం అయింది. మాంధ్రులు తెలంగాణ విభజన ను వ్యతిరేకించిన స్వయంగా అద్వానీ తో చర్చించి సోనియా గాంధీ తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పరిచారు. తెలంగాణ రాష్ట్ర కోసం రాజీనామా చేయమని అంటే పారిపోయిన వ్యక్తి కిషన్ రెడ్డి తేజస్వి సూర్య తప్పుయింది అని ఒప్పుకున్నారు అని అంటున్నారు. తేజస్వి మాటలు రికార్డుల నుండి తొలగించకపోతే కిషన్ రెడ్డి,బండి సంజయ్,స్థానిక ఎంపీ డీకే అరుణ మీరు తెలంగాణ ద్రోహులుగా మిగులుతారు. ఇది రాజకీయం కాదు తెలంగాణ ఆత్మగౌరవం తెలంగాణ కోసం కాళ్లు మొక్కినొల్లం..పార్లమెంట్ లో కోట్లాడీనోల్లాం తెలంగాణ కు అన్యాయం జరిగితే చూస్తూ ఊరుకోం డిలిమిటేషన్ పై ఆల్ పార్టీ మీటింగ్ పెట్టీ మీ ఆలోచనలు చెప్పి సలహాలు సూచనలు అడిగారా, బిల్లు వీగిపోయిన బతికున్న చచ్చిపోయిన శవం లాగ. బీజేపీ కేంద్ర ప్రభుత్వం డిలిమిటెషన్ కి మహిళా బిల్లు కలిపి పెట్టొద్దు. రాహుల్ గాంధీ నాయకత్వంలో మహిళా రిజర్వేషన్ బిల్లు అమలు అవుతుందని అన్నారు.

### ఇచ్చిన మాటకు కట్టుబడి ఉన్న సర్పంచ్..



**నిజాంపేట,ఏప్రిల్18(సూర్యరేఖ)** మండల పరిధిలోని కాసింపూర్ తాడ గ్రామానికి చెందిన ధరావత్ వినోద్,కు రోడ్డు ప్రమాదంలో గాయాలయ్యాయి.విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ రామచందర్ నాయక్ బాధిత కుటుంబానికి 5వేల రూపాయల ఆర్థిక సాయం అందించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...సర్పంచ్ ఎన్నికలలో ఏదైనా ప్రమాదానికి గురైన వారికి ఆర్థిక సాయం అందిస్తానన్న మాటకు కట్టుబడి ఉన్నానని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ రమేష్, సుభాష్,రాజు,గణేష్,లు ఉన్నారు.

### బాధిత కుటుంబానికి సీఎంఆర్ఎఫ్ భరోసా..



**నిజాంపేట,ఏప్రిల్18(సూర్యరేఖ)** మండల కేంద్రానికి చెందిన మంగళి రాజేశ్వరికి మంజూరైన రూ.12వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును శనివారం సర్పంచ్ నరేందర్ చేతుల మీదుగా అందజేశారు.అనారోగ్య కారణాలతో చికిత్స పొందిన రాజేశ్వరి కుటుంబానికి ఈ నిధులు మంజూరయ్యాయి.చెక్కు మంజూరుకు సహకరించిన మెదక్ ఎంపీ రఘునందన్ రావుకు బాధితులు కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో ఉపసర్పంచ్ బాబు,మంగళి రాజు,ఉన్నారు.

# తెలంగాణ ఆత్మగౌరవాన్ని కాపాడలేకపోయినా కాంగ్రెస్,బిజెపి పార్టీలు..

**బిజెపి ఎంపీ వ్యాఖ్యలను తిప్పి కొట్ట లేకపోయినా ఆపార్టీలకు బుద్ధి చెప్పాలి..**

**మలిదశ ఉద్యమకారుడు,బిఆర్ఎస్ రాష్ట్ర మాజీ కార్యదర్శి నేర్ధం భాస్కర్ గౌడ్**



**ఉప్పల్,ఏప్రిల్18(సూర్యరేఖ)** తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో భాగస్వామ్యం లేని రాష్ట్ర ముఖ్యమం త్రిగా మంత్రులుగా కాంగ్రెస్ ప్రభుత్వం పరిపాలిస్తోందని తెలంగాణ ఉద్యమకారుడు బిఆర్ఎస్ రాష్ట్ర మాజీ కార్యదర్శి నేర్ధం భాస్కర్ గౌడ్ ఆరోపించారు.శనివారం జరిగిన తెలంగాణ ఉద్యమకారుల రాష్ట్ర సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు.రాష్ట్ర ఏర్పాటు కెసిఆర్ నాయకత్వంలో ఉద్యమకారులు ముందు వరుసలో ప్రాణత్యాగాలు చేసిన అమర కుటుంబాలు,ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను ఒక్కటి కూడా నెరవేర్చలేదని ఆవేదన వ్యక్తం చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వానికి తెలంగాణ ఉద్యమకారులు తెలంగాణ రాష్ట్ర ఉద్యమించిన కుటుంబాల గురించి ఉద్యమకారుల గురించి కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోవడం లేదన్నారు.ఉద్యమకారులకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.రాష్ట్ర గురించి పోరాడిన వారికి శుక్రవారం బిజెపి ఎంపీ తేజస్విని సూర్యతెలంగాణ రాష్ట్రాన్ని రాష్ట్ర సాధనలో అమరులైన ఉద్యమకారులని పాకిస్తాన్ ఉగ్రవాదులుగా తెలంగాణ రాష్ట్ర ప్రజలను గురించి మాట్లాడినప్పుడు తెలంగాణ రాష్ట్ర ప్రజల ఓటు ద్వారా కేంద్ర మంత్రులుగా ఉన్న బిజెపి కిషన్ రెడ్డి, బండి సంజయ్,కాంగ్రెస్ ఎనిమిది మంది ఎంపీలు పార్లమెంటు సాక్షిగా ఆఎంపీని ఎందుకు నిలదీయలేకపోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని, తెలంగాణ రాష్ట్ర ప్రజల ఆత్మ గౌరవాన్ని కాపాడలేకపోయినా ఆరెండు పార్టీలకు తెలంగాణ ప్రజలు తగిన సమయంలో గుణపాఠం నేర్పుతారని హెచ్చరించారు.తెలంగాణ రాష్ట్ర ప్రజలు ఓటు అడిగే నైతిక హక్కు ఆ రెండు పార్టీలకు లేదని పేర్కొన్నారు. ఉద్యమకారులు అందరు ఐక్యంగా తెలంగాణని కాపాడుకోవాల్సిన బాధ్యత ఉద్యమకారులుగా తెలంగాణ రాష్ట్ర ప్రజలందరిపై ఉందని వెల్లడించారు. ఈ సదస్సులో తెలంగాణ రాష్ట్ర 29జిల్లాల చెందిన ఉద్యమకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మహిళా రిజర్వేషన్ బిల్లుపై రగిలిన రాజకీయాలు..

**రామాయంపేటలో బీజేపీ రాస్తారోకో..**

పార్లమెంటులో మహిళా రిజర్వేషన్ బిల్లుకు వ్యతిరేకంగా ఓటింగ్ జరిగిన నేపథ్యంలో దేశవ్యాప్తంగా ఆగ్రహావేశాలు వెల్లువెత్తుతుండగా... రామాయంపేటలో బీజేపీ నేతలు రాస్తారోకో చేపట్టి 'మహిళా ద్రోహం'పై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు.రామాయంపేట,ఏప్రిల్18(సూర్య రేఖ) పార్లమెంటులో మహిళా రిజర్వేషన్ బిల్లుకు వ్యతిరేకంగా ఇండియా కూటమి ఓటు వేసిన చర్యను నిరసిస్తూ రామాయంపేట పట్టణంలో శనివారం బీజేపీ ఆధ్వర్యంలో మెయిన్ రోడ్డుపై రాస్తారోకో నిర్వహించారు.ఈ కార్యక్రమం స్థానికంగా ఉద్రిక్త వాతావరణాన్ని సృష్టించింది.ఈ సందర్భంగా భారతీయ జనతాపార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రాగి రాములు మాట్లాడుతూ...మహిళల సాధికారత కోసం తీసుకొచ్చిన కీలక బిల్లులు ఆమోదం పొందకపోవడం దేశ ప్రజాస్వామ్య చరిత్రలో 'చీకటి రోజు'గా నిలిచిందని తీవ్రంగా వ్యాఖ్యానించారు. ప్రధాని నరేంద్రమోదీ మహిళలకు 33శాతం రిజర్వేషన్లతో అభివృద్ధి దిశగా అడుగులు వేస్తుంటే, కాంగ్రెస్ మరియు ఇండియా కూటమి రాజకీయ ప్రయోజనాల కోసం దానిని అడ్డుకున్నాయని ఆరోపించారు.కాంగ్రెస్ నేతలు రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి మహిళల పట్ల వ్యతిరేక ధోరణి ప్రదర్శించారని ఆయన విమర్శించారు.మహిళా రిజర్వేషన్ అంశంపై కాంగ్రెస్ కూటమి "కాలకూట ˇక్కిందని" వ్యాఖ్యానిస్తూ,దేశంలోని ప్రతి తల్లి, అక్క,చెల్లికి ఇది అవమానకరమైన రోజుగా అభివర్ణించారు.మహిళలకు న్యాయం జరగకుండా చేయడం వెనుక రాజకీయ కుట్ర ఉందని ఆరోపించిన రాములు,"మహిళలు చట్టసభల్లోకి వచ్చి బీజేపీకి క్రెడిట్ ఇవ్వకుండా అడ్డుకోవడమే లక్ష్యంగా ఈ బిల్లును నిలిపివేశారని అన్నారు.డీలిమిటేషన్ సాకుతో ఈ నిర్ణయం తీసుకోవడం మహిళల హక్కులకు విరుద్ధమని పేర్కొన్నారు."మహిళలంటే కాంగ్రెస్ పార్టీకి కేవలం కొద్దిమంది ప్రముఖ కుటుంబాలకే



పరిమితమని విమర్శిస్తూ,సాధారణ మహిళలకు అవకాశాలు ఇవ్వడంలో కాంగ్రెస్ విఫలమైందని ఆరోపించారు.భవిష్యత్తులో మహిళలంతా ఐక్యంగా నిలబడి కాంగ్రెస్ కూటమికి తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.ఈ రాస్తారోకో కార్యక్రమంలో బీజేపీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని నినాదాలు చేస్తూ తమ నిరసనను వ్యక్తం చేశారు.పట్టణంలో కొంతసేపు రాకపోకలకు అంతరాయం కలగగా,పోలీసులు పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు.

### అరైవ్ అలైవ్ కార్యక్రమంలో గోల్కొండ ట్రాఫిక్ జోన్ వ్యాప్తంగా

# ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన ప్రత్యేక డ్రైవ్..





నాంపల్లి,హైదరాబాద్,ఏప్రిల్18(సూర్యరేఖ)ప్రజా పాలన ప్రగతి 99రోజుల ప్రణాళికలో చేపట్టిన "అరైవ్ అలైవ్ క్యాంపెయిన్ లో భాగంగా శనివారం గోల్కొండ ట్రాఫిక్ జోన్ వ్యాప్తంగా రోడ్డు భద్రత మరియు"ట్రాఫిక్ నిబంధనలు పాటించండి"అనే అంశంపై ప్రత్యేక అవగాహన,కౌన్సెలింగ్ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ సి.వేణుగోపాల్ రెడ్డి,ఏసీపీ డి.ధనలక్ష్మి,గోషామహల్ ఇన్స్పెక్టర్ బి.రాజు,ఆసిఫ్ నగర్ ఇన్స్పెక్టర్ కె.ఎన్.ప్రసాద్ వర్మ,కులసుంపురా ఇన్స్పెక్టర్ కె.రాజేంద్రప్రసాద్,టోలిచౌకి ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.ట్రాఫిక్ కమిషనర్ జోయల్ డేవిస్ ఐపీఎస్ పర్యవేక్షణలో ఆసిఫ్ నగర్ పిఎస్ పరిధి మెహదీపట్నం జంక్షన్,ఆసిఫ్ నగర్,కులసుంపురా పిఎస్ పరిధి పురానాపూల్,గోషామహల్ పిఎస్ పరిధి ఎం.జె మార్కెట్,టోలిచౌకి పిఎస్ పరిధి రేతిబౌలి వంటి కీలక జంక్షన్లలో ఈ కార్యక్రమం నిర్వహించబడింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పెరుగుతున్న జనాభా,పరిమిత రోడ్డు మౌలిక సదుపాయాల దృష్ట్యా ఫుట్పాత్ ఆక్రమణలు,రోడ్లపై వ్యాపారాలు మరియు రద్దీ ప్రాంతాల్లో ట్రాఫిక్ కదలికలు కష్టతరంగా మారుతున్నాయని,ముఖ్యంగా రాంగ్ సైడ్ డ్రైవింగ్,డ్రైవింగ్ చేస్తూ మొబైల్ ఫోన్ వాడటం,అతివేగం,అక్రమ పార్కింగ్ వంటి ఉల్లంఘనలు తీవ్రమైన ట్రాఫిక్ జామ్లకు కారణమవుతున్నాయన్నారు.దీనివల్ల అంబులెన్సు,అత్యవసర సేవలు,సాధారణ ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని అన్నారు.ఈ నేపథ్యంలో కేవలం చలానాలు విధించడం కంటే వాహనదారుల్లో ప్రవర్తనా మార్పు తీసుకురావడమే లక్ష్యంగా పోలీసులు ఈ కార్యక్రమాన్ని చేపట్టారన్నారు.నిబంధనలు ఉల్లంఘించిన వారిని గుర్తించి,రోడ్డు భద్రత ప్రాముఖ్యతను,నిబంధనలు పాటించకపోవడం వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ వారికి అవగాహన కల్పించారు.

# వడ్ల కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి..





**మార్కెట్ యార్డ్ చైర్మన్**

ధన్వాడ,ఏప్రిల్18(సూర్యరేఖ)రైతుల సౌకర్యం కోసం ఏర్పాటుచేసిన వడ్ల కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని నారాయణపేట మార్కెట్ యార్డ్ చైర్మన్ సదాశివరెడ్డి అన్నారు.శనివారం మండల కేంద్రమైన ధన్వాడ సింగల్ కార్యాలయంలో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ తో పాటు సీఈవో వెంకట్ రాములు మాట్లాడుతూ...ధన్వాడ విండో తరపున మండలంలో ఆరుగుడ్ల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు ధన్వాడతో పాటు మందపల్లి గుండ రామకృష్ణయ్య పల్లి గోటూర్ కొండ్రోన్ పల్లి గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.ఏ గ్రేడ్ వడ్ల ధర 2389,బి గ్రేడ్ వడ్ల దర 2369 నిర్ణయించడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వ్యక్తిగత సహాయకులు మాధవరెడ్డి,సర్పంచ్ జ్యోతి, ఉపసర్పంచ్ పూజారి నరసింహులు,వార్డు సభ్యులు తో పాటుగా వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు

### జిఆర్ పిట్రస్ట్ ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలు.. పాకజ్ఞానేశ్వరి రవిప్రసాద్

కామారెడ్డి,ఏప్రిల్18(సూర్యరేఖ)మా అమ్మ గారైన కీర్తిశేషులు పాక సావిత్రి



ఆశీస్సులతో అమ్మ అడుగు జాడల్లో నడవాలని గత 6సంవత్సరాల క్రితం నుండి తల్లిదండ్రులు లేని వారికి మరియు నిరుపేద పేద కుటుంబాల అమ్మాయిలకు పూస్తే,మట్టెలు మరియు ఆర్థిక సహాయం,పేద విద్యార్థులకు బుక్స్ కొరకు ఆర్థిక సహాయం అలాగే ఇంటి యజమాని చనిపోయిన వారి ఇంటికి 25కేజీల బియ్యం పంపిణీ చేయడం జరిగింది.భవానిపేట గ్రామానికి చెందిన రజక,కాబోయే కొత్త జంట కీర్తనకు నూతన బట్టలతోపాటు కిరాణా సామాగ్రి అందజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు,మాజీ కౌన్సిలర్ పాక జ్ఞానేశ్వరి రవి ప్రసాద్ గంగపుత్ర పాల్గొన్నారు.

### మందిపల్లిలో చలివేంద్రం ప్రారంభం..



ధన్వాడ,ఏప్రిల్18(సూర్యరేఖ)ధన్వాడ మండలం మందిపల్లి గ్రామంలో శనివారం గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ప్రారంభించారు.ఎండాకాలం సందర్భంగా గ్రామంలో చలివేంద్రాని ప్రారంభించి దాహార్తిని తీర్చారు.సర్పంచ్ సురేందర్ రెడ్డి వార్డు సభ్యులతో కలిసి చలివేంద్రాన్ని ప్రారంభించారు.గ్రామంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి జ్యోతి పాల్గొన్నారు

### గొప్ప కష్టాల వల్లే గొప్ప విజయాలు సాధ్యం.!

ధన్వాడ,ఏప్రిల్18 (సూర్యరేఖ) ఈలోకంలో మానవులు గొప్పనైన ఫలితాలు సాధించాలనుకుంటే ఎదురయ్యే కష్టాలను,ఎన్నో అడ్డంకులను ఎదుర్కోవడమ మార్గమని ధార్మిక ప్రవచకురాలు ఏ.నీరజాశ్రీనివాస్ అన్నారు.ధన్వాడ మండలం ధూప



దీప నైవేద్య అర్చక సంఘం ఆధ్వర్యంలో మండలంలోని యమునోనిపల్లి శ్రీఆంజనేయస్వామి దేవాలయంలో నిర్వహించిన కార్యక్రమం చాలా విజయవంతంగా ముగిసింది.ఈ సత్యమైనపై సందేశాన్ని శివపురాణంలోని క్షీరసాగర మధనం అనే అంశం మనకు గుర్తు చేస్తుందన్నారు. అదే క్రమంలో ఇందులో చెప్పబడిన హాలాహల భక్షణ కథ వినడం వల్ల మనకి ఎటువంటి ఇబ్బందులు లేని ధైర్య సాహసాలు కలుగుతాయనీ..ముఖ్యంగా ఈ కథా శ్రవణం వలన ఆ ప్రాంతంలో ఎటువంటి విష కీటకముల బాధలు గాని,అగ్ని ప్రమాదాలు,భయాలు ఉండవని అతిథి వక్తలుగా విచ్చేసిన ఏ.శ్రీశైలం అన్నారు.అదేవిధంగా ఎంతో దూరంగా ఉన్న పుణ్యక్షేత్రాలకు వెళ్లడం ఎంత ముఖ్యమో అంతకన్నా మన గ్రామాలలో మన వీధులలో సమీపంగా ఉన్న దేవాలయాలకు వెళ్లడం అంతే ముఖ్యమని అన్నారు.అదేవిధంగా ఈ కార్యక్రమంలో ధూప దీప నైవేద్య అర్చక సంఘం మండల అధ్యక్షులు పటేల్ నరసింహులు తొలి పలుకులు పలుకుతూ మానవ జన్మలోనైనా దైవ కార్యాల్లో పాల్గొంటూ దైవచింతనతో జన్మరాహిత్యం చేసుకోవాలన్నారు.ఇది ఒక నిరంతర ప్రక్రియని,ఇదే క్రమంలో ఇంకా మిగిలిన 12దేవాలయాల్లో కూడా ఈ ప్రవచనా కార్యక్రమాలు,అందరూ అర్చకుల సహకారంతో ప్రతి పౌర్ణమి అమావాస్యలకు వరుసగా కొనసాగుతాయని తెలిపారు.అనంతరం తీర్థ ప్రసాదాల వితరణ మంగళహారతి యధావిధిగా కొనసాగాయి.ఈ కార్యక్రమంలో స్థానిక దేవాలయ అర్చకులు కావలి కృష్ణయ్య,సర్పంచ్ నాగేష్,ఉప సర్పంచ్ సిద్ధు,అమ్మన్న ,ఎం.నర్సింలు,ఎం. సిద్ధు,మల్లయ్య,స oజప్ప,మనెమ్మ,సిద్ధమ్మ మొదలైన గ్రామస్తులు,మఠం చంద్రశేఖరయ్య, నాగరాజయ్య సుంకునరసింహులు,రాము,వెంకటస్వామి మొదలైన మండల అర్చకులు అందరూ పాల్గొన్నారు.

Ediited Printed & Published Mekkonda Premraj on behalf MPR publications and Printed RNI NO:TELTEL/ 2023/89546 Cell No.9397303326,